ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ fb.com/vaartha Digital

మాలేగాం పేలుళ్ల కేసులో ఏడుగురూ నిర్దోషులే
బిజెపితో ఒపిఎస్ తెగతెంపులు 5

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

1-8-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 181 పేజీలు: 10+4 వెల: 6.50

# రిపోర్టులో ఏముందో!

## కాళేశ్వరంపై నివేదికను ప్రభుత్వానికి అందించిన పిసి ఘోష్

### ప్రాజెక్టులో లోపాలు, అవినీతిపై 15 నెలలు విచారణ జరిపిన కమిషన్

### రెండు సీల్డ్ కవర్లలో వివరాలు భద్రం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై31:** కాళేశ్వరంప్రాజెక్టులో చోటు చేసుకున్న అవినీతిపై విచారించిన పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. నివేదికను సీల్డ్ కవర్‌లో ప్రభుత్వానికి అందజేశారు కాళేశ్వరం కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్. బీఆర్‌కే భవన్‌కు వెళ్లి.. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాకు నివేదికను అందజేశారు.రెండు సీల్డ్ కవర్లలో జస్టిస్ చంద్రఘోష్ నివేదికను హ్యాండోవర్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలు, అవినీతిపై 15 నెలల పాటు విచారణ జరిపారు జస్టిస్ పీసీ ఘోష్. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి పూర్తి విచారణ చేశారు. కమిషన్ అందించిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాహుల్ బొజ్జా అందజేయనున్నారు. కమిషన్ తన నివేదికలో ఏం పేర్కొంది.. ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. శుక్రవారం ఉదయం జస్టిస్ చంద్రఘోష్ తమ హోం సిటీ కోలకతాకు

>>2



గురువారం హైదరాబాద్‌లో నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు నివేదిక అందజేస్తున్న ఘోష్

## ఘోష్ నివేదికపై నేడు సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై31:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఇప్పటికే ప్రభుత్వానికి అందింది. ఈ నేపథ్యంలో ఈ నివేదికపై శుక్రవారం హైదరాబాద్‌లో కీలక సమావేశం జరగనుందని

>>2

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 31 :** తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్లపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. తీర్పు వచ్చిన మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అంతకు మించి సమయం తీసుకోవద్దని సుప్రీం గురువారం నాడు సూచించింది. అలాగే న్యాయస్థానమే అనర్హత వేటు వేయాలన్న విజ్ఞప్తిని కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని అత్యున్నత ధర్మాసనం తోసిపుచ్చింది. 'ఆపరేషన్ సక్సెస్ పేషెంట్ డెడ్' అన్న సూత్రం వర్తించకూడదని పేర్కొంది. ఈ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. పార్టీ మారుతున్న ఎమ్మెల్యేల పట్ల పార్లమెంట్ చట్టం తీసుకురావాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు వేశారు. ఈ ఏడాది జనవరి 15న దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో తొమ్మిదిసార్లు విచారణజరిగాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం అన్నిపక్షాల వాదనలు విన్న

## అనర్హత పిటిషన్లపై 'సుప్రీం' ఆదేశం

### న్యాయస్థానమే వేటు వేయాలనే విజ్ఞప్తిని తిరస్కరించిన సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనం

### పార్లమెంటు చట్టం చేయాలని సూచన

### న్యాయనిపుణులతో చర్చించిన పిమ్మటే తదుపరి చర్యలు: స్పీకర్

అనంతరం ఏప్రిల్ 3న తీర్పును రిజర్వు చేసింది. కాంగ్రెస్ కండువా కప్పుకున్న బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలలో దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, అరికపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్‌లు ఉన్నారు. సుదీర్ఘ వాదనల అనంతరం గురువారం తీర్పు వెలువడింది. కాగా, తెలంగాణలో 10 మంది ఎమ్మెల్యేలు బిఆర్‌ఎస్ తరఫున గెలిచి... కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని స్పీకర్‌ను బిఆర్‌ఎస్ కోరింది. స్పీకర్

>>2

# 'పిఎం కిసాన్'కు 6520 కోట్లు

## ఎన్‌సిడిసికి రెండు వేలకోట్లు

### 6 రాష్ట్రాల్లో 4 ట్రాకింగ్ ప్రాజెక్టులకు రూ.11,169 కోట్ల నిధులు

### కేంద్ర కేబినెట్ ఆమోదం



**న్యూఢిల్లీ,జూలై 31:** ప్రధాన మంత్రి కిసాన్ సంపదయోజనకింద 15వ ఆర్థికసంఘం సిఫారసులమేరకు కేబినెట్ 6520 కోట్ల ప్రణాళికను ఆమోదించింది. ఈమొత్తంలోనే అదనంగా 1920 కోట్లు కలిసి ఉండగా మొత్తం 6520 కోట్ల రూపాయల ప్రణాళికను రైతులకోసం ఆమోదించింది. ప్రధాని నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ సమావేశం వివరాలను సమాచార రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ వెల్లడించారు. ఈ మొత్తంలో 50కిపైగా బహుళ ఉత్పత్తుల ఫుడ్ ఇర్రేడియేషన్ యూనిట్లు స్థాపించేందుకు రూ.1000 కోట్లు కేటాయించారు. సమీకృత శీతల గిడ్డంగుల వ్యవస్థ, విలువలు జోడింపు మౌలికవనులు (ఇక్వాయ్)కింద ఈ యూనిట్లుస్థాపిస్తారు. అలాగే దేశవ్యాప్తంగా 100కు పైగా ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ ఉంటాయి. ఫుడ్‌సేఫ్టీ, క్వాలిటీ అస్యూరెన్స్ ఇన్‌ఫ్రాకింద ఈ ల్యాబ్‌లు ఏర్పాటయవుతాయి. ఈ విభాగాలన్నీ కూడా పిఎంకిసాన్ సంపదయోజనకిందకే వస్తాయి.అర్హులైన సంస్థలు, ఏజెన్సీలనుంచి ఆసక్తిచూపుతున్న టెండర్లను కూడా ఆహ్వానించి ఆ తర్వాత ఖరారుచేయడంజరుగుతుందన్నారు. మొత్తం 50 మల్టీఫుడ్ ఇర్రేడియేషన్ యూనిట్లు మొత్తంగా ఆహార ఉత్పత్తుల సంరక్షణ సామర్థ్యం 20 నుంచి 30 లక్షల మెట్రిక్‌టన్నులకు పెరుగుతుంది. అయితే ఆయా ఉత్పత్తుల వివరాలను బట్టి ఉంటుంది. అదేవిధంగా ప్రైవేటురంగంలో కూడా 100 నాక్ గుర్తింపు ఉన్న టెస్టింగ్ ల్యాబ్‌లను కూడా ఏర్పాటుచేయడం వల్ల సురక్షిత ఆహార ఉత్పత్తులను పంపిణీచేసేందుకు వీలవుతుందని కేంద్రం భావిస్తోంది. వీటితోపాటే దేశవ్యాప్తంగా కేంద్ర పథకం కింద జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్సీడీసీ)కి రూ.2000 కోట్ల గ్రాంట్ ఇన్‌ఎయిడ్ అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మొత్తంతో ఇపుడు ఎన్సీడీసి సుమారు 20 వేల కోట్లు ఓపెన్ మార్కెట్‌నుంచి సమీకరించేందుకు

>>2



గురువారం రంగాపూర్‌లో పాదయాత్ర చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, మీనాక్షి, మహేష్‌కుమార్ తదితరులు

# జనహితానికే పాదయాత్ర

## దేశానికే రోల్‌మోడల్ కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు

### రంగాపూర్ నుండి పాదయాత్ర ఆరంభించిన మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్

### ఢిల్లీలో జరిపే బిసి దీక్షకు మద్దతివ్వాలని పిలుపు

**పరిగి జులై31 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన జనహిత పాదయాత్ర గురువారం నాడు వికారాబాద్ జిల్లా, పరిగి నియోజక వర్గం రంగాపూర్ గ్రామం నుండి ప్రారంభించి పరిగి పట్టణం వరకూ సాగింది.ఏఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ,కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాక్షీ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ , వికారాబాద్ డిసిసి అద్యక్షులు,పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, ఇతర రాష్ట్ర ముఖ్యనేతలతో కలిసి , జనహిత పాదయాత్రను కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి ప్రారంభించారు.. రంగాపూర్ నుండి పరిగి చేరుకున్న తర్వాత అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన రోడ్ షోలో ఏఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ .. మాట్లాడుతూ... పాదయాత్రలు కాంగ్రెస్ పార్టీకి కొత్తేమి కాదని, దేశ ప్రజల కష్టసుఖాలను తెలుసుకోవడానికి రాహుల్ గాంధీ 2500 కిలోమీటర్లు పాదయాత్ర చేశారన్నారు.

జనహిత పాదయాత్రను ప్రజల వద్దకే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, పథకాలు అని చెప్పడానికి నిర్వహించమన్నారు.. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏరడ్డాక రాష్ట్రంలో అందిస్తున్న పథకాలతో దేశంలో తెలంగాణ మోడల్‌గా నిల్చిందని మీనాక్షి పేర్కొన్నారు. రైతు భరో, సా రుణమాఫీ పథకాలతో రైతులను ఆదుకున్నామని, ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ లో సన్న బియ్యం, ఎక్కడా లేవని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాడని , ప్రజలకు చేరువయ్యే పథకాలను అందిస్తామని తెలిపారు.42 శాతం రిజర్వేషన్ల ఆమోదానికై ఢిల్లీలో తలపెట్టిన నిరసన దీక్షకు మద్దతు తెలపాలని మీనాక్షి అన్నారు.అనంతరం పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉంటే బిఆర్‌ఎస్, బిజెపి పార్టీల నాయకుల ఓర్చుకోలేకపోతున్నారని అన్నారు.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చట్టసభలో ఆమోదించారని, కేంద్ర ప్రభుత్వం ఆమోదం కొరకు ఆగస్టు 5 , 6 ,7 తేదీల్లో ఢిల్లీలో తలపెట్టిన నిరసన దీక్షకు ప్రతి ఒక్కరు హాజరు అవ్వాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ, రాష్ట్ర ప్రజల అందిస్తున్న సేవలు చూసి ప్రతిపక్ష నాయకుల కడుపు మండుతోందని మహేష్ కుమార్ అన్నారు.పాదయాత్రలో భాగంగా రాష్ట్ర ముఖ్య నేతలు ,హనుమంతరావు, ప్రభుత్వ విప్ మహేందర్ రెడ్డి, రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యేలు మనోహర్ రెడ్డి, కాలె యాదయ్య, పర్ణిక రెడ్డి, ప్రకాష్ గౌడ్ రాష్ట్ర యువ నేతలు మహిళలు పాల్గొన్నారు.



# 4 వేల మంది టీచర్లకు పదోన్నతులు

### షెడ్యూల్ విడుదల చేసిన పాఠశాల విద్యా శాఖ

### రేపటి నుంచి 11 దాకా కొనసాగింపు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 31:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించనున్నారు. సెకండరీ గ్రేడ్ నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా, స్కూల్ అసిస్టెంట్ నుంచి గెజిటెడ్ హెడ్మాష్టర్‌గా పదోన్నతులు కల్పించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ గురువారం జారీ చేశారు. ఈ నెల 2 నుంచి పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమై ఈ నెల 11 వరకు కొనసాగనుంది. 10 రోజులపాటు పదోన్నతుల ప్రక్రియను కొనసాగించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4వేల మంది పదోన్నతులు లభించనున్నాయి. రాష్ట్రంలో సుమారు 900 గ్రేడ్-2 గెజిటెడ్ హెడ్మాష్టర్ పోస్టులు ఖాళీగా ఉండగా.. 650 వరకు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటితోపాటు ఖాళీగా ఉన్న 2వేల స్కూల్ అసిస్టెంట్(ఎస్‌ఏ)లకి ఎస్‌జిటి నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులు లభించే అవకాశం ఉంది. 900 గ్రేడ్-2 గెజిటెడ్ హెడ్మాష్టర్లుగా పదోన్నతులు పొందనున్న ఎస్‌ఏల ఖాళీల్లో కూడా 70 శాతం పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయనున్నారు. పదోన్నతుల మూలంగా 4వేల మంది పదోన్నతులు లభించనున్నాయి. అయితే పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్లను అవసరమైన పాఠశాలల్లో నియమించాలనే షరత వర్తిస్తుందని పాఠశాల విద్యశాఖ ఉత్తర్వులో పేర్కొంది. ప్రధానోపాధ్యాయులు గ్రేడ్-2 (గెజిటెడ్), స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన క్యాడర్‌ల ప్రస్తుత ఖాళీల ప్రదర్శన (ఆన్‌లైన్‌లో), ప్రధానోపాధ్యాయులు గ్రేడ్-2 (గెజిటెడ్) పోస్టులకు పదోన్నతి కోసం స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన క్యాడర్‌ల తాత్కాలిక సీనియారిటీ జాబితాలను ఈ నెల 2న ప్రకటిసానతరు. స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన క్యాడర్‌ల తాత్కాలిక సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలను

>>2

## నలుగురు హైకోర్టు జడ్జిల ప్రమాణం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూలై31:** హైకోర్టులో కొత్తగా నియమితులైన నలుగురు జడ్జిలు ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్, జస్టిస్ రామకృష్ణా రెడ్డి, జస్టిస్ సుద్దాల చలపతిరావు, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్‌తో సీజే జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణం చేయించారు. హైకోర్టులో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, లాయర్లు హాజరయ్యారు. హైకోర్టులో లాయర్లుగా ఉన్న ఈ నలుగురిని జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. దీంతోవారి నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 28న ఆమోదముద్రవేశారు. దీంతో రాష్ట్ర హైకోర్టులో జడ్జిల సంఖ్య 30కి చేరింది. హైకోర్టులో మొత్తం 42 మంది జడ్జిలు ఉండాలి.



గురువారం శ్రీశైలం గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసిన దృశ్యం

# కబ్జా చేస్తే ఖబడ్దార్

### ఆక్రమణలకు గురైన నీటి పారుదల భూముల స్వాధీనానికి మంత్రి ఉత్తమ్ ఆదేశం

### సోలార్ విద్యుత్‌ప్లాంట్ల ఏర్పాటుపై పరిశీలన: సమీక్షా సమావేశంలో మంత్రి వెల్లడి




గురువారం హైదరాబాద్‌లో అధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,జులై 31,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల శాఖ భూములపై ఆక్రమణలను తొలగించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిఆదేశించారు.ఆక్రమణకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని,మళ్ళీ ఆక్రమణలు జరగకుండా కంచెలు వేయాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.గురువారం డాకర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో నీటిపారుదల శాఖ,హైడ్రా,రెవెన్యూ,ఆర్,ఆర్ శాఖల అధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.వందల కోట్ల రూపాయల విలువైన నీటిపారుదల భూములపై ఆక్రమణలను సహించబోమని స్పష్టం చేశారు.ఈ భూములను కంచెలతో రక్షించి, వెంటనే తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.భూముల రక్షణలో

>>2

# శ్రీశైలానికి భారీ వరద


### 8 గేట్లు ఎత్తి సాగర్‌కు నీటి విడుదల

### జూరాలకు 2,01,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

### 18 గేట్లు ఎత్తి దిగువకు నీటివిడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 31, ప్రభాతవార్త:** శ్రీశైలం జలాశయానికి సుంకేసుల, జూరాల డ్యాంల నుంచి భారీగా వరద వచ్చి చేరుతున్నది. దీంతో శ్రీశైలం డ్యాం నిండుకుండను తలపిస్తున్నది. దీంతో ప్రాజెక్టు 8గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 25,691క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 1,58,624 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 69,138క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం నుంచి 2,53,453 క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. డ్యాం పూర్తి స్థాయినీటి మట్టం

>>2





గురువారం పార్లమెంటు ఆవరణలో మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్. చిత్రంలో ఎంపి ప్రియాంక

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం

>> ఏ నిర్ణయమూ తీసుకోకుండా ఉండటంతో ఈ విషయంపై బిఆర్ఎస్ పార్టీ హైకోర్టుకు వెళ్లింది. హైకోర్టు... స్పీకర్‌కు 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని చెప్పగా... స్పీకర్ తనను ఆదేశించే అధికారం హైకోర్టుకు లేదు అన్నారు. దీంతో విషయం సుప్రీంకోర్టుకు చేరింది. ఇప్పటికే ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల అంశానికి సంబంధించి స్పీకర్‌కు కోర్టులు సూచనలు చేయడం, చర్యలు తీసుకోవడానికి నిర్దేశిత కాలపరిమితి విధించే అంశంలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోవచ్చా? అన్న అంశంపై సుప్రీంకోర్టు.. తెలంగాణ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తరఫున న్యాయవాదుల వాదనలను విన్నది. మూడు రోజులపాటు వరుసగా దీనిపై వాదనలు నడిచాయి. తుది తీర్పును రిజర్వు చేస్తున్నట్టు సుప్రీంకోర్టు ఏప్రిల్ 3న ప్రకటించింది. దేశంలోని రెండు రాజ్యాంగ వ్యవస్థలకు సంబంధించిన అంశం కావడంతో సుదీర్ఘ వాదనలను విన్న జస్టిస్ గవాయ్ ధర్మాసనం తాము స్వయంగా వేటు వెయ్యలేమని స్పష్టం చేస్తూ దీనిపై మూడు నెలల్లో స్పీకరే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించిన దేశ అత్యున్నత న్యాయస్థానం ఏండ్ల తరబడి ఫిరాయింపు పిటీషన్లు పెండింగ్‌లో ఉంచడం సరికాదని తెలిపింది, దీంతో అక్టోబర్ 31వ తేదీలోపు ఫిరాయింపు పిటీషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.కాగా, అత్యున్నత న్యాయస్థానం తీర్పుపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పందించారు. తీర్పు కాపీ అందిన తర్వాత న్యాయ నిపుణులతో చర్చించి ముందుకెళ్లనున్నట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని, వివరణ ఇచ్చేందుకు ఎమ్మెల్యేలు సమయం కోరినట్లు స్పీకర్ ప్రసాద్ కుమార్ వివరించారు. రాష్ట్రపతిని, స్పీకర్లను కోర్టులు ప్రశ్నించలేవని మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఇటీవల వ్యాఖ్యానించారని గడ్డం ప్రసాద్ కుమార్ ప్రస్తావించారు. న్యాయనిపుణులతో చర్చించిన తర్వాతే తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు స్పీకర్ తెలిపారు.

## ఘోష్ నివేదికపై నేడు సమావేశం

>> తెలుస్తోంది. శుక్రవారం సచివాలయంలో ఈ నివేదికను సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆ శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా అందజేయనున్నారు. అనంతరం ఈ నివేదికపై వీరు చర్చించనున్నట్లు సమాచారం. వచ్చే కేబినెట్ భేటీలో ఈ నివేదికపై చర్చించి.. ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించింది. అందులో భాగంగా మేడిగడ్డ బ్యారేజీని నిర్మించింది. అయితే 2023 ఎన్నికలకు కొద్దిరోజుల ముందు మేడిగడ్డ బ్యారేజీలోని కొన్ని ఫిల్లర్లు కుంగాయి. లక్షల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ఈ ప్రాజెక్ట్‌లో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని.. అందుకే ఈ విధంగా జరిగిందంటూ నాటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఆరోపణలు గుప్పించాయి.

ఈ నేపథ్యంలో తాము అధికారంలోకి వస్తే.. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతామని ప్రజలకు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇంతలో ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఓటరు పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ కొలువు తీరింది. అనంతరం ఈ వ్యవహారంపై ఉమ్మడి ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్‌తో కమిషన్‌ను రేవంత్ రెడ్డి ఏర్పాటు చేశారు. 2024, మార్చిలో ఈ కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది. దాదాపు 15 నెలల పాటు అసిస్టెంట్ ఇంజనీర్ నుంచి ఇంజనీర్ ఇన్ చీఫ్ వరకు, పలువురు ఉన్నతాధికారులు, సిబ్బందిని సైతం ఈ కమిషన్ విచారించింది. అలాగే మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్ రావులను సైతం ఈ కమిషన్ విచారించింది. గురువారం కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్.. ఈ నివేదికను నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందజేశారు.అనంతరం ఆయన.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు అందజేసిన విషయం తెలిసిందే. అయితే తెలంగాణ సచివాలయంలో శుక్రవారం జరిగే కీలక సమావేశంలో జస్టిస్ పీసీ ఘోష్ సైతం హాజరయ్యే అవకాశముందని తెలిస్తుంది. అనంతరం ఆయన.. కోల్‌కతా బయలుదేరి వెళ్తారనే ప్రచారం సాగుతోంది.

## రిపోర్టులో ఏముందో!

>> తిరుగు ప్రయాణం కానున్నారు. ఈ క్రమంలోనే ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. కాళేశ్వరంపై కమిషన్ విచారణ ముగిసిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వానికి 650 పేజీలకు పైగా తుది నివేదక అందజేశామని పేర్కొన్నారు. కమిషన్ ఆర్డర్ ప్రకారం తుది రిపోర్టు ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం అంటే కౌన్సిల్ ఆఫ్ మినిస్టర్స్ అని ఆయన స్పష్టం చేశారు. కాళేశ్వరంపై నివేదిక ఇవ్వడమే తమ పని అని, సర్కార్ ఆ అంశంపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తనకు తెలియదని కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రఘోష్ వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ 2023 ఆఖరులో కుంగడం,పియర్స్ దెబ్బతినడంతో పాటు అన్నారం,సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడం, మిగిలిన బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు ఏర్పడటంపై విజిలెన్స్ విచారణతోపాటు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ)తో అధ్యయనం చేయించింది. లోపాలు తీవ్రంగా ఉన్నట్లు విజిలెన్స్ ప్రాథమిక నివేదిక సమర్పించింది. అసెంబ్లీలో చర్చ సందర్భంగా న్యాయ విచారణకు ఆదేశిస్తామని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ప్రకటించడంతోపాటు వెంటనే కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, భారతదేశ మొదటి లోక్‌పాల్ గా 2019 నుంచి 2022 వరకు పనిచేసిన జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో కమిషన్ ను ఏర్పాటు చేసింది.

జులై ఆఖరులోగా నివేదిక ఇవ్వాలని పేర్కొంది. అయితే కమిషన్ ఏర్పాటు ఉత్తర్వులు జస్టిస్ ఘోష్కు ఏప్రిల్లో అందగా, మే నెల నుంచి కార్యకలాపాలు ప్రారంభించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించడంతోపాటు ఎక్కువ మందిని విచారించాల్సి రావడం, క్రాస్ ఎగ్జామినేషన్, విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికల పరిశీలన.. ఇలా పలు కారణాలతో కమిషన్ గడువును ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. మొత్తంగా గురువారం జస్టిస్ పీసీ ఘోష్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

## 'పిఎం కిసాన్'కు 6520 కోట్లు

>> వీలవుతుంది. ఈ మొత్తాలను ఎన్సీడీసీ సహకారసంస్థలకు రుణాలు మంజూరుకు ఉపయోగపడుతుంది. అలాగే కొత్తప్రాజెక్టులు, ఉన్న ప్లాంట్ల విస్తరణ వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు ఈ నిధులనుంచి రుణాలు మంజూరు చేసేందుకువీలవుతుందని కేంద్రం అంచనావేసింది. ఈ కేటాయింపులవల్ల దేశంలో ఉన్న 13,288 సహకార సొసైటీల్లోని 2.9 కోట్లమంది సభ్యులకు మేలు జరుగుతుంది. డైయిరీ, లైవ్‌స్టాక్, మత్స్యశాఖ, చక్కెర, టెక్స్‌టైల్ ఆహారశుద్ధి, శీతల గిడ్డంగి వ్యవస్థలు, కార్మిక, మహిళా కోఆపరేటివ్స్ వంటివాటికి మేలు జరుగుతుందని అంచనా. అలాగే దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లోని 13 జిల్లాలకు మల్టీట్రాకింగ్‌ప్రాజెక్టులను ఆమోదించింది. ప్రస్తుతం భారతీయ రైల్వేల్లో 574 కిలోమీటర్ల మేర ఈ నెట్‌వర్క్ పనిచేస్తోంది. ఇందుకోసం రూ.11,169 కోట్లు అంచనా వ్యయాన్ని కూడా కేబినెట్ అంగీకరించింది. ఈ ప్రాజెక్టులవల్ల 22.9 కోట్ల మానవ పనిదినాలు కల్పించినట్లవుతుందని కేంద్రం భావిస్తోంది.

## శ్రీశైలానికి భారీ వరద

>> 885 అడుగులకుగానూ 882.90 అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 203.4290టీఎంసీలకు చేరింది. పవర్‌ఉత్పత్తి కోసం 66,079 క్యూసెక్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. శ్రీశైలానికి కర్ణాటకలోకి ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి నిరంతరంగా నీటివిడుదల కొనసాగుతున్నది. ఉమ్మడి పాలమూరులోని జూరాలకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులకు భారీ వరద వచ్చి చేరుతున్నది. కర్ణాటకలోకి ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. 18 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో జూరాల డ్యామ్‌కు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. జలాశయానికి 2,01,000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.207టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్‌హౌస్‌కు 25,205క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 1,79,316క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -2కు 750 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750,ఎడమ కాలువకు 1250క్యూసెక్కులు, కుడి కాలువకు 650క్యూసెక్కులు, సమాంతర కాలువకు 800క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 2,08,329 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

## వారం - వర్జ్యం

01-08-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
అష్టమి పూర్తి
స్వాతి రా.3.41
వర్జ్యం : ఉ.9.57-11.44
దు.ఉ.10.38-12.15,
2) రా.11.51-12.43
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** జీవితభాగస్వామి ద్వారా ధనలాభం పొందుతారు. కొత్త పెట్టుబడులు అనుకూలంగా వుంటాయి.

**వృషభం :** భూములకు సంబంధించి వివాదాలు తొలుగుతాయి. నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**మిథునం:** వాహనాలు, ఆభరణాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగాలలో హోదాలు లభిస్తాయి.

**కర్కాటకం:** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. దూర ప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు.

**సింహం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. దీర్ఘకాలిక రుణాలు కొంతవరకు తీరుస్తారు.

**కన్య :** ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ఆరోగ్యంపట్ల మెలుకవ అవసరం. సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**తుల :** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. కార్యాలయంలో ప్రతికూల వాతావరణం నెలకొంటుంది.

**వృశ్చికం:** వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా వుంటాయి. షేర్లు, భూముల క్రయ విక్రయాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల మెలకువ అవసరం.

**మకరం:** ఆర్థికపరమైన లావాదేవీలు సంతృప్తికరంగా సాగుతాయి. సన్నిహితుల నుండి ముఖ్యమైన సమాచారం అందుతుంది.

**కుంభం:** కీలక వ్యవహారాలలో పూర్తి చేస్తారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. గృహ నిర్మాణ ఆలోచనలు సాగిస్తారు.

**మీనం :** ఇంటా బయటా ప్రోత్సాహకరంగా ఉంటుంది. దూరపు బంధువులను కలిసి సంతోషంగా గడుపుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ధర్మస్థల మిస్టరీ మరణాల్లో ట్విస్ట్

## తవ్వకాల్లో పెద్ద ఎత్తున మానవ ఎముకలు లభ్యం



**బెంగళూరు,జూలై 31:** కర్ణాటక రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం 'ధర్మస్థల'లో అనుమానాస్పద మరణాలపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. సిట్ చీఫ్ ప్రణబ్ మొహంతి, డీఐజీఎంఎన్ అనుచేత్ ఆధ్వర్యంలో ధర్మస్థల మిస్టరీపై దర్యాప్తు కొనసాగుతోంది. పారిశుద్ధ్య కార్మికుడు చూపించిన ఆరో స్థలం లో ఇవాళ తవ్వకాలు జరుపగా ఎముకలు బయటపడ్డాయి. కర్ణాటక రాష్ట్రం శ్రీక్షేత్ర సమీపంలోని అటవీ ప్రాంతంలో తానే స్వయంగా కొన్ని శవాలను పూడ్చి పెట్టానని ఒకప్పుడు అక్కడ పనిచేసిన పారిశుద్ధ్య కార్మికుడు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసి సంచలనం రేపాడు. పారిశుద్ధ్య కార్మికుడి ఫిర్యాదు నేపథ్యంలో ఆ అనుమానాస్పద మరణాలపై కర్ణాటక ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. సిట్ చీఫ్‌గా ప్రణబ్ మొహంతిని నియమించింది. మొహంతి నేతృత్వంలోని సిట్ బృందం ఇప్పుడు ముమ్మరంగా కేసు దర్యాప్తు చేస్తోంది. సిట్ బృందానికి పారిశుద్ధ్య కార్మికుడు మొత్తం 14 ప్రదేశాలను చూపించాడు. ఆ 14 ప్రదేశాల్లో తవ్వకాల కోసం సిట్ 20 మంది కూలీలను నియమించుకుని తవ్వకాలు సాగిస్తోంది. గత సోమవారం నుంచి సిట్ దర్యాప్తు మొదలైంది. ఇప్పటికే ఐదు ప్రదేశాల్లో తవ్వకాలు పూర్తయ్యాయి.

తొలి ప్రదేశంలో గత వారం తవ్వకాలు జరుపగా ఒక చీటీ, ఒక పర్సు లభ్యమయ్యాయి. వాటిని పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ఆ తర్వాత నాలుగు ప్రదేశాల్లో తవ్వకాలు జరుపగా ఎలాంటి ఆనవాళ్లు లభ్యం కాలేదు. ఈ క్రమంలో పారిశుద్ధ్య కార్మికుడు చూపించిన ఆరో ప్రదేశంలో ఇవాళ సిట్ అధికారులు తవ్వకాలు జరిపించారు. ఈ తవ్వకాల్లో పెద్ద సంఖ్యలో ఎముకలు దొరికాయి. అనుమానాస్పద మరణాలకు సంబంధించి ఇప్పటివరకు సిట్ అధికారులకు దొరికిన తొలి ఆధారం ఇదే కావడం గమనార్హం. మరో ఎనిమిది ప్రదేశాల్లో కూడా సిట్ అధికారులు తవ్వకాలు జరపనున్నారు. మరిన్ని ఆధారాలు దొరికే అవకాశం ఉంది. తాను చూపించిన 14 ప్రదేశాలకుగాను 9 నుంచి 13 ప్రదేశాల్లో మానవ అవశేషాలు లభించే అవకాశం ఉందని పారిశుద్ధ్య కార్మికుడు చెబుతున్నాడు. నేత్రావతి నది స్నానఘట్టానికి అవతలివైపు ఉన్న ప్రాంతం నుంచి అధికారులు పరిశోధన ప్రారంభించారు.

## ప్రయాణీకుల సహనానికి పరీక్ష 'స్పెషల్ ట్రైన్లు'

### గంటల తరబడి ఆలస్యంగా నడుస్తున్న ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్,జూలై 31 ప్రభాతవార్త:** భారతీయ రైల్వే ప్రయాణీకులకు స్వాగతం పలుకుతోంది.సురక్షిత ప్రయాణం కోసం రైల్వేల్లోనే ప్రయాణం ఉత్తమం. అంటూ ప్రకటనలు వల్లెవేసే రైల్వేల్లో ప్రత్యేక రైళ్ల పేరిట నడుపుతున్న స్పెషల్ ట్రైన్లు ఎంత ఆలశ్యంగా నడుస్తున్నాయంటే కొన్ని రైళ్లు జీవితకాలం లేటు అన్నట్లుగా ఉన్నాయి. శ్రావణమాసం కావడంతో ప్రయాణీకులు దక్షిణాది రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు ఎక్కువ ఆసక్తిచూపిస్తారు. ఆసియాలోనే అత్యధిక దేవాలయాలున్న తమిళనాడుకు అయితే ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పోటెత్తి వెళుతుంటారు. వీటిని రద్దీని తట్టుకునేందుకు ప్రయాణీకులకు మరింతగా రవాణా సౌకర్యం ఏర్పాటుచేసేందుకు రైల్వేలు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నాయి. అంత వరకూ మంచిదే. ప్రయాణీకుల భద్రత, సంరక్షణ, సురక్షిత రవాణాకు రైల్వేలు చేపట్టిన కార్యాచరణ వేనోళ్ల కొనియాడదగినదే. ఎటొచ్చీ ఆరైళ్లు ఎప్పుడు వస్తాయో, మరెప్పుడు బయలుదేరతాయో కూడా అంతుబట్టకుండా ఉంటుంది. అరుణాచలం, తిరువణ్ణామలై, రామేశ్వరం, అరక్కోణం వంటి ప్రాంతాలతో పాటు కేరళలోని పద్మనాభ దేవాలయం, సీజన్‌లో అయితే శబరిమలైకు వెళ్లే భక్తులు విశేష సంఖ్యలో ఉంటుంటారు. వీరందరికోసం ప్రత్యేకంగా 'స్పెషల్ ట్రైన్' ప్రవేశపెట్టడం సర్వదా ప్రశంసనీయమే అయితే ఈ రైళ్లు ఏ సమయానికి ఏ స్టేషన్‌కు వస్తాయనేది ఆ భగవంతుడికే తెలియాలి. ఇటీవలే ఒక స్పెషల్ ట్రైన్ రామేశ్వరం-చెర్లపల్లి రావడానికి సుమారు 11 గంటలు ఆలశ్యంగా వచ్చింది. ఇలాగే ప్రత్యేక రైళ్లన్నీ కూడా నిర్దేశిత సమయానికి రాకపోవడంతో చిన్నపిల్లలతో ఉన్న కుటుంబాలు, దివ్యాంగులు, కొన్ని ప్రత్యేక వసతులు అవసరమైన వారు పడిగాపులు కాయాల్సి వస్తోంది. దీనివల్ల వారికి అదనపు వ్యయంతోపాటు ఓపిక నశించే విధంగా నిరీక్షణ తప్పడంలేదు. కేవలం దక్షిణ మధ్యరైల్వే అనడానికే వీలులేదు. అన్ని జోన్లలోను స్పెషల్ ట్రైన్లకు ఇదేపరిస్థితి. ఇటీవలే షిరిడి తిరుపతి మధ్యలో 16కి పైగా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. అయితే రైళ్లు ప్రయాణీకుల రద్దీని తగ్గించి వారికి సీట్లు లభించే విధంగా ఉంటాయి మంచిదే. ఇది ఎవ్వరూ కాదనలేని ప్రశంసనీయమైన ఏర్పాట్లు. అయితే వీటి రాకపోకల్లో జరుగుతున్న విపరీత ఆలశ్యం ప్రయాణీకుల సహనాన్ని పరీక్షిస్తోంది.అలాగే సరుకు రవాణాచేస్తే గూడ్స్ రైళ్లు వచ్చినా ఈప్రత్యేక రైళ్లు లూప్‌లైన్‌లోకి పోవాల్సిందే. కనీసం పదికి తక్కువకాని ప్లాట్‌ఫారాలున్న స్టేషన్లు అనేకం ఉన్నప్పటికీ ప్రత్యేకరైళ్ల పేరిట కొనసాగుతున్న ఆలశ్యం ప్రయాణీకుల సహనానికి పరీక్షగా మారుతోంది. దీనికితోడు ప్రయాణాల్లో అకస్మాత్తుగా గుండెపోటు రావడం ఫలితంగా సమీప ఆసుపత్రులకు వీరిని చేరవేసేందుకు కూడా ఈ రైలుబండి ఆలశ్యం ప్రాణాలను హరిస్తున్నదనే చెప్పాలి. ప్రత్యేకరైళ్లను ప్రవేశపెట్టడంతోపాటు అవి నిర్ణీత వేళల్లో నడిచేవిధంగా చర్యలు చేపట్టకపోతే ఎన్నికరైళ్లు నడిపినా ప్రయాణీకుల మన్ననలు పొందలేరన్నది రైల్వే ఉన్నతాధికారులు గుర్తించాలి. రైళ్లలో రిజర్వేషన్లు లభించకపోవడమో లేదా అత్యవసర సమయాల్లో స్పెషల్ గా వేసే రైళ్లను రైలు ప్రయాణికులు ఆశ్రయించి వెళ్లుతుంటారు ప్రయాణికులు.తీరా ఆ రైళ్లు ఎక్కితేగాని దాని సమస్య తెలియదని పలువురు రైళ్లు ఎక్కిన ప్రయాణికులు తమ అనుభవాలను వెలుబుచ్చుతున్నారు. ప్రతినెల రద్దీని తట్టుకునేందుకు దక్షిణ మధ్యరైల్వే సుమారు ఆయా ప్రాంతాలకు ప్రతి నెల సుమారుగా 500 ట్రైన్లను నడుపుతున్నారు. రెగ్యులర్‌గా వెళ్లే ట్రైన్ల మాదిరిగానే స్పెషల్ ట్రైన్లకు రెట్లను ఫిక్స్ చేస్తారు. కాని ఈ ట్రైన్లలో వెళ్లేవారు తరుచు గంటల తరబడి ట్రైన్లలో ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోంది. రెగ్యులర్‌గా వెళ్లే ట్రైన్ల మాదిరిగా ఇందులు సౌకార్యలు అంతంత మాత్రంగానే ఉంటాయని ప్రయాణికులు వాపోతున్నారు. జున్, జులై నెలల్లో సుమారుగా 1000 ట్రైన్లను రైల్వే డిపార్ట్‌మెంట్ నడిపిట్లు తెలిసింది. ఈ రైళ్లు ఎక్కువగా నార్త్ వైపు నడిపిస్తారు. ముఖ్యంగా విశాఖపట్నం, యస్వంత్‌పూర్, బెంగుళూరు, తిరుపతి, శిరిడి, పాట్నా, భూపాల్, చెన్నై, కేరళ, త్రివేంద్రం,రామేశ్వరంతో పాటు పలుప్రాంతాలకు రద్దీనిబట్టి స్పెషల్‌ట్రైన్లను నడుపుతుంటారు. ఎందుకు స్పెషల్ ట్రైన్లను ఆలస్యంగా నడుపుతారని ఆధికారులను ప్రశ్నించగా నాన్ షెల్డూడ్ అంటే ఇదే విదంగా ఉంటాయని బదులు చెబుతున్నారు. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతుంటే లేదా ఇంటర్ లాకింగ్ పనులు, ట్రాక్ సేఫ్టీ పనులు జరుగుతుండగా ట్రైన్లకు ఆలస్యం అవుతుందని అధికారులు చెబుతున్నారు. కేవలం దక్షిణ మధ్య రైల్వేలోనే కాకుండా ఇతర రైల్వేలల్లో కూడా స్పెషల్ ట్రైన్లు ఆలస్యంగానే నడుస్తాయంటు అధికారులు బదులు ఇస్తుండటం గమనార్హం.



కోల్‌కతాలోని లా విద్యార్థినిపై జరిగిన అత్యాచారంపై తృణమూల్ కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా గురువారం దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న భారతీయ జనతా యువ మోర్చా నాయకులు, కార్యకర్తలు

## పాశమైలారం సిగాచీ పరిశ్రమ పేలుడు ఘటన

### తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై31:** సంగారెడ్డి జిల్లా పాశమైలారం వద్ద ఉన్న సిగాచీ పరిశ్రమలో పేలుడు గత నెల 30న ఉదయం సమయంలో పేలుడు ఘటనకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై కె. బాబురావు అనే వ్యక్తి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు గురువారం విచారణ జరిపింది. సిగాచీ యాజమాన్యం సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే పేలుడు సంభవించిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 143 మంది కార్మికులు ఉన్నారని సిగాచి పరిశ్రమ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొందని, అయితే వాస్తవానికి 163 మంది కార్మికులు ఉన్నారని సెక్యూరిటీ గేటు వద్ద ఉన్న రిజిస్టర్లు, సీసీటీవీ రికార్డులు ధృవీకరిస్తున్నాయని వెల్లడించారు. ఈ దుర్ఘటనలో 8 మంది ఆచూకీ లభ్యం కావడం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది వసుదా నాగరాజు కోర్టుకు తెలియజేశారు. మృతుల ఆచూకీ లేని కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఇప్పటివరకు చెల్లించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతేకాకుండా పరిశ్రమ యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. పేలుడుకు గల కారణాలను అన్వేషించేందుకు ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని కోరారు. భానూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసును సిట్ ద్వారా దర్యాప్తు చేయించాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అన్ని పరిశ్రమలలో భద్రతా చర్యలు పటిష్ఠంగా ఉండేలా చూడాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు, మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేసింది.

## నౌకా ఎయిర్‌స్టేషన్‌వద్ద కూలిన ఎఫ్-35 యుద్ధవిమానం

**కాలిఫోర్నియా,జూలై 31:** అగ్రరాజ్యం అమెరికాలో ఓ యుద్ధ విమానం కుప్పకూలిపోయింది. సెంట్రల్ కాలిఫోర్నియాలోని నావల్ ఎయిర్ స్టేషన్ లెమూర్‌వద్ద ఎఫ్35 ఫైటర్ జెట్ బుధవారం కూలిపోయినట్లు యూఎస్ నేవీ ధృవీకరించింది. అయితే, ఈ ప్రమాదం నుంచి పైలట్ సురక్షితంగా బయటపడినట్లు తెలిపింది. పైలట్‌కు ఎలాంటి గాయాలూ కాలేదని పేర్కొంది. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం 4:30 గంటలకు జరిగింది. ఫైటర్ జెట్ కూలిన వెంటనే పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఇందుకు సంబంధించిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు యూఎస్ నేవీ తెలిపింది.

## సిఎం రేవంత్‌రెడ్డికి ఊరట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై31:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి కీలక ఉపశమనం కలిగింది. సిఎం రేవంత్‌రెడ్డిపై ఉన్న రెండు కేసులను హైకోర్టు కొట్టివేసింది. నల్లగొండ2 టౌన్,కొడిపల్లి పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసులను కొట్టివేస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది.

## పదోన్నతులు

>> సమర్పించడానికి ఆగస్టు 3న అవకాశం కల్పించారు. స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన క్యాడర్‌ల తాత్కాలిక సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాల పరిష్కారం చేసి తుది సీనియారిటీ జాబితాలను ఈ నెల 4, 5 తేదిల్లో ప్రకటిస్తారు. గ్రేడ్-2 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ పోస్టుల పదోన్నతి కోసం.. స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన క్యాడర్‌ల వారు వెబ్ ఆప్షన్ల ఈ నెల 6న ఇవ్వాల్సి ఉంటుంది. గ్రేడ్-2 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన వారికి ఈ నెల 7న ఉత్తర్వులు జారీ చేయనున్నారు. గ్రేడ్-2 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పోస్టులకు పదోన్నతి ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత.. స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన క్యాడర్‌ల ఖాళీలను ఈనెల 8, 9 తేదిల్లో ఆన్‌లైన్‌లో ప్రకటిస్తారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జిటి), తత్సమాన క్యాడర్‌ల తాత్కాలిక సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించి వాటిని పరిష్కారించిన.. తుది సీనియారిటీ జాబితాలను ఈ నెల 8, 9 వరకు ప్రకటిస్తారు. స్కూల్ అసిస్టెంట్స్, తత్స మాన క్యాడర్‌ల పోస్టులకు పదోన్నతి కోసం సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్‌జిటి), తత్సమాన క్యాడర్‌ల నుంచి ఈ నెల10న వెబ్ ఆప్షన్లను తీసుకోనున్నారు. జిల్లా కలెక్టర్ ఆమోదం పొందిన తర్వాత సెకండరీ గ్రేడ్‌టీచర్లు, తత్సమానక్యాడర్‌ల పోస్టులకు పదోన్నతి పొందిన వారికి ఈ నెల 11న ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

## కబ్జా చేస్తే ఖబడ్దార్

>> ఎదురయ్యే చటపరమైన సమస్యలను పరిష్కరించడానికి నీటిపారుదల శాఖ కోసం ప్రత్యేక జీపీని నియమించాలని అడ్వొకేట్ జనరల్‌నుకోరారు.హైదరాబాద్ లోని వాటర్ అండ్ ల్యాండ్ మేనేజమెంట్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, టీజీఈఆర్ఎల్ (తెలంగాణ గ్రౌండ్వాటర్ అండ్ ఇరిగేషన్ రీసెర్చ్ లాబొరేటరీ) సమీపంలోని గండిపేట,రాజేంద్రనగర్ ప్రాంతాలో 426.30 ఎకరాల భూమిలో131.31 ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని మంత్రి తెలిపారు.ఇందులో 81.26 ఎకరాలు ఐటీఐఆర్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇన్వెస్మెంట్ రీజియన్) పరిధిలోనివి కోర్టు వివాదంలో ఉండగా..మిగిలిన 50.13 ఎకరాలు నేరుగా ఆక్రమణకు గురయ్యాయన్నారు.ఈ ఆక్రమణలకు సంబంధించి 20 కేసులు జిల్లా కోర్టులో,2 కేసులు హైకోర్టులో పెండింగ్‌లోఉన్నాయని మంత్రి వెల్లడించారు.ఈ విలువైన భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి నీటిపారుదల హైడ్రా,రెవెన్యూ,ఆర్. ఆర్ అధికారులు సనువ్వయంతో పని చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నీటిపారుదల శాఖ భూములు, భవనాలు, క్వార్టర్స్ జాబితాను తయారు చేయాలని సూచించారు. అక్రమంగా ఆక్రమించిన నీటిపారుదల శాఖ రెసిడెన్షియల్ క్వార్టర్స్‌ను వెంటనే తిరిగి స్వాధీనం చేసుకోవాలని దీనిపై పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నీటిపారుదల కాలవలు, నీటి పారుదల ప్రాజెక్టుల పక్కన ఉన్న భూములపై సోలార్ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశాన్ని అధ్యయనం చేయాలని అ ధికారులను ఆదేశించారు. ఈ విషయం గత క్యాబినెట్ సమావేశంలో చర్చించామని, ఇటువంటి ప్రాజెక్టుల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను రాష్ట్రంలోని పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం ఉపయోగించవచ్చని కేబినెట్ అభిప్రాయ పడిందన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్, ఆర్,ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు, ఈఎన్సీ అఫ్జల్ హుస్సేన్, ఈఎన్సీ అడ్మిన్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సిఎ అధ్యక్షుడు జగన్మోహన్‌రావు సస్పెన్షన్

**హైదరాబాద్, జులై 31, ప్రభాతవార్త:** నిధుల గోల్‌మాల్, మోసం, అధికార బలాన్ని దుర్వినియోగం చేసిన నేపథ్యంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుతో పాటు కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి శ్రీనివాసరావును అపెక్స్ కౌన్సిల్ గురువారం సస్పెండ్ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. హెచ్‌సీఏలో అక్రమాలు, నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే.ఈ వ్యవహారంపై సీఐడీ, ఈడీ విచారణ కొనసాగిస్తున్నాయి. ఇప్పటికే జగన్మోహన్‌రావు, దేవరాజ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో వారిని సస్పెండ్ చేస్తూ అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. జులై 28న జరిగిన అత్యవసర సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నట్లు కౌన్సిల్ వివరించింది. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. పారదర్శకత, నైతిక విలువలకు కట్టుబడి ఉన్నామని, సంఘం న్యాయబద్ధతను కాపాడేందుకే చర్యలు తీసుకున్నామని హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్‌ప్రకటించింది.ఐపీఎల్ టికెట్ల ఇష్యూ, హెచ్‌సీఏ నిధుల గోల్‌మాల్ కేసులో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుతో పాటు జనరల్ సెక్రటరీ దేవరాజ్, ట్రెజరర్ జగన్నాథ్ శ్రీనివాసరావు, సీఈవో సునీల్‌కుమార్, శ్రీచక్ర క్రికెట్ క్లబ్ జనరల్ సెక్రటరీ రాజేందర్ యాదవ్‌తో పాటు అతడి భార్య కవిత మొత్తం ఆరుగురిపై సీఐడీ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

# ఆగస్టు 20 వరకు ఇంటర్ అడ్మిషన్లు

## టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల దృష్ట్యా గడువు పెంచిన బోర్డు

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్, ఎయిడెడ్ కాలేజీల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియను ఈ నెల 20 వరకు కొనసాగించనున్నారు. జులై 31 వరకు ఉన్న ఇంటర్ అడ్మిషన్ల రెండో విడత షెడ్యూల్‌ను పెంచుతూ ఇంటర్ బోర్డు నిర్ణయం తీసుకుంది. మే 31తో మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. ఈ నేపథనయంలో మే 31 వరకు జరిగిన అడ్మిషన్ల ప్రక్రియను జూన్ 30తో పూర్తిచేయాలని మే 1న జారీ చేసిన మొదటి విడత షెడ్యూల్‌లో ఇంటర్ బోర్డు కార్యదర్శి పేర్కొన్నారు. జూన్ 27న ఎస్ఎస్‌సి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు వెలువడిన నేపథ్యంలో జులై 31 వరకు రెండో విడత అడ్మిషన్ల ప్రక్రికు ఇంటర్ బోర్డు షెడ్యూల్‌ను జారీ చేస్తూ ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ప్రకటన జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, గురుకులాలు, మోడల్ స్కూల్, కేజీబీవీలు, కంపోజిట్ కాలేజీలు అన్ని కూడా అమలు చేయాలని బోర్డు కార్యదర్శి ఉత్తర్వులో స్పష్టం చేశారు. టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఇంటర్ అడ్మిషన్ల షెడ్యూల్‌ను మరోసారి ఈ నెల 20 వరకు పొడిగిస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇదే చివరి అవకాశమని ఇంటర్ బోర్డు కార్యదర్శి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు.

# గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా అలగు వర్షిణి

## అదనపు బాధ్యతలు ఇస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

## బాధ్యతలు స్వీకరించిన గురుకుల సొసైటీ సెక్రటరీ

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శిగా డాక్టర్ వీఎస్ అలగు వర్షిణికి అదనపు బాధ్యతలు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శితోపాటు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఎస్‌సి గురుకుల సొసైటీ కార్యదర్శిగా ఉన్న వీఎస్ అలగు వర్షిణి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి, కమిషనర్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. గురువారం సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా బాధ్యతలను చేపట్టారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావుని మర్యాద పూర్వకంగా కలిశారు. అలుగు వర్షిణి ప్రస్తుతం ఎస్‌సి గురుకుల సొసైటీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

# మంత్రివర్గంలో స్థానం కల్పించాలంటూ గాంధీభవన్ ముందు ఎస్టీ పోరాట సమితి ఆందోళన

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** హైదరాబాద్ లోని కాంగ్రెస్ పార్టీప్రధాన కార్యాలయమైన గాంధీ భవన్ వద్ద ఉద్రిక్తవాతావరణం నెలకొంది. గురువారం ఉదయం పెద్ద ఎత్తున నగరానికి వచ్చిన ఎస్టీపోరాట సమితి నేతలు గాంధీ భవన్ ముందు ఆందోళనకు దిగారు. మంత్రి వర్గంలో ఎస్టీలకు స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూవారు నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గాంధీ భవన్‌లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేయడంతో.. పోలీసులు వారిని అడుకున్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడ వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని ఆందోళన వ్యక్తం చేస్తున్న ఎస్టీ పోరాట సమితి నేతలను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

# కరవు అంచనా తగ్గించేందుకు అంతరిక్ష సాంకేతిక సాధనాలు అభివృద్ధి కాలేదు

## రాజ్యసభలో ఎంపి రఘునాథరెడ్డికి కేంద్రమంత్రి జితేంద్రసింగ్ సమాధానం

**రాజంపేట, జూలై 31 ప్రభాతవార్త** సాంప్రదాయకంగా కరువు పీడిత ప్రాంతాలలో కరువులను అంచనా వేయడానికి, మరియు తగ్గించడానికి ఇంకా అంతరిక్ష సాంకేతిక సాధనాలను అభివృద్ధి జరగలేదని కేంద్ర మంత్రి జితేందర్ సింగ్ వెల్లడించారు. అయితే, వ్యవసాయ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర సంస్థల సహకారంతో ఇస్రో, డిఓఎస్ కరువు పర్యవేక్షణ దాని ప్రభావ అంచనా కోసం నాదామ్స్ వ్యవస్థను అభివృద్ధి చేసి అమలు చేసిందని పేర్కొన్నారు. రాజ్యసభలో వైసీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి వ్యవసాయానికి అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం, దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి, రాయలసీమలోని కరువు పీడిత ప్రాంతాలలో వ్యవసాయంలో అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞాన అనువర్తనాలను ప్రోత్సహించడానికి తీసుకున్న చర్యలు, కరువులను అంచనా వేయడానికి, తగ్గించడానికి అందుబాటులో ఉన్న అంతరిక్ష సాంకేతిక సాధనాల వివరాలను అడిగారు. అందుకు కేంద్ర మంత్రి సమాధానం ఇస్తూ పంట వాతావరణ పరిశీలన వ్యవస్థ కింద వాతావరణ, ఉపగ్రహ ఆధారిత ఉత్పత్తులను, నేల, తేమ సూచికలు, కరువు సూచికలు ఉత్పత్తి చేయడంలో అంతరిక్ష శాఖ, వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖకు మద్దతు ఇస్తోందని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ వంటి కరువు పీడిత ప్రాంతాలకు ప్రత్యేకంగా, ఈ డేటాసెట్‌లు వాతావరణ క్రమరాహిత్యాలను ముందస్తుగా గుర్తించడంలో, పంట పరిస్థితిని పర్యవేక్షించడంలో , పంట కాలంలో కరువు తీవ్రతను అంచనా వేయడంలో సహాయపడ తాయని పేర్కొన్నారు. వాతావరణ, రిమోట్ సెన్సింగ్ , క్షేత్ర డేటాను నేషనల్ అగ్రికల్చరల్ డ్రౌట్ అసెస్‌మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ ఉపయోగించి కరువును అంచనా వేయడానికి పర్యవేక్షించడానికి ఒక కార్యాచరణ పద్ధతిని అభివృద్ధి చేసిందని అన్నారు. ఈ పద్ధతిని వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ యొక్క మహాలనోబిస్ జాతీయ పంట సూచన కేంద్రానికి బదిలీ చేసిందని వివరించారు. ఉపగ్రహ రిమోట్ సెన్సింగ్, వాతావరణ డేటాను ఉపయోగించి ఆంధ్ర, రాయలసీమతో సహా జాతీయ స్థాయి జియోస్పేషియల్ కరువు అంచనా పోర్టల్ ను అభివృద్ధి చేసిందని తెలిపారు.

# రాష్ట్రంలో మైక్రోబ్రూవరీలకు గ్రీన్‌సిగ్నల్

## ఇకపై అన్ని కార్పొరేషన్లలో లభ్యం

## త్వరలో నోటిఫికేషన్

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం మైక్రోబ్రూవరీల విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటివరకు హైదరాబాద్‌కే పరిమితమైన ఈ బ్రూవరీలు ఇకపై అన్ని మునిసిపల్ కార్పొరేషన్లకు విస్తరించనున్నాయి. వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం వంటి నగరాల్లోనూ మైక్రోబ్రూవరీల ఏర్పాటుకు అనుమతులు లభించనున్నాయి. త్వరలో దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కానుంది. దీనివల్ల క్రాఫ్ట్‌బీర్ ప్రియులకు కొత్త రుచులు అందుబాటులోకి రావడంతో పాటు, ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరుగుతుందని అంచనా. తెలంగాణలో మందుబాబులకు గుడ్‌న్యూస్. ప్రభుత్వం మైక్రోబ్రూవరీల విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటివరకు హైదరాబాద్‌కే పరిమితమైన ఈ బ్రూవరీలు ఇకపై రాష్ట్రంలోని అన్ని మునిసిపల్ కార్పొరేషన్లకు విస్తరించ నున్నాయి. ఈ మేరకు నిబంధనల సవరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ముఖ్యంగా 2017 నుంచే వరంగల్ నుంచి దరఖాస్తులు వస్తుండటంతో.. ఇతర కార్పొరేషన్ల పరిధిలో మైక్రో బ్రూవరీలను అనుమతించాలని నిర్ణయించారు. ఆగస్టులో దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలున్నాయి. సాధారణంగా పెద్ద వాణిజ్య బ్రూవరీల మాదిరిగా కాకుండా, మైక్రోబ్రూవరీలలో చిన్న స్థాయిలో బీరు ఉత్పత్తి అవుతుంది. ఇవి తరచుగా కొత్త, ప్రత్యేకమైన రుచులతో క్రాఫ్ట్ బీర్‌లను తయారు చేస్తాయి. ఈ బీర్‌ను అదే ప్రాంగణంలో లేదా స్థానికంగా విక్రయిస్తారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని 18 మైక్రో బ్రూవరీలు యువతకు, క్రాఫ్ట్‌బీర్ ప్రియులకు ప్రధాన వినోద కేంద్రాలుగా మారాయి. పండుగలు, ప్రత్యేక సీజన్ల కోసం సీజనల్ బ్రూస్‌లను తయారు చేస్తారు. కొన్ని చోట్ల బీరు తయారీ ప్రక్రియను దగ్గరగా చూసే అవకాశం కల్పిస్తారు. తెలంగాణలో బీర్ల అమ్మకాలు ఇతర రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రల కంటే ఎక్కువగా ఉన్నాయి. పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని, మైక్రోబ్రూవరీల విస్తరణ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతుందని ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తోంది. ఇప్పటికే ఢిల్లీ, ముంబై, బెంగళూరులలో అధిక సంఖ్యలో మైక్రోబ్రూవరీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో హైదరా బాద్‌లో కూడా వాటి సంఖ్యను పెంచడంపై ఎక్సైజ్ శాఖ దృష్టి సారించింది. జీహెచ్ఎంసీ పరిధిని దాటి ఔటర్ రింగ్ రోడ్డు లోపల వరకు అనుమతి ఇవ్వడం ద్వారా మరిన్ని బ్రూవరీలకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు వంపింది. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు, ఇకపై వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, రామగుండం, ఖమ్మం వంటి మున్సిపల్ కార్పొరేషన్లలో కూడా మైక్రోబ్రూవరీలను ఏర్పాటు చేసేందుకు అనుమతులు లభిస్తాయి. స్థానిక ఆసక్తిని బట్టి ఒక్కో కార్పొరేషన్‌లో ఒకటి కంటే ఎక్కువ బ్రూవరీలను ఏర్పాటు చేసుకోవచ్చు. త్వరలోనే ఈ విషయమై తుది నిర్ణయం తీసుకుని, కొత్త లైసెన్స్‌ల జారీకి మార్గదర్శకాలను రూపొందించే అవకాశం ఉంది. ఎక్సైజ్ శాఖ ఆగస్టులోనే దీనిపై నోటిఫికేషన్ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నిర్ణయంతో మందుబాబులకు కావాల్సిన బీర్లు దొరకటంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం కూడా పెరుగుతుందని అంచనా.

# మంచిర్యాలలో సైబర్ మోసం గుట్టురట్టు

## టిజిసిఎస్‌బి, టెలికమ్యూనికేషన్.. పోలీసుల జాయింట్ ఆపరేషన్‌లో గుర్తింపు

## అక్రమ సిమ్‌కార్డులతో నేరాల దందా

## నలుగురిని అరెస్ట్ చేసిన సైబర్‌క్రైం పోలీసులు

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** గుట్టుచప్పుడు కాకుండా ఇంటిలో సెటప్ ఏర్పాటు చేసి ఎవరికీ అనుమానం రాకుండా, గుర్తించకుండా అక్రమ సిమ్‌కార్డులతో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ముఠాపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దాడులకు పాల్పడింది. సైబర్ నేరస్తులు ఏర్పాటు చేసుకున్న సెటప్‌ను చూసి నివ్వెరపోయారు. ఆగమేఘాలపై అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా నల్గురు దొరకగా..ప్రధాన నిందితుడితోపాటు ఇద్దరు పరారయ్యారు. మంచిర్యాల జిల్లా జన్నారంలో సెటప్ చేసిన ఇంటిని గుర్తించి దాడి చేయడంతో సైబర్‌మోసాల గుట్టు వెలుగుచూసింది. అయితే కొంతకాలంగా సైబర్‌నేరాలు వరుసకట్టడంతో టెలికమ్యూనికేషన్, సెక్యూరిటీ బ్యూరో నిఘా పెట్టింది. దీంతో మంచిర్యాల జిల్లా నుంచి నేరదందా సాగుతుందని తెలుసుకొని రామగుండం పోలీసులతో కలిసి ఇంటిని కనుగొన్నారు. మరింత లోతుగా దర్యాప్తు చేపట్టడంతో ఏడుగురుతో కలిపిన ముఠా టెలిగ్రామ్‌తో అమాయకులకు ఫోన్‌లు చేసి సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. నకిలీ చిరునామాలు, పేర్లతో సిమ్ కార్డులను కొనుగోలు చేశారు. అయితే పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు పలవల్సుల సాయికృష్ణ అలియాస్ జాక్‌రాజు ఆధ్వర్యంలో కలాపాలు సాగిస్తున్నారు. అయితే జగిత్యాల జిల్లాకు చెందిన బావు బాపయ్య (43) గతేడాది కంబోడియాకు వెళ్లి రెస్టారెంట్‌లో పనిచేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అంతకుముందు వీరిద్దరు చండీ గఢ్ లో కలవడంతో సాయికృష్ణ ఉన్న కంబోడియాకు వెళ్లి ఆయనను కలుసుకున్నారు. అనంతరం స్వదేశానికి రావడంతో బాపయ్య అక్కడి నుంచి సైబర్ నేరాల సెటప్ బాక్సును పార్సిల్ ద్వారా పంపించి జన్నారంలో ఏర్పాటు చేయాలని సూచించడంతో బాపయ్య బావమరిది నిందితుడు రాజేష్ మద్దతుతో ఇంటిని అద్దెకు తీసుకొని ప్రారంభించారు. మరో నిందితుడు బావు మధుకర్‌ను సైతం కలుపుకున్నారు. తర్వాత ఓ నెట్‌వర్క్ డీలర్‌తో నెట్ కనెక్షన్ ఏర్పాటు చేసుకున్నారు. దీంతో వారిద్దరితో పాటు రాజేశ్వర్‌లకు జీతం కూడా ఇస్తానని, వాటా సైతం ఉంటుందని నమ్మబలికాడు. నిరుద్యోగి అయిన యాంద్రపు కామేశ్ (24)టెలిగ్రామ్ నెంబర్ల కోసం నియమించుకోవడంతో డీలింక్ రూటర్లు, భారీస్థాయిలో చిరునామాలేని సిమ్‌కార్డులు కొనుగోలు చేశారు. ఇలా సైబర్ నేరాలకు పాల్పడడంతో జాయింట్ ఆపరేషన్‌తో నిఘాపెట్టి నల్గురిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. కామేశ్, బావు బాపయ్య, మధుకర్(32) రాజేశ్వర్ (40)లను అదుపు లోకి తీసుకోగా సాయికృష్ణతో పాటు జయవర్ధన్, సింహాద్రి పరారీలో ఉన్నారు. వీరి ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సైబర్ మోసాలపై ఇంటర్నెట్ ప్రొవైడర్లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నిందిత ముఠా నుంచి సిమ్ బాక్సులు, ఇంటర్నెట్‌మోడెం, నాలుగు మొబైల్స్, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

# 10 నియోజకవర్గాల్లో ఉపఎన్నికకు 3 నెలల సమయం

## సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన మాజీమంత్రి కెటిఆర్

## పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో మరింత విచారణ అవసరం లేదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 31:** పార్టీ ఫిరా యింపులపై సుప్రీంకోర్టు వెలువ రించిన తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ తీర్పును బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తుందని ఆయన అన్నారు. పది నియోజక వర్గాల్లో ఉప ఎన్నికలకు మూడు నెలల సమయం ఉందని, పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ తీర్పు ద్వారా సుప్రీంకోర్టు ప్రజాస్వామ్యాన్ని కాపాడిందని ఆయన పేర్కొన్నారు. సీజేఐకి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కొంతమంది ప్రజా ప్రతినిధులు అడ్డదారులు తొక్కినంత మాత్రాన భారతదేశ ప్రజాస్వామిక వ్యవస్థ నాశనం కాదని సుప్రీంకోర్టు తీర్పు నిరూపించిందని కేటీఆర్ అన్నారు. గత ఎన్నికల సందర్భంగా పార్టీ మారితే ఆటోమేటిక్‌గా అనర్హత వర్తించాలని చెప్పిన రాహుల్ గాంధీ, సుప్రీంకోర్టు తీర్పుని స్వాగతిస్తారని ఆశిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ తాను చెప్పే మాటలకి, నీతినియమాలకు కట్టు బడి ఉండాలని సూచించారు. దమ్ముంటే, నిజాయతీ ఉంటే అనర్హత వేటు విషయంలో పాంచ్ న్యాయ్ పేరుతో చెప్పిన నీతులను ఆచరణలో చూపించాలని రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ స్పీకర్ అధికారాలను అడ్డం పెట్టుకొని భారత రాజ్యాంగాన్ని ఇకపై అవహేళన చేయబోరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ మారిన పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో మరింత విచారణ అవసరం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారిక కార్యక్రమాల్లో ప్రతిరోజు పాల్గొం టున్న ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై వెంటనే అనర్హత వేటు వేస్తూ నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ తరఫున సుప్రీంకోర్టులో వాదించిన న్యాయ బృందానికి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. అంతిమంగా సత్యం, ధర్మం గెలిచాయని ఆయన పేర్కొన్నారు.

# ఉద్దేశపూర్వకంగా శాంతి భద్రతల పరిస్థితికి భంగం కలిగిస్తున్న మాజీ సిఎం జగన్

## ఎపి హోంమంత్రి అనిత



**విజయవాడ, జూలై 31, ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై బల ప్రదర్శన కోసమే అన్నట్లు ఉన్నాయని హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. ఆయన ఉద్దేశపూర్వకంగా శాంతి భద్రతల పరిస్థితికి భంగం కలిగిస్తున్నారన్నారు. జగన్ మానసిక పరిస్థితిపై చర్చ జరగాలన్నారు. మహిళలపై నీచాతి నీచంగా మాట్లాడిన వ్యక్తిని జగన్ పరామర్శించడం జుగుప్సాకరంగా ఉందని ఆమె అన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై ప్రసన్న కుమార్ రెడ్డి మాటలని జగన్ సమర్థిస్తున్నారా? అని హోంమంత్రి ప్రశ్నించారు. సీఎం చంద్రబాబుతో హోంమంత్రి అనిత సమావేశం అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలు, సిట్ దర్యాప్తు, ఇతర అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. సీఎం చంద్రబాబుతో భేటీ అనంతరం హోంమంత్రి అనిత మీడియాతో మాటా్లడారు. "ప్రస్తుతం వైఎస్ జగన్ జైల్ యాత్రలు జరుగుతున్నాయి. రాష్ట్రం కోసం సీఎం చంద్రబాబు కష్టపడి దేశాలు పట్టుకు తిరుగు తుంటే.. జగన్ బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్నారు. పొగాకు రైతుల పరామర్శ పేరుతో తొక్కిసారేయ్యడం జరుగుతున్నాయి. జగన్ మానసిక పరిస్థితిపై చర్చ జరగాలి. మహిళలపై నీచాతి నీచంగా మాట్లాడిన వ్యక్తిని జగన్ పరామర్శించడం జుగుప్సాకరంగా ఉంది. ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిని ధ్వంసం చేసిన వారిపై కేసులు పెట్టాము. ప్రసన్నకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి చెల్లి అవుతారు. అయినా చెల్లి వరస అయ్యే మహిళపై నీచాతి నీచంగా మాట్లాడారు. అంటే ప్రసన్న మాటలని జగన్ సమర్ధి స్తున్నారా? అని హోంమంత్రి అనిత ప్రశ్నించారు. వైఎస్ జగన్ మానసిక పరిస్థితి దారుణంగా ఉంది. ఎలా ఉందంటే.. తల్లి, చెల్లిపై మాట్లాడినా కూడా నోరు మెదపని పరిస్థితి ఆయనది. మేం ప్రజాసేవ కోసం కుటుంబ సభ్యులను వదిలి వస్తున్నాం. ఎన్‌సీఎల్‌టీలో తల్లిపై గెలిస్తే విజయమా?. మాట్లాడితే జగన్ పోలీసులపై పడుతున్నారు. ఈ మధ్య జగన్ తన. పర్యటన సమాచారం పోలీస్ శాఖకు కూడా జగన్ చెప్పాలి. ఒక చనిపోయిన వారి ఇంటికి వెళ్లి బలప్రదర్శన చేస్తారా?. మీటింగ్ పెడతాము అంటే పర్మిషన్ ఇస్తాం.

# విద్యుత్ డిస్కంల పటిష్టం

## అకౌంటింగ్, బిల్లింగ్, సబ్సిడీపై ఫోకస్

## రాష్ట్రాల నియమ, నిబంధనలు షురూ

## ఆర్థిక ఆరోగ్యం కల్పించ దిశగా కేంద్రం

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** విద్యుత్ పంపిణీ సంస్థలకు (డిస్కంలు) ఆర్థిక జవసత్వాలు కల్పించే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ప్రధానంగా విద్యుత్ పంపిణీ సంస్థలకు ఆర్థిక ఆరోగ్యాన్ని కల్పించేందుకు నియమాలను తెరముందుకు తీసుకొచ్చింది. ఈ మేరకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అధికావర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం పంపిణీ సంస్థల ఆర్థిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి గాను డిస్కమ్‌లకు అకౌంటింగ్, రిపోర్టింగ్, బిల్లింగ్, సబ్సిడీ చెల్లింపు ప్రక్రియను క్రమబద్ధీకరించనుంది. విద్యుత్‌ను పంపిణీ చేయడంలో పంపిణీ సంస్థలు చేసిన పూర్తి వ్యయాలను రికవరీ చేయడానికి, విద్యుత్ సేకరణకు సంబంధించిన అన్ని ఖర్చులు పారదర్శకత్వ విధానంలో టారిఫ్‌ను ఆమోదించేటప్పుడు పరిగణనలోకి తీసుకోవడం జరుగేలా చర్యలు తీసుకుంటోంది.

వివిధ వర్గాలు వినియోగించిన విద్యుత్ ఖాతాల ఆధారంగా సబ్సిడీ కోసం డిమాండ్లను సేకరించే విధానానికి తెరలేపింది. ముఖ్యంగా త్రైమాసికం చివరి తేదీ నుండి 30 రోజుల్లోగా విద్యుత్ పంపిణీ సంస్థలు సంబంధిత నివేదికను సమర్పించాలని, రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ల (ఎస్ఈఆర్‌సి) నివేదికను పరిశీలించి, త్రైమాసిక నివేదికను 30 రోజుల్లో సమర్పించాలని సూచించింది. కేటగిరీల వారీగా వినియోగించే ఇంధన ఖాతాల ఆధారంగా సబ్సిడీ కోసం డిమాండ్ల సేకరణ, మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వర్గాలకు చెల్లించాల్సిన బకాయిలను పెండింగ్ లేకుండా చూడాల్సి ఉంటుంది. విద్యుత్ రంగం స్థిరత్వం కోసం ఒక ఫ్రేమ్ వర్క్ అవసరం అయిన నేపథ్యంలో అనుచిత, పారదర్శకత లేని అకౌంటింగ్, అలాగే రాష్ట్రాలు వివిధ వర్గాలకు విద్యుత్ నిమిత్తం ఇస్తున్న సబ్సిడీల మొత్తాన్ని చెల్లించని లేదా ఆలస్యం చేయడం విద్యుత్ పంపిణీల ఆర్థిక ఇబ్బందులకు ఒక కారణంగా విద్యుత్ మంత్రిత్వ శాఖ పేర్కొంది.
అలాగే ఈక్విటీపై సహేతుకమైన రాబడి (ఆర్ఓఈ) ఈ రంగంలో పెట్టుబడులు నిర్ధారించడానికి అవసరమైన ప్రధాన కారకాల్లో ఒకటిగా రాష్ట్రాలకు నొక్కి చెప్పింది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిన్ (సిఇఆర్‌సి) పేర్కొన్న టారిఫ్ నిబంధలనలో ఒకటిగా సంబంధిత కాలానికి రాష్ట్రాల విద్యుత్ నియంత్రణ కమిషన్ విధిగా అమలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. కొత్త నిబంధనల ప్రకారం సబ్సిడీ, అకౌంటింగ్, సబ్సిడీ బిల్లుల పెంపు చట్టం లేదా నియమ నిబంధన ప్రకారం ఉల్లంఘనలకు రాష్ట్రాల విద్యుత్ పంపిణీ సంస్థలు పాల్పడినట్లయితే వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని తేల్చిచెప్పింది.
అంతేకాకుండా సాంతికే, వాణిజ్య (ఎటి అంట్ సి) నష్టాన్ని తగ్గించడానికి కచ్చితమైన, సహేతుకమైన లక్ష్యాన్ని నిర్వచించడానికి, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించిన టారిఫ్ ప్రకారం ఎటి అండ్‌సి నష్టాలను తగ్గించేలా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషను ఆమోదించాల్సి ఉంటుంది.



# రష్యాలో మళ్లీ భూకంపం

## కురిల్ ఐలాండ్‌లో కంపించిన భూమి

## రిక్టర్ స్కేలుపై 6.5గా నమోదు

**మాస్కో, జూలై 31:** రష్యాలో మరోసారి భారీ భూకంపం సంభవించింది. కురిల్ ఐలాండ్‌లో గురువారం భూమి కంపించి రిక్టరు స్కేలుపై 6.5గా తీవ్రత నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించినట్లు తెలిపింది. నిన్న కమ్‌చట్కా ద్వీపకల్పంలో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. అదే ప్రాంతానికి 200 మైళ్ల దూరంలో తాజాగా ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వరుస భూకంపాలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అయితే, తాజా భూకంపం కారణంగా ఎలాంటి సనామీ హెచ్చరికలూ జారీ కాలేదు. రష్యాలోని కమ్‌చట్కా ద్వీపకల్పంలో బుధవారం ఉదయం 8.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే 4.4 అంతకంటే ఎక్కువ తీవ్రతతో 125 సార్లు భూమి కంపించినట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. వాటిలో మూడు 6.0 తీవ్రతకంటే ఎక్కువగా నమోదైనట్లు పేర్కొంది. రష్యాలో ఇంత తీవ్రతతో భూకంపం రావడం ఇదే మొదటిసారి. భూకంపం కారణంగా వచ్చిన సునామీ ప్రభావంతో కామ్‌చట్కా ఉపఖండంలోని నౌకాశ్రయాలతోపాటు జపాన్ తీరం, అమెరికాలోని హవాయి రాష్ట్ర తీర ప్రాంతాలు సముద్రపు నీటిలో మునిగిపోయాయి. మూడు మీటర్ల కన్నా ఎత్తయిన అలలు వరుసగా దాడి చేశాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తీర ప్రాంత ప్రజలు ఎత్తయిన ప్రదేశాలవైపు పరుగులు తీయడంతో అనేక దేశాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. భూకంపం, సునామీ కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించినట్టు ఎటువంటి సమాచారం వెలువడలేదు.

# పార్టీ ఫిరాయింపుపై సుప్రీంకోర్టు తీర్పు శుభపరిణామం

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు స్పందించారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలన్న తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ తీర్పుమంచి పరిణామమని, భారతరాష్ట్ర సమితి, కాంగ్రెస్‌లు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించాయన్నారు. కాంగ్రెస్ చేపట్టనున్న జనహిత పాదయాత్రపై రామచంద్రరావు స్పందిస్తూ...ఆ పార్టీ జనహిత పాదయాత్ర చేస్తోందో? జనాల్ని మోసం చేసే పాదయాత్ర చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. 6గ్యారెంటీలు, డిక్లరేషన్లు, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చిందో తెలుపుతూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శ్వేతపత్రం విడుదల చేస్తేనే కాంగ్రెసుకు పాదయాత్ర చేసే నైతిక హక్కు ఉంటుందన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేస్తోందని విమర్శించారు.

# యేడాది చివరలో సమతామూర్తి వార్షికోత్సవాలు

## ప్రధాని మోడీకి ఆహ్వానం

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** ముచ్చింతల్లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం3వ వార్షికోత్సవ ముగింపువేడుకలను ఈ ఏడాది చివరలో నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు విశిష్ఠ అతిథిగా హాజరవ్వాలని ప్రధాని మోడీని ఆధ్యాత్మిక గురువు త్రిదండి చిన్నజీయర్ స్వామి, మైహోమ్ గ్రూప్ ఛైర్మన్ రామేశ్వరరావు, వైస్ ఛైర్మన్ ఆహ్వానించారు. ఢిల్లీలోని ప్రధాని నివాసానికి వెళ్లి ఆహ్వానించగా ఆయన సాకుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ప్రధానికి సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం విశేషాలను వివరించారు. సమతామూర్తి కేంద్రం ప్రాంగణంలో ఉన్న 108 దివ్య దేశాలలో కొలువుదీరిన దేవతామూర్తులకు జరిగే నిత్య కైంకర్యాలను తెలియజేశారు. 45 నిమిషాల పాటు సాగిన ఈ భేటీలో జీయర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న నేత్ర విద్యాలయం, ఆయుర్వేద హెమియో కళాశాల పురోగతి గురించి ప్రధాని ఆసక్తిగా తెలుసుకున్నారు. ఆధ్యాత్మిక, దైవిక కార్యక్రమాల ద్వారా సమాజంలో భక్తిభావాన్ని పెంపొందిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారంటూ ప్రధాని మోదీ ఈ సందర్భంగా మైహోమ్ గ్రూప్ ఛైర్మన్ డా. రామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ రాములరావులను అభినందించారు.

# పవిత్రతను దెబ్బతీసేలా రీల్స్ చేస్తే ఇక అంతే సంగతులు !

## ఆలయం ముందు రీల్స్ నిషేధం - తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణం కాపాడాలి

**తిరుమల, జూలై 31 ప్రభాత వార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమలకొండపై భక్తులు ఆధ్యాత్మిక భావంతో మెలగాలని, పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడాలని తిరుమల తిరుపతిదేవస్థానం కోరింది. ఆధ్యాత్మిక వాతా వరణం నెలకొనేలా చూస్తున్న టిటిడికి భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేసింది. తిరుమలలో ఆలయ పవిత్రతకు భంగం కలిగేలా రీల్స్ ,వీడియోలు చిత్రీకరిస్తే కఠిన చర్యలు తీసుకోవడానికి టిటిడి సిద్ధమైంది. ఇలాంటి తప్పులు చేయవద్దని భక్తులకు సూచించింది. తిరుపతి అలిపిరిలో, తిరుమలకొండపై రీల్స్ చేసి కొందరు సామాజికమాధ్యమాల్లో చేర్చడం(అప్‌లోడ్)పై తీవ్రంగా పరిగణించింది. దీనిపై టిటిడి సంచన నిర్ణయం కూడా తీసుకుంది. ఇష్టదైవమ్ ఆపదమొక్కులవాడి దర్శనానికి వచ్చి రీల్స్ ఫోటో షూట్ చేస్తూ తోటి భక్తులకు పలువురు ఇబ్బందులు కలిగించారు. అంతేగాక ఆలయం ముందు, మాఢవీధుల్లో కొంతమంది వెకిలి చేష్టలు చేస్తూ, నృత్యాలు ప్రదర్శిస్తూ వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో చేర్చడంపై టిటిడి తీవ్రంగా పరిగణించింది. గతంలో జరిగిన అనేక తప్పిదాలపై టిటిడి కేసులు నమోదు, భక్తులపట్ల సంయమనం ధోరణితో వ్యవహరించింది. అయితే ఈ రీల్స్ పిచ్చి పవిత్రతకు భంగం కలిగేలా, ఆధ్యాత్మిక వాతావరణం దెబ్బతినేలా మారింది. ఏకంగా ఆలయం ముందు రీల్స్ చేయడాన్ని టిటిడి నిషేధించింది. దీనిపై టిటిడి విజిలెన్స్, పోలీసుశాఖలు గట్టి నిఘా ఉంచాయి.


తెలంగాణ ప్రభుత్వం
నాగర్‌కర్నూల్ :: మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం
నాగర్‌కర్నూల్ జిల్లా

టెండర్ ప్రకటన నం. E2/89/2025, 'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 31.07.2025
నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో 2025-26 అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమానికి SDRF గ్రాంట్‌ల క్రింద (1) పని నిమిత్తం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై టెండర్ పిలవబడుతోంది.
అంచనా విలువ: రూ. 1241944/-, పని పేరు: నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో SDRF నిధుల క్రింద అంబేద్కర్ చౌరస్తా వద్ద పాడైన CC రోడ్‌లు నల్లవెల్లి రోడ్ నుండి ఫ్రెండ్స్ చికెన్ సెంటర్, తిరుమల ఫంక్షన్ హాల్ దగ్గర, రవీంద్ర థియేటర్ చౌరస్తా మరియు ట్యాంక్‌బండ్ ప్రవేశం వద్దర రోడ్‌ల పునర్నిర్మాణ పనులు.
బిడ్ దాఖలు ప్రారంభ తేదీ, సమయం: 01.08.2025 ఉ.10.30 గం.
బిడ్ దాఖలు ముగింపు తేదీ, సమయం: 04.08.2025 సా.04.00 గం.
తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ "www.eprocurement.gov.in" వద్ద చూడవచ్చును. బిడ్స్ ఆహ్వానించు అధికారి: కమిషనర్, నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, సెల్ నం: 9100972045, 7330690590.
సం/- కమిషనర్, నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ
DIPR.No.5816-PP/CL/Advt/1/2025-26, తేది: 31.07.2025

వార్త

కొందరు గొప్పవారుగా జన్మిస్తారు. మరి కొందరు గొప్పవారుగా జీవిస్తారు. ఇంకా కొందరు గొప్పవారుగా తయారవుతారు.

-ఫ్రాంక్లిన్

# గ్రామాల్లో కనిపించని ప్రభుత్వం!

**ప్రజలు ఇవ్వనున్న ఫిర్యాదులకు 15 రోజుల్లోగా స్పందించాల్సిందే అన్న నియమాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి. అధికారులు స్వయంగా సోషల్ మీడియాలో ప్రజల ఫిర్యాదులను చూచి స్పందించే విధంగా వ్యవస్థలు బలోపేతం చేయాలి. ఒక ప్రజాస్వామ్యంలో అధికారి పదవిలో ఉండడం మానవ సేవకే నిదర్శనం. ప్రజల కష్టాలు, అవసరాలు తెలుసుకొని వాటిని పరిష్కరించడమే అసలైన పబ్లిక్ సర్వీస్. నేరుగా ప్రజలను కలిసే అధికారులే నమ్మకాన్ని కలిగిస్తారు. వారి మాటలకు బలం వస్తుంది. వారు తీసుకునే చర్యలకు ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. ప్రజలకు దగ్గరగా ఉండే విధానాలు, బాధ్యతాయుత పాలన లేకుంటే ప్రజాస్వామ్యమే ఖాళీ నినాదంగా మిగులుతుంది. అధికారులు కార్యాలయాల్లోనే కాకుండా ప్రజల మధ్యకు వెళ్లి, వారి బాధలు తెలుసుకొని, తక్షణమే స్పందించగలగాలి. అప్పుడే నిజమైన ప్రజాపాలన సాధ్యమవుతుంది.**



మన్నారం నాగరాజు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయ్యాయి. రాష్ట్ర ఏర్పాటు సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, ఆశలు, కలలు వేరు. కానీ వాస్తవిక పాలన మరోలా ఉంది. పాలనావ్యవస్థ ప్రజలకు అందుబాటులో ఉండాలని భావించి కొత్త జిల్లా కేంద్రాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు ఏర్పాటు చేశారు. కానీ అసలు లక్ష్యం అయిన ప్రజల సమస్యలు తెలుసుకోవడం, వాటిని పరిష్కరించడం అనే ప్రధాన అంశం మాత్రం అధికార యంత్రాంగానికి మరచిపోయిన పనిఅయింది. ఇప్పటి పరిపాలన వ్యవస్థలో అనేకమంది తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్లు వాస్తవంగా ప్రజల అవసరాలను ఎదుర్కోనాల్సిన బాధ్యతలు ఉన్నప్పటికీ, వారు కార్యాలయాల్లోనే పరిమితంఅవుతూ ప్రజలకు అందుబాటులో లేకపోవడం గమనార్హం. ప్రజా సమస్యలు తెలుసుకోవాలంటే తాము గ్రామాల్లోకి, బస్తీల్లోకి వెళ్లి పరిశీలించాల్సిన అవసరం ఉంది. కానీ చాలా మంది అధికారులు ఫీల్డ్ విసిట్‌లు చేయకుండా, ఎయిర్ కండీషన్ గదుల్లోంచే పరిపాలన నిర్వహిస్తున్న పరిస్థితి ఏర్పడింది. తహసీల్దార్ స్థాయి నుంచీ కలెక్టర్ స్థాయి వరకు ఉన్న అధికారులలో కొందరు తప్ప మిగతావారంతా దాదాపు ఆఫీసులో పనులకే పరిమితం అవుతున్నారు. ఫలితంగా,గ్రామాల్లో భూమి సమస్యలు, రేషన్ కార్డుల తడబాటు, సంక్షేమ పథకాల అమలులో తలెత్తుతున్న లోపాలు అధికారుల దృష్టికి రాకుండానే ఉంటున్నాయి. ప్రజల నుండి విజ్ఞప్తులు వచ్చినా, వాటిని కేవలం ఫైల్ నిప్పులు పేర్చే స్థాయిలో పరిష్కరించే ప్రయత్నమే జరుగుతోంది. ఇతరంగా చూస్తే, ప్రజలపై ప్రత్యక్ష నిఘా లేకపోవడం వల్ల స్థానిక అధికారులు, విలేజ్ సెక్రటరీలు, రెవెన్యూ సిబ్బంది తాము అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. అవినీతి పెరుగుతోంది. పై స్థాయి అధికారులు ప్రజల మధ్యకి వస్తేనే అటువంటి లోపాలు వెలుగులోకి వస్తాయి. కానీ అధికారులు తమ భద్రత, కార్యాచరణలు, 'ప్రోటోకాల్'ల పేరిట బయటకు వెళ్లడం మానేయడం వల్ల ప్రజాస్వామ్య సంబంధ పరిపాలన దెబ్బతింటోంది. పదవుల్లో ఉండే ప్రతి అధికారికి ప్రజల పట్ల నైతిక బాధ్యత ఉంటుంది. కార్యాలయంలో కూర్చోని కాకుండా, వారంలో కనీసం రెండు రోజులు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు స్వయంగా విన్నప్పుడే పరిపాలనలో నైతిక బలం ఏర్పడుతుంది. ప్రజలపై నేరుగా గమనిక పెడితేనే అర్థవంతమైన పాలన సాధ్యమవుతుంది. అధికారులు ఆఫీసుల్లో నుంచే పరిమితమైతే, పాలన అర్థాంతరంగా మారుతుంది. అధికారాల కొరత, స్టాఫ్ లేమి అనేది గ్రామీణ పాలనలో ఒక పెద్ద సమస్యగా మారుతోంది. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల వల్ల ప్రజలకు అవసరమైన సేవలు ఆలస్యమవుతున్నాయి. పటేల్స్, విఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు లేకపోవడం వల్ల నిత్య సేవలు నిలిచిపోతున్నాయి. వ్యవసాయ శాఖలో వ్యవసాయ అధికారుల కొరత రైతులకు సలహాలు,సహాయం అందే విధానాన్ని తగ్గిస్తోంది. ఈ ఖాళీలు వెంటనే నింపకపోతే, ప్రజల పనులు పెండింగ్ అయ్యి, పాలనపై నమ్మకం తక్కువవుతుంది. ప్రభుత్వం దీన్ని అత్యవసరంగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రజలకు డిజిటల్ పాలన అందుబాటులోఉందా? ప్రభుత్వాలు 'డిజిటల్ ఇండియా' 'ఈగవర్నెన్' వంటి కార్యక్రమాలద్వారా పౌరులకు సేవలు వేగంగా, పారదర్శకంగా అందించాలన్న ఆశయంతో ముందుకొస్తున్నాయి. రేషన్, పెన్షన్, విద్య, ఆరోగ్య సేవలు ఇలా అన్నింటికీ సంబంధించి మొబైల్ యాప్‌లు, పోర్టల్స్ అందుబాటులోకి తీసుకువచ్చాయి. కానీ ఇవి నిజంగా గ్రామీణ ప్రజలకు ఉపయోగపడుతున్నాయా? గ్రామాల్లో



ఇప్పటికీ అనేకచోట్ల స్థిరమైన విద్యుత్ సరఫరాలేదు. మొబైల్ సిగ్నల్ బలహీనంగా ఉండటం, ఇంటర్నెట్ వేగం తక్కువగా ఉండటం వల్ల, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రావడం లేదు. ఒక వృద్ధుడు పెన్షన్‌కోసం అప్లైచేయాలన్నా, ఓ మహిళ రేషన్‌లో సమస్యకు ఫిర్యాదు చేయాలన్నా – అంగలార్చాల్సిందే. యాప్‌లలో లోడవ్వకపోవడం, ఒటిపిరాకపోవడం, సాంకేతిక సమస్యలు సాధారణమే. పైగా, చాలామంది గ్రామస్తులకు యాప్‌లు ఎలావాడాలో తెలీదు. ఈ నేపథ్యంలో, అధికారులు గ్రామాల్లోకి వచ్చి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా వినాల్సిన అవసరం ఉంది. కానీ ఇప్పుడు మొబైల్‌యాప్ లేదా పోర్టల్ వాడలేకపోయినా, సమస్య ఎక్కడ చెప్పాలో గ్రామస్థులకు స్పష్టత లేదు. అధికారుల డిజిటల్ మాయాజాలం ప్రజలకు నిరాశను మిగులుస్తోంది. గ్రామీణ ప్రజల డిజిటల్ సౌకర్యాలపై నిజమైన అధ్యయనం లేకుండా, కేవలం గణాంకాల కోసం ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నట్టుగా చూపించడం ప్రమాదకరం. ప్రజలు తమ సమస్యల పరిష్కారాల కోసం అధికార కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే, అక్కడ వారిని ఎదుర్కొనే విధానం మాత్రం నిరాశ కలిగించేలా మారుతోంది. అధికారుల తీరులో ప్రజల పట్ల గౌరవం కాకుండా, అధికారపు అహంకారం నిండిపోయినట్టుగా అనిపిస్తోంది. సమస్యలతో వచ్చిన పౌరులకు సరైనసమాధానం చెప్పకుండా, వారికి ఏకపక్షంగా తలుపులు మూసే విధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపోటువలె మారుతోంది. ప్రజల సేవకులుగా ఉండాల్సిన వారు అధికార ధోరణితో ప్రవర్తించడం అసహనానికి దారితీస్తోంది. ఈ పరిస్థితిని మార్చాల్సిన అవసరం అత్యవసరం. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులుగా సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మండల స్థాయి నాయకులు పనిచేస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారు అధికారులకు వినతుల రూపంలో అందజేస్తుంటారు. కానీ చాలా సందర్భాల్లో అధికారులు ఆ వినతులను పట్టించుకోవడం లేదు. ఇది ప్రజాప్రతినిధుల సామర్థ్యాన్ని ప్రశ్నించేలా చేస్తోంది. స్థానికంగా ఉండే సమస్యలు మంచినీటి కొరత, డ్రైనేజీ సమస్య, రహదారి మరమ్మతులు వంటి వాటికి సత్వర పరిష్కారం లభించకపోవడం వల్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించే స్థానిక నేతల వినతులను అధికారులు గౌరవించకపోతే ప్రజాస్వామ్యానికి నష్టం కలుగుతుంది. అందుకే అధికార యంత్రాంగం స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతిపాదనలను సమర్థవంతంగా పరిశీలించి, వాటిపై స్పందించాల్సిన అవసరం ఉంది. అధికారులు ప్రజల వద్దకు రాకపోవడంతో,గ్రామాలు పట్టణాల స్థాయిలో నీటికొరత, డ్రైనేజ్ సమస్యలు, రోడ్ల ఘోర స్థితిగతులు వంటి ప్రాథమిక సమస్యలే కలెక్టర్ దృష్టికి రాకుండా మిగిలిపోతున్నాయి. ఫీల్డ్‌లోకి వెళ్లి ప్రజల అభిప్రాయాలు తెలుసుకునే విధానం లేకపోవడం, మధ్యస్థాయి అధికారుల నివేదికలపై మాత్రమే ఆధారపడటం వల్ల సమస్యలు అసలు రూపంలో తెలియకపోతున్నాయి. దీనివల్లప్రజల ఇబ్బందులు పెరిగిపోతుండగా, పాలన మాత్రం ఫైలులపైనే నడుస్తోంది. ఇకధాన్యం కొనుగోలు కేంద్రాల సమస్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమవుతున్నాయి. రైతులు అనేక కష్టాలతో పండించిన ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకొచ్చినా, కొనుగోలు కేంద్రాల్లో ఎదుర్కొంటున్న సమస్యలు వారి ఆర్థిక పరిస్థితిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. వర్షాల కారణంగా ధాన్యం కొంతమేర తడిసిపోవడం సహజం. కానీ, అధికారులు సడలింపులు లేకుండా కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు మూడోపార్టీ వ్యాపారుల వద్ద కనీస ధరకు కూడా రాని ధరకు విక్రయించాల్సిన పరిస్థితిలో ఉన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద బాధ్యత వహించాల్సిన అధికారులు ఫీల్డ్‌కి రావడం లేదు. దీంతో రైతులు అక్కడ గంటల తరబడి నిలబడాల్సిన,వారి సమస్యలు వినడానికి ఎవరూ లేకపోవడం గమనార్హం. ప్రజలు ఇవ్వనున్న ఫిర్యాదులకు 15 రోజుల్లోగా స్పందించాల్సిందే అన్న నియమాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి. అధికారులు స్వయంగా సోషల్ మీడియాలో ప్రజల ఫిర్యాదులను చూచి స్పందించే విధంగా వ్యవస్థలు బలోపేతం చేయాలి. ఒక ప్రజా స్వామ్యంలో అధికారి పదవిలో ఉండడం మానవ సేవకే నిదర్శనం. ప్రజలకష్టాలు, అవసరాలు తెలుసుకొని వాటిని పరిష్కరించడమే అసలైన పబ్లిక్ సర్వీస్. నేరుగా ప్రజలను కలిసే అధికారులే నమ్మకాన్ని కలిగిస్తారు. వారి మాటలకు బలం వస్తుంది. వారు తీసుకునే చర్యలకు ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. ప్రజలకు దగ్గరగా ఉండే విధానాలు, బాధ్యతాయుత పాలన లేకుంటే ప్రజాస్వామ్యమే ఖాళీ నినాదంగా మిగులుతుంది. అధికారులు కార్యాలయాల్లోనే కాకుండా ప్రజలమధ్యకు వెళ్లి, వారి బాధలు తెలుసుకొని, తక్షణమే స్పందించగలగాలి. అప్పుడే నిజమైన ప్రజాపాలన సాధ్యమవుతుంది. •

# రక్తసిక్తమవుతున్న రహదారులు


దేశంలో రహదారులు రక్తసిక్తం అవుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనిషి క్షేమంగా ఇంటికి వచ్చేది గ్యారంటీ లేని అభద్రతా భావం పెరిగిపోతున్నది. అన్నెంపున్నెం ఎరుగుని వేలాది మంది అమాయకులు రోడ్డు ప్రమాదాలకు బలైపోతున్నారు. లక్షలాది మంది అంగవికలురుగా మారి కుటుంబానికి భారమై జీవితాంతం నరకం అనుభవిస్తున్నారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు. ఒక రోజు కాదు, రెండు రోజులు కాదు. యేటా వేలాది మంది అసువులు భాస్తున్నారు. దేశవ్యాప్తంగా పరిశీలిస్తే 2001-2020 వరకు తొంభైఆరు లక్షల, అరవైరెండువేలకుపైగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటే ఇరవైమూడు లక్షల, ఇరవైఐదువేల మంది మృత్యువాతపడినట్లు అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ఇక క్షతగాత్రులైనవారి సంఖ్య కోట్లల్లో ఉండొచ్చు. రోడ్లపై ఏర్పడిన గుంతల కారణంగా గత నాలుగేళ్లలో దాదాపు ముప్పైవేల ప్రమాదాలుచోటు చేసుకున్నాయి. అంతేకాదు ప్రమాదాలకు గురై ప్రాణాపాయ స్థితిలో సకాలంలో ప్రాథమిక చికిత్స అందక మృత్యుతో పోరాడి రోడ్లపైనే ప్రాణం వదిలినవారెందరో ఉన్నారు. మొన్న శనివారం తెలంగాణలోని రంగారెడ్డిజిల్లా షాద్‌నగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇలా సకాలంలో వైద్యం అందక తండ్రీకూతురు ఇద్దరూ ప్రాణాలు వదిలిన హృదయవిదారక సంఘటన చోటు చేసుకున్నది. ఇంజినీరింగ్ కాలేజీలో చివరి సంవత్సరం చదువుతున్న ఏకైక కుమార్తెను కాలేజీ బస్సు ఎక్కించేందుకు ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరి పట్టణ కూడలి వద్దకు వచ్చేసరికి ఒక ట్యాంకర్ ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో తీవ్ర గాయాలైన తండ్రి దూరంగా పడిపోగా కుమార్తె లారీ చక్రాల కింద ఇరుక్కుపోయింది. ఒకవైపు క్షతగాత్రుడైన తండ్రి, మరొకవైపు చక్రాల కింద నలిగిపోతూనే ఆ యువతి తమను కాపాడాలంటూ చేసిన ఆర్తనాదాలు చూపరులను కలచివేశాయి. ఒకపక్క తీవ్ర రక్తస్రావం అవుతున్నా తన ఇంటికి సమాచారం అందించాలని ఆమె తన సెల్‌ఫోన్‌ను అందించింది. ఆ తర్వాత అందరు కలిసి బయటకు తీసి ఆస్పత్రికి తరలించేలోపే తండ్రి కుమార్తెలు ఇద్దరూ మరణించారు. భర్తను, ఏకైక కుమార్తెను కోల్పోయిన ఆ ఇల్లాలు వేదనను వర్ణించడానికి మాటలు అందవు. అదే రోజూ విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ముగ్గురు పోలీసు అధికారులు రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరు డిఎస్పీలు అక్కడికక్కడే మరణించగా మరొక అడిషనల్ ఎస్పీతోపాటు డ్రైవర్ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రెడ్డి చెరువు కట్టపై ఈ నెల పదమూడోతేదీ జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది కూలీలు మరణించగా మరో పన్నెండు మంది గాయపడ్డారు. రాజంపేట మండలం ఇస్కపల్లి గ్రామ పరిసరాల్లోనే తోటల నుంచి మామిడి కాయలు కోసుకొని మార్కెట్‌కు వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడింది. పైభాగాన కూర్చొని ఉండడం వల్ల లారీ ఒక్కసారిగా తిరగబడడంతో మామిడి కాయలన్నీ వారిపై పడ్డాయి. ఊపిరి ఆడక కొందరు, మరికొందరు దెబ్బలతో మృతిచెందగా ఇంకొందరిని ఆస్పత్రికి తరలించారు. అక్కడ కూడా సకాలంలో సహాయం అంది ఉంటే మామిడి కాయల కింద ఉన్నవారిని బయటకు తీసే అవకాశంఉండేదని అంటున్నారు. అమెరికా లాంటి దేశాల్లో ప్రమాదాలకు గురైన ప్రతి రెండువందల మందిలో ఒకరు మరణిస్తుంటే భారత్‌లో ప్రతి ఆరుగురిలో ఒకరు మరణిస్తున్నట్లు అధికార గణాంకాలే వెల్లడిస్తున్నాయి. మితిమీరిన వేగంతోపాటు మద్యం మత్తులో కూడా ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలా నిత్యం రక్తసిక్తం అవుతున్నాయి. అసలు పోలీసు రికార్డుల్లోకి రాని మరణాలు ఎన్ని ఉన్నాయో చెప్పలేం. చనిపోయిన వారిలో అధిక శాతం పద్దెనిమిదేళ్ల, ముప్పైయేళ్ల వయసు ఉన్నవారే. సంపాదన చేస్తున్న భర్తో, కుమారుడో, చేతికి అంది వస్తున్న వారిని కోల్పోయిన ఆ కుటుంబాల పరిస్థితి ఒక్కసారి మనసుపెట్టి పెద్దలు ఆలోచించాలి. ఒకటి, రెండు కుటుంబాలు కాదు. దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు వీధిన పడుతున్నాయి. వారి పరిస్థితి వింటుంటే ఆ కుటుంబ సభ్యుల విషాదగాథలు చూస్తుంటే ద్రవించని హృదయం ఉండదు. యేటా వేలాది మంది రోడ్డు ప్రమాదాల్లో అసువులు బాస్తుంటే పట్టించుకోకపోవడం క్షంతవ్యం కాదు. అన్నిటికంటే ముఖ్యంగా మద్యం ఈ ప్రమాదాల్లో కీలక పాత్ర వహిస్తున్నది. చివరకు పిల్లలను స్కూళ్లకు తీసుకువెళ్లే బస్సుల వాహనదారులు కూడా కొందరు మద్యం మత్తులో ఉన్నారంటే ఏమనుకోవాలి. మొన్న ఈ మధ్య హైదరాబాద్ నగరవ్యాప్తంగా చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. ఇలా పిల్లలను పాఠశాలలకు చేరవేస్తున్న బస్సు డ్రైవర్లలో పద్నాలుగు మంది, ఆటో డ్రైవర్లలో ఇరవై ఆరు మంది పూర్తి మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. ఇందులో కొందరు అయితే ఒళ్లు తెలియని పరిస్థితుల్లో ఉన్నట్లు కూడా సమాచారం. కేవలం మత్తు మైకంలో వాహనాలు తోలడం వల్ల దేశంలో 2022లో పదివేలకుపైగా ప్రమాదాలు జరిగితే 4,200మంది అసువులు బాశారు. మద్యం ద్వారా జరుగుతున్న ఈ అనర్థాలను పాలకులు గుర్తించడం లేదు. గుర్తించినా మహాప్రసాదంగా మారిన మద్యాదాయం ముందు ప్రాణాలను లెక్క చేయడంలేదనిపిస్తున్నది. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు కళ్లు తెరవాలి. ఈ మారణహోమాన్ని ఆపాలి. ప్రధానంగా మద్యం సేవించడం, లేక అలక్ష్యంతో వాహనాలు నడిపి ఎంత మందిని చంపినా జరిమానా చెల్లిస్తే సరిపోతుందనే భావన పోగొట్టాలి. కొన్ని పాశ్చాత్య దేశాల్లో లాగా మరణానికి కారణమైన వాహన చోదకులు జీవితంలో స్టీరింగ్ పట్టకుండా పటిష్టమైన చట్టానికి రూపకల్పన చేయాలి.

> సందేహాన్ని ప్రశ్నించేవాడు ఆ సమయంలో మాత్రమే మూర్ఖుడు. అసలు ఎవరినీ ప్రశ్నించనివాడు జీవితాంతం మూర్ఖుడే.



జాన్సన్

> మన శక్తియుక్తుల్ని మానవ కళ్యాణానికి వినియోగించాలి. వినాశనానికి కాదు.



షేక్స్పియర్

# సీనియర్ సిటిజన్ కార్డుల నిలిపివేత సమంజసమా!


డాక్టర్ నీలం సంపత్

అరవై ఏళ్ల పాటు వారి కుటుంబాలతో పాటు సమాజ నిర్మాణంలో క్రియాశీలక భూమికను నిర్వర్తించి, ఎనలేని సేవలు అందించిన వయోవృద్ధుల సంక్షేమం కోసం, వారితో పాటు రాష్ట్రంలో ప్రత్యేక కెటాగిరికి చెందిన వికలాంగులు, ట్రాన్స్ జెండర్‌లకు సైతం ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేయడం ద్వారా ప్రభుత్వం రూపొందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతోపాటు బస్ ప్రయాణంలో, రైలు ప్రయాణంలో, విమాన ప్రయాణంలోనూ నిర్దిష్ట రాయితీలను సమకూర్చాలనే ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమే. సదరు ప్రభుత్వ పథకాల అమలుకు, సదుపాయాలను అనుభవించడానికి సీనియర్ సిటిజన్ కార్డులను కలిగివుండాలనే షరతుని విధించి వాటి జారీబాధ్యతను జిల్లా మహిళా శిశు సంక్షేమ, వికలాంగుల ట్రాన్స్ జెండర్‌ల శాఖకు అప్పగించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా నివసిస్తున్న వయోవృద్ధులైనా తమ నివాసాన్ని గుర్తించే ఆధార్ లేదా రేషన్ కార్డులతో పాటు వయస్సుని ధృవీకరించే స్కూల్ రికార్డుల ప్రకారం డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ గ్రామ పంచాయతీ లేదా మున్సిపాలిటీ, నగరపాలక సంస్థలు జారీ చేసే జననధృవీకరణ పత్రాలతో నిర్దిష్టదరఖాస్తు ఫారాన్ని సంబంధిత అధికారులకు సమర్పించడం ద్వారా సీనియర్ సిటిజన్ కార్డులను పొందవచ్చుననేది ప్రభుత్వ విధానం. ఈనేపథ్యంలో 3కోట్ల ఎనభై లక్షల పైచిలుకు జనాభా కలిగిన తెలంగాణ రాష్ట్రంలో 11శాతంగా వున్న వయోవృద్ధులు ప్రారంభంలో సదరుకార్డులను పొందడానికి పెద్దగా ఆసక్తి చూపకపోవడం ఫలితంగా ప్రభుత్వం, ప్రింట్‌ఎలక్ట్రానిక్ మీడియాతోపాటు సోషల్ మీడియాచేసిన విస్తృత ప్రచారం నేపథ్యంలో ఇటీవల సదరు కార్డులను పొందడం కోసం భారీ సంఖ్యలో వయోవృద్ధులు సంబంధిత శాఖ అధికారులను సంప్రదించడం ప్రారంభించారు. ప్రతిజిల్లాలో ఆయా జిల్లాల సంక్షేమ అధికారుల కార్యాలయాల్లో వందల సంఖ్యలో సీనియర్ సిటిజన్ కార్డులు సంతకాల కోసం కుప్పలు, కుప్పలుగా పడి వుంటున్నాయని అంటున్నారు. గత పదిహేను రోజుల క్రితం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో సంబంధిత శాఖలో వున్న కార్డుల కోసం దరఖాస్తుదారులు జిల్లా అధికారులను సంప్రదించినప్పుడు ప్రభుత్వం సీనియర్ సిటిజన్ కార్డులను తాత్కాలికంగా నిలుపుదల చేయమని జూమ్ మీటింగ్‌లో రాష్ట్ర సంక్షేమ కమీషనం చెప్పినందున కార్డుల జారీని ఆపుతున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ ప్రక్రియను విజయవంతం చేయడం కోసం హెల్ప్ లైన్ నెంబర్‌ని నిర్వహిస్తుంది. సదరు నెంబర్‌ని సంప్రదించగా సీనియర్ సిటిజన్‌కార్డుల జారీ నిలుపుదలకు సంబంధించి తమ దగ్గర ఏ సమాచారం లేదని చెప్పడం అనేక అనుమానాలకు తావిస్తోంది. రాష్ట్ర శాఖ అధికారుల నుండి ఎలాంటి వ్రాతపూర్వక ఉత్తర్వులు లేకపోయినా, కనీసం మౌఖిక ఆదేశాలు రాకపోయినా కేవలం జూమ్ మీటింగ్‌లో రాష్ట్రస్థాయి అధికారుల సూచనల ప్రస్తావనతో సీనియర్ సిటిజన్ కార్డుల జారీనిలుపుదల నిస్సందేహంగా వయోవృద్ధుల ప్రయోజనాలకు భంగం కలిగించడంతో పాటు వారిపట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకంగామారుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాల జారీతో సీనియర్ సిటిజన్ కార్డుల జారీ కొనసాగింపు లేదా రద్దుపట్లతమవైఖరిని స్పష్టంచేయాల్సిన అవసరం వుంది. •

# ఎపిలో బిసిల ఆశలు నెరవేరేనా!

కైలసాని శివప్రసాద్

తెలుగుదేశం పార్టీకి, రాష్ట్ర జనాభాలో 52 శాతం పైగా ఉన్న వెనుకబడిన తరగతి జాతులవారికి విడదీయరాని అనుబంధం ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు. 1982లో ఆవిర్భావం జరిగిన నాటి నుండి నేటివరకు గత 43 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ మనుగడకు, ఉన్నతికి ఉన్న బిసిల పాత్రను ప్రముఖంగా చెప్పుకోవచ్చు. మా పార్టీ బిసిల పార్టీ అని స్వయంగా తెలుగుదేశం పార్టీ అధిష్టానమే ప్రతినిత్యం చెపుతూ ఉంటుంది. ఈ వ్యాఖ్యలే టిడిపికి బిసిలకు ఉన్న అవినాభావ సంబంధానికి నిదర్శనంగా భావించవచ్చు. ఈ నాలుగన్నర దశాబ్దాలలో తెలుగుదేశం పార్టీ గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు చెక్కుచెదరని రీతిలో పటిష్టంగా రూపుదిద్దుకుంది. పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి నేటివరకు సుమారు 23 సంవత్సరాలు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండడం విశేషం. ప్రస్తుతం కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిడిపి అధికారంలో ఉంది. ఇంకా నాలుగు సంవత్సరాలు తెలుగుదేశం పార్టీనే అధికారంలో ఉంటుంది. అదేసమయంలో రాష్ట్ర రాజకీయాలతో పాటూ జాతీయ రాజకీయాలను శాసించే స్థాయికి తెలుగుదేశం పార్టీ చేరుకుంది. ఒక సందర్భంలో కొద్ది కాలం పాటూ దేశానికి దశ దిశ నిర్దేశించే పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా కూడా తెలుగుదేశం పార్టీ వ్యవహరించడం గొప్ప పరిణామం. జాతీయ స్థాయిలో లోక్‌సభ స్పీకర్, కేంద్రంలో మంత్రి పదవులు లాంటి ఉన్నత పదవులను అనేక పర్యాయాలు తెలుగుదేశం పార్టీ నిర్వహించింది. ప్రధానమంత్రి, రాష్ట్రపతి లాంటి దేశ అత్యున్నత పదవుల నియామకాలలో కూడా తెలుగుదేశం పార్టీ చాలా క్రియాశీలకంగా వ్యవహరించింది. టిడిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పాలనలో అనుసరించిన సరికొత్త పంథా దేశానికే ఆదర్శంగా నిలిచింది. దేశంలో మొట్టమొదటి పర్యాయం రెండు రూపాయలకు కిలోబియ్యం లాంటి అనేక సంక్షేమ పథకాలు, బిసిలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల కల్పన, మండల వ్యవస్థ ఏర్పాటు, పటేల్ పట్వారీ, రెడ్డి కరణం వ్యవస్థలను రద్దు చేయడం వంటి అనేక పాలనా సంస్కరణలు అమలు చేసి తెలుగుదేశం పార్టీ సంచలనం సృష్టించింది. సంక్షేమ పథకాలు, అభివృద్ధి సమపాళ్లలో చేసి పాలనంటే ఇలా ఉండాలని టిడిపి దేశానికి చూపించింది. పాలనలో టిడిపి అనుసరిస్తున్న వైఖరినే దేశంలోని అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు. అనేక విషయాలలో టిడిపి చూపిన దారిలోనే దేశాన్ని ఏలుతున్న పార్టీలు కూడా అనుసరించడం గమనార్హం. అదేవిధంగా పార్టీ వ్యవహారాలలో కూడా తెలుగుదేశం పార్టీ అమలు చేస్తున్న నిర్ణయాత్మక నమూనా దేశంలోని జాతీయ రాజకీయ పార్టీలతో పాటూ, ప్రాంతీయ పార్టీలకు




మార్గదర్శకంగా మారిందని కచ్చితంగా చెప్పవచ్చు. తెలుగుదేశం పార్టీ అంతటి ఘనమైన చారిత్రిక నేపథ్యాన్ని పొందింది. కానీ గత నాలుగున్నర దశాబ్దాలుగా టీడీపీ జెండా మోస్తున్న వెనుకబడిన తరగతి జాతుల వారి జీవితాలలో మాత్రం చెప్పుకోదగ్గ స్థాయిలో మార్పు రాకపోవడం బాధాకరం. నిజం చెప్పాలంటే బిసిల బ్రతుకులు నానాటికీ దిగజారిపోతున్నాయనేది నిర్వివాదాంశం. వెనుకబడిన తరగతి జాతుల వారందరి జీవనాధారం కులవృత్తులు. గత కొద్ది సంవత్సరాలుగా డ్రైవాష్, మెన్స్ బ్యూటీ పార్లర్, ఫ్యాబ్రిక్స్, రెడీమేడ్ డ్రస్‌లు లాంటి పేర్లతో దాదాపు బిసిల కుల వృత్తులన్నింటిలోకి కార్పొరేట్ సంస్థలతో పాటూ ఇతర పెట్టుబడిదారులు ప్రవేశించారు. దీంతో బిసిల బ్రతుకులు అగమ్యగోచరంగా తయారయ్యాయి. ఈదుర్భర పరిస్థితుల దృష్ట్యా నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుంచి బిసిలు తమ బ్రతుకులు బాగు చేస్తాయని, ప్రభుత్వాలపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా 2014-19 మధ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన నారా చంద్రబాబు నాయుడిపై అధికంగా ఆశలు పెట్టుకొన్నారు. 2014 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అధినేతగా నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన బిసి డిక్లరేషన్ కూడా దానికి ఒక ప్రధాన కారణంగా తెలుస్తోంది. కానీ ఆ సమయంలో వారి ఆశలు అడియాశలు అయ్యాయి. 2019-24 మధ్య ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన జగన్ మోహన్‌రెడ్డి బిసి కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేయడంతో బిసిల నోట్లో వెలక్కాయ పడ్డట్లు అయ్యింది. దీంతో అప్పటి వరకు ప్రభుత్వం నుండి అందుతున్న అరకొర సాయం కూడా బిసిలకు అందకుండా పోయింది. 2024లో నారా చంద్రబాబు నాయుడు తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో బిసిల ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. ఆంధ్రప్రదేశ్‌లో డబుల్ ఇంజన్ సర్కార్‌కు సారథ్యం వహిస్తున్నందువలన ఈ పర్యాయం తమ ఆశలు కచ్చితంగా నెరవేర్చి తమ జీవితాలలో వెలుగులు నింపుతారని బిసిలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై మునుపటి కంటే ఎక్కువగా ఆశలు పెట్టుకోవడం గమనార్హం. బిసిలు చంద్రబాబు నాయుడుని కొత్త కోర్కెలు, గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. గతంలో ప్రకటించిన బిసి డిక్లరేషన్‌లో తెలుగుదేశం పార్టీ పొందుపరచిన హామీలు నెరవేర్చి తమను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి పరచమని బిసిలు కోరుతున్నారు. 2014 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు బిసి డిక్లరేషన్ ద్వారా బిసి లకు ప్రతి సంవత్సరం 10 వేల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించడం, చేనేతలకు ప్రత్యేకంగా సంవత్సరానికి వెయ్యి కోట్ల రూపాయలు బడ్జెట్‌లో పెట్టడం, ఉద్యోగుల ప్రమోషన్లలో బిసిలకు రిజర్వేషన్లు కల్పించడం, కాంట్రాక్టులలో బిసిలకు వాటా కల్పించడం, అన్నిరకాల నామినేటెడ్ పోస్టులలో 33 శాతం కేటాయించడం, స్థానిక సంస్థలలో ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను బిసి జనాభా ధామాషా ప్రకారం పెంచడం, ప్రతిసాధారణ ఎన్నికలలో 100శాసనసభా స్థానాలు కేటాయించడం, కేంద్రంలో బిసిలకు ప్రత్యేక బడ్జెట్‌కొరకు, ప్రత్యేక బిసి మంత్రిత్వశాఖ ఏర్పాటుకు, చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించడం కొరకు కృషి చేయడం వంటి ప్రధాన హామీలతో పాటూ ఇతర సంక్షేమ హామీలు అనేకం ఇవ్వడం జరిగినది. ఈ హామీలు అన్నీ నిజంగా నెరవేరిస్తే బిసిల జీవితాలలో వెలుగులు వస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. •

# ప్రజావాక్కు



### ఉద్యోగులకు బై బై చెప్పిన టాటా

ప్రముఖ ఐటీకంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఒకేసారి 12,200మంది ఉద్యోగులను తొలగించబోతున్నట్లు ప్రకటించడం అందరినీ షాక్‌కి గురిచేసింది. ఆ సంఖ్య తన మొత్తం ఉద్యోగుల సంఖ్యలో రెండు శాతం. ఈ స్థాయిలో ఉద్యోగాలకు ఉద్వాసన పలకడం భవిష్యత్‌లో జాబ్ మార్కెట్‌లో జరగబోతున్నపరిణామాలకు తొలి సంకేతం. ప్రమాద హెచ్చరిక. ఉద్యోగాల తొలగింపు అన్నది ఒక ఐటీ రంగానికి, లేదాభారత్‌కి మాత్రమే సంబంధించిన కుదుపు కాదు. ప్రపంచవ్యాప్తంగా, అన్నిరంగాల్లో ఎదురవ్వబోయే కీలక మార్పులకు అద్దం పడుతుంది. ఐటీ రంగంలో ఇప్పటికే కృత్రిమ మేధప్రభావం వేగంఅందుకుంది. కోడింగ్‌లో ముప్పై శాతం మేరకు కృత్రిమ మేధ ఆక్రమించుకున్నట్లు తెలుస్తోంది. మిగతా రంగాల్లో కూడా దాని ప్రభావం విస్తృతమవుతోంది.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### అభివృద్ధికి దూరం చేయడం తగదు

రాష్ట్రంలో ఏప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజలందరిని సమానంగా చూడమని రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, గ్రామపంచాయతీ అధికారులను హెచ్చరించాలి. పక్షపాత ధోరణితో గ్రామాల్లో రాజకీయ కక్ష్యలు, కార్పణ్యాలు ఎక్కువవుతున్నాయి. మనుషులంటే సరేసరి. ఆరాజకీయ కక్ష్యలు, కార్పణ్యాలు గతప్రభుత్వం నాటిన చెట్లు, మొక్కలపై కూడా చూపిస్తున్నారు. గ్రామంలో ఎవరు ఎవరికి ఓటు వేసినా, వేయకపోయినా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తన, మన అనే భేదం లేకుండా మనకు ఓటు వేయమని వారిని ఏ ప్రభుత్వ పథకాలు ఇచ్చి వారిని ఆ ప్రభుత్వంపై మంచి అభిప్రాయం తీసుకురావాలని ఆలోచించాలి.

- పద్మపుత్ర మల్లికార్జున్, గద్వాల్ జిల్లా

### వెల్‌నెస్ సెంటర్లో అందని సేవలు

ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా హనుమకొండలోని మెటర్నిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేయబడ్డ వెల్ నెస్ సెంటర్‌లోనిత్యంవచ్చేవారికి పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్డ్ ఉద్యోగులు జర్నలిస్టులు నిత్యం వెల్‌నెస్ సెంటర్‌కి వస్తారు. కానీ అన్ని సేవలు అందుబాటులోకిరావడంలేదు. న్యూరో, పీడియాట్రిక్ డాక్టర్ లేకపోవడం వల్ల నానా యాతన పడుతున్నారు.

- కె. సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### ఉన్నత వర్గాల వారికే ఉద్యోగాలా..

నిజానికిమ్యాథమెటిక్స్ ఎప్పుడూ ఇంగ్లీష్ మీడియంలోనే ఉన్నది. మాతృభాషలో అర్థం అవడానికి వీలుగా కొన్ని పదాలను కలుపుతూ ఉంటారు. ఇంగ్లీష్ టీచర్లు కూడా లెసన్స్ ఇంగ్లీష్‌టు ఇంగ్లీష్‌లో చెప్పకుండా మాతృభాషలో ట్రెడిషనల్ టీచింగ్ ట్రాన్స్‌లేషన్ మెథడ్‌లోనే విద్యార్థినీవిద్యార్థులకు చేరువ కావడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. ప్లస్, మైనస్, ఈజీ ఈక్వల్ టు, ఎ స్క్వేర్, బి స్క్వేర్ మొదలగు పదాల్ని తెలుగులో ఎవరూ చెప్పలేరు. అవి ఇంగ్లీషులోనే చెబుతారు. ఫిజిక్స్ కూడా తెలుగు పదాలతో చెప్పలేరు సాధ్యమైనంత వరకు ఇంగ్లీష్ పదాలతో ఇంగ్లీష్ మీడియంలోనే చెబుతారు. నవోదయ, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో మ్యాథమెటిక్స్ సైన్స్ ఇంగ్లీష్ మీడియంలో చెబుతూ సోషల్ స్టడీస్ మాతృభాషలో చెబుతారు. హయ్యర్ ఎడ్యుకేషన్ ఖచ్చితంగా ఇంగ్లీష్ మీడియంలోనే ఉండాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### వృక్షో రక్షతి రక్షితః

శబ్ద,వాయుకాలుష్యంతో మానవుడు కకావికలం అవుతున్నాడు. ఇక పశుపక్ష్యాదుల సంగతి సరేసరి. ప్రకృతి అసమతుల్యత వైపుపయనిస్తూ ఆపదలతో విలయతాండవం చేస్తున్నా నరుడు మేలుకోలేదన్నవిషయం ఆందోళనకరం. ఇది ముమ్మాటికి మానవ తప్పిదం. మనం ఎంత భయంకర వాతావరణంలో ఉన్నామనేది ఏదో ఒకచోట పుడమి తల్లి కన్నెర్ర కారణంగా తుఫాన్, సునామి రక్కసి విరుచుకుపడడమే ఇందుకు నిదర్శనం. అటవి సంపద, చెరువులు, భూగర్భజలాలు, ఇంకుడు గుంతలను పరిక్షించుకోవాలి. అభివృద్ధినెపంతో ఇష్టానుసారంగా పరిసరాలకు హాని తలపెట్టేపనులు ఇకనుంచి అయినా మానుకోవాలి. ప్రపంచ దేశాలకే పెను సవాళ్లుగా ఎదురవుతున్న గ్లోబల్ వార్మింగ్‌కై సమష్టి కృషితో ప్రయత్నించాలి.

-ఆర్.వెంకటేష్, బెంగళూరు

### పర్యవేక్షణ తప్పనిసరి

ప్రస్తుతం పాఠశాలలకు విద్యార్థులను చేరవేస్తున్న ఆటోల భద్రత తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రైవేటు బస్సుల ఫీజులు భరించలేక, పల్లెలనుంచి సరైన రవాణా సౌకర్యాలు లేక చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ఆటోల్లో పంపించక తప్పని పరిస్థితి. ఆటోడ్రైవర్ల అత్యాశ, అధికారుల పర్యవేక్షణాలోపం విద్యార్థుల ప్రాణాలకు ముప్పు తెస్తున్నాయి. అతివేగం, ఎక్కువ మంది పిల్లలను ఎక్కిస్తే ఎక్కువ ఆదాయం అనే డ్రైవర్ల ఆలోచన ప్రధాన ప్రమాద కారణాలుగా మారుతున్నాయి.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఉత్తరాదిని ఊపేస్తున్న భారీ వర్షాలు



## హిమాచల్‌లో ఇప్పటివరకూ 170 మంది మృతి

## 301 రహదారుల్లో రాకపోకలు నిలిపివేత

## రాజస్థాన్, ఢిల్లీల్లోను కుంభవృష్టి

**సిమ్లా,జూలై 31:** ఉత్తరాది రాష్ట్రాల్లో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు బీభత్సాన్ని సృష్టించాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్‌లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్‌లో భారీ వర్షాల కారణంగా భారీ సంఖ్యలో ప్రాణ నష్టం సంభవించింది. కొండచరియలు విరిగిపడటం వల్ల పలు రహదారులను బ్లాక్ చేశారు. అలాగే మరో రెండు రోజులపాటు భారీవర్షాలు కరిసే అవకాశముందని భారతవాతావరణశాఖ అంచనా వేసింది. హిమాచల్ ప్రదేశ్ అత్యవసర విపత్తు నిర్వహణ కేంద్రం తెలిపిన వివరాలు ప్రకారం జులై 31 ఉదయం 10గంటలకు నాటికి మొత్తం 301 రహదారులు ఇప్పటికే బ్లాక్ చేశారు. 436 విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. 254 నీటి సరఫరా పథకాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇక జూన్ 20న మొదలైన వర్షాల కారణంగా 170మంది మరణించారు. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు, క్లౌడ్‌బరస్ట్, విద్యుదాఘాతం వంటి ఘటనల కారణంగా 94 మంది మరణించారు. రోడ్డు ప్రమాదాల్లో 76 మంది మృతి చెందినట్లు రాష్ట్ర విపత్తు కేంద్రం తెలిపింది. వర్షాల కారణంగా 400కు పైగా ఇళ్లు, 1,627 గోశాలలు, రోడ్లు, విద్యుత్ లైన్లు, నీటి వ్యవస్థలతోసహా ప్రభుత్వ ఆస్తులు గణనీయంగా దెబ్బతిన్నాయి. 2,743 హెక్టార్ల పంటలు నాశనమయ్యాయి. 680 ఇళ్లు ధ్వంసమయ్యాయి. 22,900 పశువులు మృతి చెందినట్లు రాష్ట్ర విపత్తు కేంద్రం పేర్కొంది. అలాగే కొండచరియలు విరిగిపడటం, వరదలకు గురయ్యే ప్రాంతాల్లో అవసరమైతే తప్ప ప్రయాణాలు చేయొద్దని రాష్ట్ర విపత్తు కేంద్రం సూచించింది. ప్రస్తుతం పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని, వర్షాల కారణంగా సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోందని సూచించిందిపేర్కొంది. ఇక రాజస్థాన్‌లో వచ్చే 48 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ముఖ్యంగా అజ్మీర్, జయ్‌పుర్, బీకనేర్, జోధ్‌పూర్ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కోటా, ఉదయపుర్, భరత్‌పుర్ ప్రాంతాల్లోని కొన్ని చోట్ల మోస్తరునుంచి భారీవర్షం కురవొచ్చని తెలిపింది. ఆగస్టు 1న భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆగస్టు 2 నుంచి తేలిపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేసింది. రానున్న 24గంటల్లో తూర్పు రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని సూచించి. రాజస్థాన్‌లోని ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 12 జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను ప్రటించింది. దీంతో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు అధికారులు. కొన్ని ప్రాంతాల్లో ఆగస్టు 2వరకు సెలవులు ప్రకటించారు. రాజస్థాన్‌లో జూన్ 15 నుంచి ఇప్పటి వరకు 80మంది మరణించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గడచిన కొన్ని రోజులగా దేశరాజధాని దిల్లీలో కూడా వర్షాలు కురుస్తున్నాయి. అయితే గురువారం కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. రోజంతా తేలికపాటి జల్లులతో ఉంటుందని అంచనా వేసింది.




## ట్రంప్ నిజం చెప్పినా తీరుమారని మోడీ

### లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,జూలై 31:** భారత ఆర్థిక వ్యవస్థ డెడ్ ఎకానమీగా మారిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ స్పందించారు. భారత్ డెడ్ ఎకానమీ అని ప్రపంచంలో ప్రతి ఒక్కరికి తెలిసిపోయిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి మినహా ప్రతి ఒక్కరికి ఈ విషయం తెలుసని ఎద్దేవా చేశారు. కేవలం ఒక అదానీకి సాయం చేసేందుకు భారత ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని బిజెపిపై మండిపడ్డారు. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం కుదిరితే ట్రంప్ చెప్పినట్లే మోడీ చేస్తారు. మన ఆర్థిక, రక్షణ, విదేశాంగ విధానాన్ని ప్రభుత్వం పూర్తిగా ధ్వంసంచేస్తుంది. దేశాన్ని పూర్తిగా నాశనం చేస్తున్నారు. నేనే కాల్పుల విరమణ చేశానని ట్రంప్ దాదాపు ముప్పయి 32 సార్లు చెప్పారు. దీంతోపాటు 5 ఇండియన్ జెట్లు కూడా కూలాయని అన్నారు. ఇప్పుడు వచ్చి ఏకంగా 25శాతం సుంకాలు వేస్తున్నానని ప్రకటించారు. వీటన్నింటికి ప్రధాని మోడీ సమాధానం చెప్పలేకపోతున్నారు, ఎవరి చెప్పుచేతల్లో ఆయన ఉన్నట్లని విపక్ష నేత రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. విదేశాంగ మంత్రి పార్లమెంట్‌లో మాట్లాడుతూ మనకు అద్భుతమైన విదేశాంగ విధానం ఉందని చెప్పారు. ఒకవైపు అమెరికా దూషిస్తుంది. మరో వైపు చైనా మనవెనుకపడుతుంది. మీరు ప్రపంచ వ్యాప్తంగా అఖిలపక్ష బృందాలను పంపినా ఒక్క దేశం కూడా పాకిస్థాన్ వైఖరిని ఖండించలేదు. ప్రధాని మెడీ తన ప్రసంగంలో ఎక్కడా ట్రంప్, చైనా పేరు ఎత్తలేదు. పహల్గాం ఉగ్రదాడికి కారణమైన పాకిస్థాన్ ఆర్మీ చీఫ్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో కలిసి భోజనం చేసి భారీ విజయాన్ని సాధించామని అంటున్నారని రాహుల్ మండిపడ్డారు.

## భారత్-రష్యా బంధం.. 'ఐ డోంట్ కేర్'

### డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు



**వాషింగ్టన్, జూలై 31:** భారత దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేయడమే అందుకు కారణమని కూడా తెలిపారు. తాజాగా రష్యా, భారత్‌లను ఉద్దేశిస్తూ ఆయన మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ట్రూత్ సోషల్‌లో ఆయన ఓ పోస్టు పెట్టారు. రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకున్నా తనకు సంబంధం లేదన్నారు. వారి ఆర్థిక వ్యవస్థను మరింత పతనం చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీతో చాలా తక్కువ వ్యాపారం చేస్తున్నామన్నారు. ఎందుకంటే భారత్ అత్యధికంగా సుంకాలు విధిస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా రష్యా, యుఎస్‌లు కలిసి ఎలాంటి వ్యాపారం చేయట్లేదని ట్రంప్ స్పష్టం చేశారు. తర్వాత ఆ దేశ మాజీ అధ్యక్షుడు దిమిత్రి మద్వెదేవ్‌పై విరుచుకుపడ్డారు. తమతో వాషింగ్టన్ గేమ్ ఆడుతుందని, అది యుద్ధానికి దారి తీయొచ్చని దిమిత్రి హెచ్చరించడంపై ట్రంప్ స్పందిస్తూ.. ఆయన ఇంకా అధ్యక్షుడిననే అనుకుంటున్నారని విమర్శించారు. ఆయనప్రమాదకరంగా ప్రవర్తిస్తున్నారని హెచ్చరించారు. రష్యాతో వ్యాపారాన్ని కొనసాగిస్తే భారీగా సుంకాలు విధిస్తాయని భారత్‌తోపాటు పలు దేశాలను ఇటీవల పలుమార్లు అమెరికా హెచ్చరిస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఇదే కారణాన్ని చూపుతూ.. భారత దిగుమతులపై 25 శాతం సుంకంతోపాటు, పెనాల్టీలుకూడా విధించారు. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో న్యూఢిల్లీ ఒకటని ఆరోపించారు. ఆగస్టు 1నుంచి ఈనిర్ణయం అమలులోకి వస్తుందన్నారు. రష్యా నుంచి దిగుమతుల కారణంగా యుఎస్ పెనాల్టీలకు గురైన తొలి దేశం భారత్. ఈ సుంకాలపై భారత్ స్పందిస్తూ.. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొంది.



## బిజెపితో ఒపిఎస్ తెగతెంపులు

### స్టాలిన్‌తో మార్నింగ్‌వాక్ .. వెనువెంటనే తన నిర్ణయం వెల్లడి

**చెన్నై,జూలై 31:** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి, అన్నాడిఎంకే బహిష్కృత నేత ఒపిఎస్‌గా పిలుచుకునే ఓ పన్నీర్ సెల్వం ఎన్డీయేతో తెగదెంపులు చేసుకున్నట్టు గురువారం ప్రకటించారు. గతేడాది పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఒపిఎస్ బిజెపి నాయకత్వంలోని ఎన్డీయే కూటమిలో చేరిన విషయం తెలిసిందే. అయితే, తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌తో మార్నింగ్ వాక్ సందర్భంగా సమావేశమైన కొద్ది గంటల్లోనే పన్నీర్ సెల్వం ఈ ప్రకటన చేయడం గమనార్హం. అదే సమయంలో, వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్‌లో తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈ పరిణామం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. గత కొద్దిరోజుల నుంచి కేంద్ర ప్రభుత్వంపై పన్నీర్‌సెల్వం తీవ్రమైన విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా తమిళనాడుకు 'సమగ్ర శిక్షాభియాన్' నిధులను విడుదల చేయకపోవడంపై ఆయన మండి పడ్డారు. విద్యార్థులు, ఉపాధ్యాయులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఒపిఎస్ ఆగ్రహంవ్యక్తం చేశారు. కాగా, 2022లోనే అన్నా డిఎంకే నుంచి పన్నీర్ సెల్వంను బహిష్కరించిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జరగబోయే తమిళనాడు ఎన్నికల్లో అధికార డిఎంకే, నటుడు విజయం కొత్త పార్టీ టివికే, బిజెపి అన్నాడిఎంకే కూటమిమధ్య త్రిముఖ పోరు తప్పదని భావిస్తున్నారు. గతేడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీ పెట్టిన విజయ్‌కు ఇవే తొలి ఎన్నికలు.

## ఐర్లాండ్‌లో మరో జాత్యహంకార దాడి

**డబ్లిన్,జూలై 31:** ఐర్లాండ్‌లో జాత్యహంకార దాడి ఘటన చోటుచేసుకుంది. డబ్లిన్‌లో భారత్‌కు చెందిన ఓ వ్యక్తిపై అక్కడి కొందరు యువకులు దాడికి పాల్పడ్డారు. సంతోశ్ యాదవ్ అనే వ్యక్తి లెట్టర్‌కెన్ని సిటీలో ఉన్న విసార్ ల్యాబ్ అండ్ టెక్నాలజీ కంపెనీలో సీనియర్ డేటా అనలిస్టుగా పనిచేస్తున్నాడు. తనపై జరిగిన దాడిగురించి ఆయన తన లింక్డిన్ ప్రొఫైల్‌లో పోస్టు చేశారు. తల, ముఖం, మెడ, ఛాతి, చేతులు, కాళ్లపై యువకులు దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో ఈ ఘటనపై ఆయన సుదీర్ఘమైన పోస్టు చేశారు. భారతీయ సంతతి వ్యక్తులపై ఐర్లాండ్‌లో దాడులు పెరుగుతున్నట్లు అతను పేర్కొన్నారు.

డిన్నర్ చేసిన తర్వాత తన అపార్ట్‌మెంట్ వద్ద వాకింగ్ చేస్తున్న సమయంలో ఆరుగురు వ్యక్తులు అటాక్ చేసినట్లు సంతోశ్ యాదవ్ తెలిపారు. తన కంటి అద్దాలను తీసివేసి.. నిర్దాక్షిణ్యంగా తల, మెడపై దాడి చేశారన్నారు. రోడ్డుపైనే రక్తం కారుతున్న దశలో తనను వదిలేయడంతో అంబులెన్స్‌కు ఫోన్ చేశానని, వాళ్లు ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. తన దవడ ఎముక విరిగినట్లు మెడికల్ బృందం పేర్కొన్నట్లు తన పోస్టులో తెలిపారు. కొన్ని రోజుల క్రితం ఇదే కోవలో డబ్లిన్‌లోనే ఓ భారతీయుడిపై దాడి జరిగింది. చిన్న పిల్లలతో అనుచితంగా ప్రవర్తించాడనే నెపంతో ఒక గుంపు భారత వ్యక్తిపై దాడికి పాల్పడింది. ఈ ఘటన జరిగిన వారం తర్వాత మళ్లీ ఇప్పుడు మరో జాత్యహంకార దాడి వెలుగులోకి వచ్చింది.

## పహాల్గాం ఉగ్రదాడి లష్కరే తోయిబా పనే!

### కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



**న్యూఢిల్లీ,జూలై 31:** పహాల్గాం ఉగ్రదాడిలో లష్కరే తోయిబా హస్తం ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. ఆపరేషన్ మహదేవ్ చేపట్టి అంతం చేసిన ముగ్గురు ఉగ్రవాదులు ఆ ఉగ్రసంస్థకు చెందినవారేనని స్పష్టం చేశారు. వాస్తవానికి పహాల్గాం దాడి వెనుక ఉన్న ఉగ్రవాదుల తలపై కాల్చి చంపాలని ప్రజలు కోరుకున్నారని, యాదృచ్ఛికంగా ఆ ముగ్గురు ఉగ్రవాదులను మన బలగాలు తలపైనే గురిచూసి కాల్చాయని ఆయన రాజ్యసభలో చెప్పారు. మహిళలు, పిల్లల ముందు మతం అడిగి మరీ చంపేశారని, ఇంత అనాగరిక నేరం ఇంతకు ముందు ఎన్నడూ జరగలేదని అమిత్‌షా అన్నారు. కాంగ్రెస్‌కు జాతీయ భద్రత కంటే రాజకీయాలే ముఖ్యమైపోయాని అమిత్ షా విమర్శలు గుప్పించారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో కాంగ్రెస్ సంతృప్తి పడుతోందని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాక్‌ఆక్రమిత కాశ్మీర్‌లను పాకిస్థాన్‌కు ఇచ్చేసిందని, కానీ బీజేపీ దానిని తిరిగి భారత్‌లో చేరుస్తుందని అమిత్‌షా స్పష్టం చేశారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాల వల్లే ఉగ్రవాదం వృద్ధి చెందిందని ఆయన విమర్శించారు. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి ఉంటే, ఉగ్రవాదులపై చర్య తీసుకునే బదులు పత్రాలను పంపి ఉండేదని ఆయన ఆరోపించారు. భారత్‌లో ఉగ్రవాదం పూర్తిగా అంతరించే దిశలో ఉందని, అది కచ్చితంగా అంతం అవుతుందని అమిత్‌షా అన్నారు. హిందువులు ఎప్పటికీ ఉగ్రవాదులు కాలేరని, ఈ విషయాన్ని ప్రపంచానికి గర్వంగా ప్రకటిస్తున్నానని తెలిపారు. మరోవైపు అమిత్‌షా మాట్లాడడం ప్రారంభించగానే ప్రతిపక్ష పార్టీలు నిరసనలు వ్యక్తం చేశాయి. ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడాలని డిమాండ్ చేశాయి. కానీ సభాధ్యక్షులు విపక్షాల డిమాండ్‌ను అంగీకరించలేదు. దీంతో వారు వాకౌట్‌చేశారు. అమిత్‌షా ప్రసంగాన్ని కొనసాగిస్తూ, కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర హోంమంత్రి చిదంబరంపై విమర్శలు గుప్పించారు. చిదంబరం నా రాజీనామా కోరారు. పహాల్గాంలో దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందినవారని రుజువు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాదు ఆపరేషన్ సిందూర్ సమర్థతను కూడా చిదంబరం సవాల్ చేశారు. అంటే కాంగ్రెస్‌కు జాతీయ భద్రత కన్నా రాజకీయాలు ముఖ్యం. అది ఓటు బ్యాంకు రాజకీయాలు, బుజ్జగింపు రాజకీయాల్లో మునిగిపోయింది. కాంగ్రెస్ మనస్తత్వాన్ని చిదంబరం ప్రపంచానికి బహిర్గతం చేశారు. ఓటు బ్యాంకు కోసం వారు పాకిస్థాన్, లష్కరే తోయిబాతో సహా ఉగ్రవాదులు అందరికీ మద్దతు ఇస్తారని అమిత్‌షా విమర్శలతో ధ్వజమెత్తారు. శివాజీ మహారాజ్ మొఘలులపై పోరాడినప్పుడు, ఆయన యుద్ధ నినాదం హరహర మహాదేవ్. వాస్తవానికి భారతీయ సైనికులు వివిధ యుద్ధ నినాదాలు మతాలపై ఆధారపడి ఉంటాయి. అయితే వాటికి హిందూ, ముస్లింలతో సంబంధంలేదు. ఉగ్రవాదులను తుదముట్టించేందుకు మన సిఆర్‌పీఎఫ్, సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు చాలా కృషి చేశారు. కష్టతరమైన భూభాగంలో ఉంటూ, డ్రోన్‌ల ద్వారా పంపే ఆహారాన్ని తిన్నారు. ఇలా ఉగ్రవాదులను వెంబడించి వారికి తుదముట్టించారని రాజ్యసభలో హోంమంత్రి వివరించారు.

## మాలేగాం పేలుళ్లకేసులో ఏడుగురు నిందితులు నిర్దోషులే

### ముంబయి ఎన్ఐఎ కోర్టు తీర్పు



**ముంబయి,జూలై 31:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో ముంబయిలోని ఎన్ఐఎ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు నిందితులను నిర్దోషులుగా తేల్చింది. మాజీ ఎంపీ సాధ్వి ప్రజ్ఞా సింగ్ సహా మిగిలిన నిందితులు నేరం చేశారని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలు లేవని వెల్లడించింది. మాలేగావ్‌లో బైకులోనే బాంబు పెట్టినట్లు ఎన్ఐఎ నిరూపించలేక పోయిందని కోర్టు పేర్కొంది.

మాజీ సాధ్వి ప్రజ్ఞాసింగ్‌కు సొంత బైకు ఉన్నట్లు ఆధారాల్లేవని న్యాయస్థానం పేర్కొంది. మరో నిందితుడు కర్నల్ ప్రసాద్ పురోహిత్ ఇంట్లో ఆర్డీఎక్స్ ఉన్నట్లు ఆధారాల్లే వని వివరించింది. ఘటనాస్థలం నుంచి వేలి ముద్రలు, డిఎన్ఎ నమూనాలను సేకరించలేదని తెలిపింది. నిందితుల మధ్య సమావేశాలు జరిగినట్లు, కుట్ర పన్నినట్లు దర్యాప్తు సంస్థ నిరూపించలేక పోయిందని పేర్కొంది. ఈ కేసులో తీవ్రవాద నిరోధక చట్టం చేర్చడానికి వీల్లేదని, అది చెల్లదని తీర్పులో స్పష్టంచేసింది. 2008 సెప్టెంబర్ 29న మాలేగావ్‌లో మసీదు వద్ద పార్క్ చేసిన బైకులో బాంబు పేలి ఆరుగురు దుర్మరణం చెందారు. 100 మందికిపైగా గాయ పడ్డారు. ఈ కేసులో బిజెపి నాయకురాలు, మాజీ ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్, రిటైర్డ్ మేజర్ రమేష్ ఉపాధ్యాయ, అజయ్ రాహిర్కర్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి నిందితులుగాఉన్నారు.

17 సంవత్సరాల తర్వాత ఈ కేసులో తీర్పు వెలువరించిన ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు నిందితులు అందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో 2018లో ప్రారంభమైనవిచారణ 2025 ఏప్రిల్ 19న ముగియగా, ఆ రోజే తీర్పును రిజర్వుచేసిన న్యాయస్థానం గురువారం వెలువరించింది.

ఈ కేసును దర్యాప్తు చేసిన ఎన్ఐఎ, నిందితులకు తగినశిక్ష విధించాలని వాదించింది. ముస్లిం జనాభా గణనీయంగాఉన్న మాలేగావ్‌లో ఈ పేలుడు ద్వారా ముస్లిం సమాజంలోని ఒక వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నించారని ఎన్ఐఏ ఆరోపించింది. మతపరమైన ఇందుకు కచ్చితమైనా, నిరూపించదగిన ఆధారాలు ఉన్నట్లు ఎన్ఐఎ వాదించింది. నిందితులు కుట్రలో నేరుగా పాల్గొన్నారని తెలిపింది. రంజాన్ మాసంలో, నవరాత్రికి ముందు పేలుడు జరపడం ద్వారా ముస్లిం సమాజంలోని మతకలహాల భయం సృష్టించాలనే ఉద్దేశంతోనే నిందితులు ఈ చర్యకు పాల్పడినట్లు ఎన్ఐఎ తెలిపింది.

## చైనాలో మెరుపు వరదలు



### కొట్టుకుపోయిన రూ. 12 కోట్ల బంగారం

### వెతుకులాటకు వీధుల్లో ఎగబడిన స్థానిక జనం!

**బీజింగ్, జూలై 31:** చైనాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చాలాచోట్ల మెరుపు వరదలు సంభవించాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లో వరదల కారణంగా ఓ నగల దుకాణంలో నుంచి బంగారం, వెండి ఆభరణాలు కొట్టుకుపోయాయి. దీంతో వాటిని వెతికేందుకు వీధుల్లో స్థానికులు పోటీ పడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లోని వుచి కౌంటీలో జూలై 25న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతం సముద్ర తీరానికి సమీపంలో ఉంటుంది. ఇక్కడ స్థానికంగా ఉన్న లావోఫెంగ్జియాంగ్ ఆభరణాల దుకాణాన్ని ఎప్పటిలాగే ఉదయం సిబ్బంది తెరిచారు. అప్పటికే భారీ వర్షాలతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. చూస్తుండగానే వరద నీరు దుకాణంలోకి చొచ్చుకువచ్చింది. వరద ఉద్ధృతి పెరగడంతో కళ్లముందే దుకాణంలోని నగలు, సేఫ్ బాక్స్ కొట్టుకుపోయాయి.

అయితే ఆ వరదల్లో కొట్టుకుపోయిన వాటిల్లో బంగారు హారాలు, గాజులు, ఉంగరాలు, చెవి దుద్దులు, వజ్రపు ఉంగరాలు, వెండి ఆభరణాలు ఉన్నట్లు దుకాణ యజమాని తెలిపారు. సేఫ్ బాక్సులో రీసైకిల్ చేసిన బంగారంతోపాటు భారీగా నగదు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20 కిలోల బంగారం, నగదు గల్లంతైనట్లు తెలిపారు. వీటి విలువ 10 మిలియన్ యువాన్లు (అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 12 కోట్ల పైమాటే) ఉంటుందని వెల్లడించారు.

బంగారం కొట్టుకుపోయిన విషయం తెలియగానే స్థానికులు పెద్దఎత్తున వీధుల్లోకి చేరి బంగారం కోసం వెతకడం ప్రారంభించారు. కొందరు స్వచ్ఛందంగా తమకు దొరికిన ఆభరణాలను వెనక్కి ఇచ్చేశారని దుకాణ యజమాని తెలిపారు. ఇప్పటివరకు కిలో బంగారం తమ వద్దకు చేరిందన్నారు. రోజులు గడుస్తున్నా మిగతా బంగారం కోసం స్థానికులు వెతుకుతూనే ఉన్నారు. ఇందుకు సంబంధించిన విడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

## సంక్షిప్తంగా..

### డెల్టా విమానంలో కుదుపులు.. అత్యవసర ల్యాండింగ్

**వాషింగ్టన్, జూలై 31:** డెల్టా ఎయిర్‌లైన్‌కు చెందిన విమానం కుదుపులకు లోనైంది. దీంతో ఈ విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. అసలేం జరిగిదంటే.. బుధవారం డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన డిఎల్56 విమానం సాల్ట్ లేక్ సిటీ నుంచి ఆమ్‌స్టర్‌డామ్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో విమానం ఒక్కసారిగా కుదుపులకు లోనైంది. దీంతో విమానాన్ని మినియాపొలిస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనలో 25 మందికిపైగా ప్రయాణికులకు గాయాలైనట్లు తెలుస్తోంది. దీంతో వెంటనే వైద్య సిబ్బంది క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి.. చికిత్స అందించారు. ఈ ఘటన సమయంలో విమానంలో 275 మంది ప్రయాణికులు, 13 మంది సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. డెల్టా ఎయిర్‌లైన్స్ కూడా దీన్ని ధ్రువీకరించింది. అయితే ఈ కుదుపులకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారని తెలిపింది.

### అండమాన్, నికోబార్‌లోని పోర్ట్‌బ్లెయిర్‌లో ఇడి దాడులు!

**న్యూఢిల్లీ, జులై 31:** ఓ మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అండమాన్ నికోబార్ దీవుల్లో సోదాలు నిర్వహించారు. ఈ దీవుల్లో ఇడి తనిఖీలు చేపట్టడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఓ సహకారబ్యాంకు రుణాల వ్యవహారంలో అవకతవకలకు పాల్పడినట్లు స్థానిక కాంగ్రెస్ మాజీ ఎంపి కుల్దీప్‌రాయ్‌శర్మ తదితరులపై ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఇడి అధికారులు పోర్ట్‌బ్లెయిర్ పరిసరాల్లోని తొమ్మిది ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. కోల్‌కతాలోనూ తనిఖీలు కొనసాగాయి. అండమాన్ నికోబార్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు ద్వారా రుణాలు, ఓవర్‌డ్రాఫ్ట్ మంజూరులో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు 15 షెల్ సంస్థలు సృష్టించి బ్యాంకు నుంచి రూ.200 కోట్లకుపైగా రుణాలను మోసపూరితంగా తీసుకున్నారని అధికారులు వెల్లడించారు.

### రూ. 800 కోట్ల భూమి కబ్జా: కర్ణాటక లోకాయుక్తకు ఫిర్యాదు

**బెంగళూరు, జూలై 31:** కర్ణాటక రాజధాని బెంగళూరులో రూ. 800 కోట్ల విలువైన 108 ఎకరాల భూమిని కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌సి బాలకృష్ణ కబ్జా చేశారని బిజెపి నేత ఎన్ఆర్ రమేశ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ సన్నిహితుడు యశ్వంత్‌పూర్ ఎమ్మెల్యే ఎస్‌టి సోమశేఖర్, పలువురు ప్రభుత్వ అధికారులకు ఈ కబ్జాలో హస్తం ఉందని రమేశ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. రమేశ్ లోకాయుక్తకు చేసిన ఫిర్యాదు ప్రకారం.. బెంగళూరు సౌత్ తాలూకాలోని తవరకేరె హోబ్లిలోని సర్వే నంబర్లు 233, 234, 235, 236లలో గల 108 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. అందులో రూ. 165 కోట్ల విలువ చేసే 26 ఎకరాల భూమిలో ఇప్పటికే నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. కెంగెరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఈ యేడాది ఏప్రిల్ 3న ఈ రిజిస్ట్రేషన్ జరిగింది. యశ్వంత్‌పూర్ నియోజకవర్గం కురుబరహల్లి గ్రామంలోని 158 సర్వే నంబర్‌లో మరికొంత భూమి కబ్జాకు గురైంది. మొత్తం 130.29 ఎకరాల ఈ భూమి విలువ రూ. 800 కోట్లు ఉంటుంది. అంటే అక్కడ ఒక్కో ఎకరా రూ. 6 కోట్ల చొప్పున పలుకుతోంది.

### చీటింగ్‌కేసులో తమిళనటుడు అరెస్టు!



**చెన్నై,జూలై 31:** తమిళ నటుడు ఎస్. శ్రీనివాసన్‌ను ఒక భారీ మోసం కేసులో ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.1000 కోట్ల లోన్ ఇప్పిస్తానని చెప్పి ఒక సంస్థ నుంచి రూ. 5 కోట్లు తీసుకుని మోసం చేసినట్లు ఆరోపణలు రావడంతో అతడిని బుధవారం ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2010లో ఓ సంస్థకు రూ.1000 కోట్లు రుణం ఇప్పిస్తానని శ్రీనివాసన్ హామీ ఇచ్చారు. దీనికి బదులుగా వారి వద్ద నుంచి రూ.5 కోట్లు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. నెల రోజుల్లో లోన్ వస్తుందని రాకపోతే డబ్బులు తిరిగి ఇస్తానని హామీ ఇచ్చారు. అడ్వాన్స్‌గా తీసుకున్న డబ్బును వ్యక్తిగత అవసరాల కోసంతో పాటు సినిమాల నిర్మాణానికి ఉపయోగించినట్లు సమాచారం. అయితే, నెలలు గడిచినా రుణం మంజూరు కాకపోవడంతో మోసపోయామని గుర్తించిన సంస్థ యాజమాన్యం పోలీసులను ఆశ్రయించింది. దీంతో ఢిల్లీ పోలీసులు శ్రీనివాసన్‌ను చెన్నైలో అరెస్టు చేశారు. ఇక, 2010లో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన శ్రీనివాసన్ ఇప్పటివరకు 60కి పైగా చిత్రాల్లో నటించారు.

## శ్రీశైలమల్లన్నను దర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకున్నారు. అర్చకులు, అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీశైలమల్లన్నకు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం వేద ఆశీర్వచనం ఇచ్చి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీశైల క్షేత్రంలోని 'తాండ్ర పాపారాయ వెలమ చౌల్ట్రీ' ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కుర్మయ్యగారి శాంతమ్మ నారాయణరావు భవన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలు, పదవులు శాశ్వతం కాదని, ఎవరు ఎక్కడ ఉన్నా, సమాజహితం కోసం పాటుపడాలని అన్నారు. కార్యక్రమ సభ్యులు ఒక కుటుంబంగా శ్రీశైలంలో వసతిగృహం నిర్మించుకోవడం సంతోషకరం, అభినందనీయమన్నారు.

## తెలంగాణ యూనివర్సిటీకి ఇంజనీరింగ్ కాలేజీ మంజూరు

### నాలుగు కోర్సుల్లో అడ్మిషన్లు.. ఈ యేడాది నుంచే అడ్మిషన్ల స్వీకరణ: ప్రభుత్వ ఉత్తర్వులు

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మరో ఇంజనీరింగ్ కాలేజీకి అనుమతిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ యూనివర్సిటీలో కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీని అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఏర్పాటు కానున్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో 4 కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన జీవో ఎంఎస్ నంబర్ 32ను విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్-సీఎస్ఈ, బీటెక్-సీఎస్ఈ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్), బీటెక్- కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ, బీటెక్-డాటా సైన్స్ కోర్సుల్లో ఈ ఏడాది 2025-26 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు తీసుకోనున్నట్టు విద్యాశాఖ సెక్రెటరీ యోగితా రాణా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒక్కో కోర్సులో 60 సీట్ల చొప్పున 240 సీట్లను భర్తీ చేయనున్నారు. అయితే ఇప్పటికే ఎప్ సెట్- 2025 సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ పూర్తయిన నేపథ్యంలో మూడో ఫేజ్‌లో తెలంగాణ యూనివర్సిటీకి మంజూరైన ఇంజనీరింగ్ కాలేజీలో అడ్మిషన్లు తీసుకోనున్నట్టు తెలుస్తోంది.

## రెండు వారాల్లో చేపపిల్లల బకాయిలు చెల్లించాలి

### మత్స్య శాఖ అధికారులకు హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని జలాశయాల్లో ఉచిత విడుదల చేసేందుకు గాను వివిధ కంపెనీల వద్ద కొనుగోలు చేసిన చేప, రొయ్య పిల్లలను సరఫరా చేసిన వారికి 2 వారాల్లో డబ్బులు చెల్లించాలంటూ మత్స్యశాఖకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బిల్లులు చెల్లించి గత ఉత్తర్వుల అమలు నివేదికను సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. కాగా తమకు ప్రభుత్వం నుండి రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలంటూ డిసెంబర్లో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో చేప, రొయ్య పిల్లల పంపిణీదారులు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్లపై జస్టిస్ ఎన్వీ. శ్రవణ్ కుమార్ విచారించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సాంకేతిక కారణాలతో బిల్లులు చెల్లించలేకపోయామన్నారు. ప్రస్తుతం రూ.27 కోట్లు మంజూరైందని, త్వరలో బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఇక పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వినిపిస్తూ పిటిషనర్లకు బిల్లులు విడుదల చేస్తే చాలని ధర్మాసనానికి తెలియచేశారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయస్థానం 2 వారాల్లో బిల్లులు చెల్లించి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ విచారణకు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ ముఖ్యకార్యదర్శి సభ్యసాచి ఘోష్, మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక ఆన్లైన్ ద్వారా కోర్టు ముందు హాజరయ్యారు. కాగా నాగర్‌కర్నూల్ కలెక్టర్ బి.సంతోష్, మత్స్య శాఖ సంచాలకులు శ్రీనివాస్ వ్యక్తిగతంగా హాజరయ్యారు.



భూనిర్వాసితులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కవిత

## భూ నిర్వాసితులకు రూ. 40 లక్షలు పరిహారం అందించాలి

### ఎమ్మెల్సీ కవిత డిమాండ్

**దామరగిద్ద, జూలై 31, ప్రభాతవార్త:** రైతు లేనిదే రాజ్యం లేదు రైతు ఏడ్చినటువంటి రాజ్యం ఎన్నడూ కూడా బాగుపడదు అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు రాజ్యం బాగుండాలంటే రాష్ట్ర ప్రజలు బాగుండాలి ప్రాజెక్టు బాధితులకు న్యాయం జరిగే వరకు నేను వదిలిపెట్టాను నీళ్ల రానటువంటి పైపుల కోసం ఊరు ముంచడం ఎందుకు రూ. 2900 కోట్ల ప్రాజెక్టు అంచనా ఒకేసారి రూ.4,500 కోట్లకు ఎలా పెరిగిందని ప్రశ్నించారు. ప్రాజెక్టు పని ప్రారంభం కాకముందే అడ్వాన్సుగా 600 కోట్లు ఇవ్వడం ఏమిటని ఎమ్మెల్సీ కవిత అన్నారు దామరగిద్ద మండలం కాన్కుర్తి గ్రామ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ బాధితులతో ఆమె ముఖాముఖి నిర్వహించి మాట్లాడారు కొడంగల్ లో ఉన్న వారు కూడా తమ బిడ్డలేనని వారికి కూడా నీళ్లు రావాలని ఆ ప్రాంత రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మధ్యలో ఉన్న రైతులను ఎండబెడతామంటే సరైంది కాదన్నారు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుతో 1,80,000 ఎకరాలకు నీరు అందేదని అలాంటి ప్రాజెక్టు పూర్తయితే కేసీఆర్కు పేరు వస్తుందన్న ఉద్దేశంతో కేవలం లక్ష ఎకరాలకు సాగు నీరు వచ్చే ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి తీసుకురావడం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు పరిహారంగా 35 లక్షల నుంచి 40 లక్షలు ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# దేవాదాయ శాఖలో అందుబాటులోకి ఇ-ఆఫీసు సర్వీసు

### ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** దేవాదాయ శాఖ ఫైల్స్ అన్నీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు దేవా దాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం ఆమె సచివాలయంలో దేవాదాయ శాఖకు సంబంధించి ప్రధాన కార్యాలయం కమిషనరేట్‌లో ఇ-ఆఫీస్ సర్వీసును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇ-ఆఫీస్ వల్ల దేవాదాయ శాఖలో సంస్కరణలు జరుగుతాయని, ఇదొక గొప్ప ముందడుగన్నారు. ఈ ఆఫీసు ద్వారా ఫైల్స్ త్వరగా, ఆలస్యం లేకుండా క్లియర్ చేయవచ్చున్నారు. డిజిటల్‌గా అన్నీ ట్రాక్ అవుతాయన్న కారణంగా సిబ్బంది మధ్య అపోహలు ఉండవన్నారు. అలాగే, ఫైల్స్ మాయం కావడం, తడిసిపోవడం, దొంగతనం లేదా అగ్ని ప్రమాదాల్లో నష్టం చెందడం లాంటి సమస్యలు ఉండవన్నారు. ఎక్కడినుంచైనా, ఎప్పుడైనా ఫైల్స్ క్లియర్ చేసే అవకాశం ఉంటుందని, ఉన్నతాధికారులు, ఇతశాఖల వల్ల వారి కార్యాలయాల్లో భౌతికంగా ఉండాల్సిన అవసరం లేదన్నారు. అత్యవసర ఫైల్స్‌ను ప్రత్యేకంగా గుర్తించేదుకు ట్యాగ్ చేయవచ్చన్నారు. కొద్ది రోజుల్లో యాదగిరిగుట్ట టెంపుల్ సర్వీసులను కూడా డిజిటలైజ్ చేస్తామని, అనంతరం రాష్ట్రంలోని 30 పెద్ద దేవస్థానాల్లో ఇ-ఆఫీస్ సర్వీసులు వినియోగిస్తామన్నారు. దీంతో పాటు పీఏలు, సీసీలు లాంటి మధ్యవర్తుల జోక్యం చాలా తక్కువవుతుందన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖలో ఫైల్స్ క్లియరెన్స్ పనితీరును వేగవంతం ప్రాధాన్యతనుందని మంత్రి అన్నారు. అనంతరం దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ మాట్లాడుతూ.ఈ కొత్త విధానం ద్వారా దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో పెండింగ్ ఫైల్ వ్యవహారాలు వేగంగా, పారదర్శకంగా ముందుకు వెళ్ళనున్నాయన్నారు. ఇ-ఆఫీస్ సాఫ్ట్‌వేర్‌ను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ అభివృద్ధి చేసిందని,దీంతోపాటు అప్లికేషన్ నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఉండబోవని, పారదర్శకతకు ప్రాధాన్యత ఉంటుంద



న్నారు. ఇ-ఆఫీసు ప్రారంభోత్సవంలో భాగంగా మంత్రి కొండా సురేఖ మొదటి ఫైల్‌ను ఈఅప్లికేషన్ ద్వారా ఆమోదించారు. ఒక కారుణ్య నియామక ప్రక్రియను పూర్తి చేశారు. నవీన్ కుమార్ అనే వ్యక్తికి తన తండ్రి మరణించగా దేవాదాయ శాఖలో ప్రభుత్వ ఉద్యోగాన్ని మంత్రి సురేఖ మంజూరు చేశారు. ఇ-ఆఫీసు ప్రక్రియను విజయవంతంగా చేసినందుకు దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్. వెంకటరావును మంత్రి అభినందించారు. గత 15 రోజులుగా కమిషనర్ స్వయంగా కంప్యూటరైజేషన్ పనులను పర్యవేక్షించారని కొనియాడారు. ప్రతి సిబ్బందికి తగిన శిక్షణ కల్పించారని, ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా అమలులోకి రావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ ఎస్. వెంకటరావు, ఎన్ఐసీ జాయింట్ డైరెక్టర్ రాఘవాచారి, టెక్నికల్ మేనేజర్ సవిత తదితరులు పాల్గొన్నారు.

# పాలేరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

### విద్యాభివృద్ధికి 470 కోట్లు ఇచ్చాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**కూసుమంచి, జూలై 31, ప్రభాతవార్త:** పాలేరు ప్రజల ఆశీర్వాదంతో అసెంబ్లీలో అడుగుపెట్టిన తాను, వారి రుణం తీర్చుకునే క్రమంలో పాలేరు నియోజకవర్గంలో విద్యారంగానికి కొత్త ఊపు తెచ్చేందుకు 470 కోట్ల రూపాయలను విద్యాభివృద్ధి కోసం కేటాయించామని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 'పేద పిల్లలు చదువులో వెనుకబడకూడదు.. వారిని మణిరత్నాలుగా తీర్చిదిద్దడమే మా ప్రభుత్వ సంకల్పం' అని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఆయన కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కూసుమంచి పాత జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. 'ఈ భవనాన్ని డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసి ఈ ఏడాదిలోనే విద్యార్థుల కోసం ప్రారంభిస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడం నాకు గర్వంగా ఉంది' అని మంత్రి అన్నారు. 'గడచిన 18 నెలల్లో పాలేరు నియోజకవర్గానికి రూ. 470 కోట్ల నిధులు విద్యాభివృద్ధికి కేటాయించాం. ఐటీఐ, నైపుణ్య విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ వంటి ప్రాజెక్టులు ఈ ప్రాంతానికి కొత్త శకం తెస్తాయి. చదువు అందరికీ చేరేలా ప్రభుత్వ కృషి కొనసాగుతుంది' అని మంత్రి వివరించారు. పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 8వ తరగతి చదువుతున్న 76 మంది బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. వచ్చే ఏడాది నుంచి జూనియర్ కళాశాలలో చేరుతున్న విద్యార్థినీలకు కూడా సైకిళ్లు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, అన్ని శాఖల, విభాగాల ప్రత్యేకాధి కారులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పులలకు విషం పెట్టి చంపొద్దు.. అది నేరం

### అటవీశాఖ ముఖ్యకార్యదర్శి సువర్ణ

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** నగరం చుట్టూ అటవీ ప్రాతం అంతరించడంతో పులులు బయటకు వస్తున్నాయని అటవీశాఖ ముఖ్య కార్యదర్శి సువర్ణ అన్నారు. గురువారంఆమె అరణ్యభవన్‌లో మీడియా ప్రతినిధులతో సవవేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ... పులి కంటే చిరుతపులి తెలువైంది. చిరుత ఒఆర్ఆర్ రెండుసార్లు దాటింది. ఇప్పటి వరకు ఎవరిపైనా దాడి చేయలేదు ఆ తర్వాత అది ఫారెస్ట్‌లోకి వెళ్ళిందన్నారు.
నగరం చుట్టూ పక్కల అటవీ ప్రాంతం అంతరించడం, వాటికి అడవిలో సరైన ఆహారం దొరక్కపోతే బయటకి వస్తున్నట్లు తెలిపారు. జంతువులు, మానవులపై ఎక్కువ దాడి చేసే అవకాశం ఉందన్న ఆమె నగరంలో చిక్కిన మగ చిరుత 5నుండి 6 సంవత్సరాల వయస్సు ఉంటుంది. ఈ ఒక్క చిరుతకే ఇంత సమయం పట్టిందన్నారు.
రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అవి ఇంకా తిరుగుతున్నాయని,ప్రజలు అప్రమత్తంగా ఉండాలి మూడు వారాల తర్వాత ఈరోజు మంచిరేవులలో చిరుత చిక్కిందన్నారు.క్రూర మృగాల దాడిలో మనుషులు చనిపోతే పది లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటిస్తున్నాం. కానీ విషం పెట్టి వీటిని చంపొద్దు. చంపితే అటవీ చట్టం కేసులు నమోదు అవుతాయని ఆమె హెచ్చరించారు. పులుల సమాచారం ఉంటే.. టోల్‌ఫ్రీ 040 23231772కి కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని ఈ ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.ఫారెస్టు సీనియర్ ఆఫీసర్ శంకరన్ మాట్లాడుతూ.. చిరుత పులుల సంచారం పెరుగుతుంది కాని, పులుల సంతానం పెరగలే దన్నారు. మహారాష్ట్ర నుంచి ఎక్కువగా వస్తున్నాయని, మహబూబ్ నగర్‌లో రెండు చోట్ల చిరుత పులులు సంచరిస్తూ మను షుల మీద దాడులు చేస్తున్నాయన్నారు. చిలు కూరు ప్రాంతంలో ఉన్న చిరుతను పట్టుకు న్నామని, గతంలో ఒక చిరుతను పట్టుకో వాలాం టే మూడు నెలలు పట్టింది చిలుకూరు ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా సునా యసంగా చిరుతను పట్టుకున్నమని, ఇందుకు వాకర్స్ కూడా ఎంతో సహకరించినట్లు ఆమె తెలిపారు.

# ఎట్టకేలకు ఎరకు చిక్కిన 'చిరుత'



మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్కులో ఏర్పాటు చేసిన మేక ఎరకు చిక్కిన చిరుత ఇదే.

### ఊపిరి పీల్చుకున్న శివారు గ్రామాల ప్రజలు
### రాత్రివేళల్లో యధేచ్ఛగా తిరిగిన పులి
### ఫలించిన అధికారుల పదిరోజుల ప్రయత్నం

**హైదరాబాద్ (నార్సింగి), జూలై 31, ప్రభాతవార్త :** హైదరాబాద్ మహా నగర శివారుల్లో గత పది రోజులుగా మూడు మండలాల ప్రజలను వణికించిన 'చిరుత' ఎట్టకేలకు ఎరకు చిక్కింది. గండిపేట మం డలం మంచిరేవుల గ్రామంలో ఉన్న ఫారెస్ట్ ట్రెక్ పార్కులో మేక పిల్లను ఎరగా వేసిన బోనులోకి వచ్చి పట్టు బడింది చిరుతపులి. అటవీ శాఖ అధికారులు ఈ చిరుతను జూపార్కుకు తరలించారు.
దీంతో ఇటు స్థానిక ప్రజలు, అటు అటవీశాఖ అధికారులు ఊపి రి పీల్చుకున్నారు. పది రోజుల క్రితం మంచిరేవులలో ఉన్న వ్యాస్‌నగర్‌లో గ్రేహౌండ్స్ పోలీసులు మార్నింగ్ వాక్ చేస్తుండగా చిరుతపులి కనిపించింది. దాన్ని చూసిన పోలీసులు వెంటనే నార్సింగి పోలీసులకు సమాచారం అంద జేశారు. వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి చిరుత పాదాల ఆనవాళ్లను పరిశీలించి ఇక్కడ సంచరించేది చిరుతపులేనని తేల్చారు.
అటవీ శాఖ అధికారులు ఈ చిరుతను పట్టుకునేందుకు మృగవని పార్కు, ఫారెస్ట్ ట్రెక్ పార్కు, వ్యాస్ నగర్ ప్రాంతాలలో బోన్‌లను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి చిరుత కదలికలను పరిశీలించడం ప్రారంభించారు. బోన్‌లలో ఎరగా మేక పిల్లలను ఉంచారు. రెండు రోజుల తరువాత మంచిరేవులలో ఏర్పాటు చేసిన ఓ కెమెరాకు రోడ్డు దాటుతూ కనిపించింది. ఆ పరిసర ప్రాంతాలలో అధికా రులు నిఘాను పెంచారు.
మరో మూడు రోజుల తరువాత గోల్కొండ తారామతి బారాదరి వద్ద రోడ్డు దాటుతూ సీసీ కెమెరాకు చిక్కింది. దాంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. చిరుత పట్టుబడేంత వరకు మార్నింగ్ వాక్‌లకు కూడా వెళ్లవద్దని హెచ్చరించారు.

**ఎరకు చిక్కిన చిరుత**

అటవీ శాఖ అధికారులు వేసిన మేక ఎరకు చిరుత చిక్కింది. ఆహారం కోసం, స్థావరం కోసం చిరుత ఫారెస్టు ట్రెక్ పార్కుకు గాని, మృగవని పార్కుకు గాని తిరిగి వస్తుందని, ఈ పార్కులలోనే జింకలు, కుందేళ్లు ఉండడం వలన అధికారులు ఇక్కడే 4 బోన్లను, 14 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి చిరుత కదలికలను నిశితంగా పరిశీలించసాగారు. చిరుత గురువారం తెల్లవారుజామున ఫారెస్టు ట్రెక్ పార్కు వద్ద ఏర్పాటుచేసిన బోనులో మేకను తినేందుకు వెళ్లి పట్టుబడింది. అటవీ శాఖ అధికారులు చిరుత పట్టుబడిన సీసీ పుటేజిని పరిశీలించి దాన్ని బంధించి సురక్షితంగా హైదరాబాద్‌లోని జూ పార్కుకు తరలించారు.




# బిసి బిల్లుకు కేంద్రంలో బిజెపి అడ్డుపడుతోంది

### కాంగ్రెస్‌తో స్నేహధర్మాన్ని పాటిస్తూనే.. ప్రజాసమస్యలపై ఉద్యమిస్తాం
### రాష్ట్ర మహాసభలో ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తాం: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిసి బిల్లుకు బిజెపి పెద్ద అడ్డంకిగా మారిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బిసి బిల్లుకు బిజెపి అడ్డుపడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంపిన బిసి బిల్లులను గత 4 నెలలుగా తొక్కి పెట్టడం సరికాదని, ఆర్డినెన్స్ ఆమోదం విషయంలో సైతం ఇదే విధంగా వ్యవహరించడం సమాజసం కాదన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో గురు వారం కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బిసి బిల్లునే కాకుండా ఎస్‌సి వర్గీకరణ అమలుకు సంబంధించి ద్వంద వైఖరి అలంభిస్తోందని కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్ మూడు నెలలలోపు నిర్ణయం తీసుకో వాలని సుప్రీంకోర్టు తీర్పు నిచ్చిందని.. అయితే ఈ చట్టంలోని లోసుగుల కారణంగా అది సాధ్యమా అని కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. బిజెపిలో బిఆర్ఎస్ విలీనానికి సంబంధించి ఇటు బిజెపి, అటు బిఆర్ఎస్ మధ్య మాటల యుద్ధాన్ని కట్టిపెట్టి .. ఇందుకు సంబంధించిన వాస్తవాలను మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కె చంద్రశేఖరరావు వెల్లడించి తమ చిత్తశుద్దిని నిరుపించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఈ నెల 19 నుంచి 21 వరకు జరగనున్న సిపిఐ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 19 నుంచి 21 వరకు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో ఘనంగా జరగనున్నాయని కూనంనేని సాంబశివరావు చెప్పారు. మహాసభలు జరిగే ప్రాంతానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, దివంగత 'ఎన్.బాలమల్లేష్ నగర్'గా నామకరణం చేసినట్లు చెప్పారు. అధికార పార్టీతో ఉన్న స్నేహ ధర్మాన్ని పాటిస్తునే ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమిస్తున్నామని కూనంనేని చెప్పారు.

## బొగ్గు గనుల మూసివేత ప్రాంతాల్లో జీవనోపాధి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త :** బొగ్గు గనుల మూసివేత వల్ల ప్రభావితమైన ప్రాంతాలలో జీవనోపాధికి మద్దతు ఇవ్వడం, పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడం, ఆహార భద్రతను బలోపేతం చేయడం లక్ష్యంగా కేంద్రం అనేక కార్యక్రమాలను చేపట్టిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి తెలిపారు. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు గురువారం కేంద్ర మంత్రి సమాధానంగా జనవరి 31, 2024న జారీ చేయబడిన మైనింగ్ ప్లాన్, మూసివేత మార్గదర్శకాల ప్రకారం, గనుల మూసివేత వల్ల ప్రభావితమైన కుటుంబాలకు పునరావాసం మరియు పునరావాస వ్యూహాలపై కేంద్ర ప్రభుత్వం చురుకుగా పనిచేస్తోందన్నారు. న్యాయమైన పరివర్తన ను నొక్కి చెబుతూ, కార్మికులు, సమాజం, పర్యావరణంపై ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. కాగా సభ్యులు అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద యెస్సోనాయక్ జవాబిస్తూ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై నవీకరణలను అందిస్తూ, జూన్ 30, 2024 నాటికి దేశ వ్యాప్తంగా 43,922 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యాన్ని సాధించిందని చెప్పారు. ఇందులో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎన్టీపీసీ, ఇతర ఏజెన్సీల సహకారాలు ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్రం విద్యుత్ అమ్మకపు ఒప్పందాల (పిఎస్ఎ) సంతకాలను వేగవంతం చేసిందని చెప్పారు. అలాగే సౌర మరియు పవన శక్తి మౌలిక సదుపాయాల వృద్ధిని సులభతరం చేయడానికి నవీకరించబడిన బిడ్డింగ్ మార్గదర్శకాలను కూడా జారీ చేసినట్లు వెల్లడించారు.

## జాతీయస్థాయి టి స్కాన్ యూత్ ఓపెన్ రెగట్టా పోటీల్లో బిసి గురుకుల విద్యార్థులకు పతకాలు

### శిరీష రజతం, హనుమంతు కాంస్యం

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త :** జాతీయ స్థాయిలో జరిగిన టి స్కాన్ యూత్ ఓపెన్ రెగట్టా పోటీల్లో బిసి గురుకుల విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారు. యాచ్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ ఓపెన్ రెగట్టా ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ విభాగంలో చాంద్రాయణ గుట్ట గర్ల్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న జె శిరీష వెండి పతకం సాధించగా, మునుగోడు బాయ్స్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న వి హనుమంతు కాంస్య పతకం సాధించాడు. కల్వకుర్తి గర్ల్స్ స్కూల్ లో ఏడవ తరగతి చదువుతున్న ఎం అక్షర జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయి పోటీలో పతకాలు సాధించిన విద్యార్థులను బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్యదర్శి శ్రీధర్, మహాత్మా జ్యోతిబా పూలే బిసి గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు. బిసి గురుకులవిద్యార్థులకు చదువుతో పాటు వారిలోనైపుణ్యాలను, ఆసక్తిని గమనించి అనేక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు బిసి గురుకుల విద్యాసంస్థ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని సొసైటీ సెక్రటరీ సైదులు తెలిపారు. అందులో భాగంగా బిసి గురుకుల విద్యార్థులకు యాచ్ క్లబ్ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్ లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. శిక్షణలో అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇవ్వడంతో పాటు వారు జాతీయ, అంతర్జాతీయపోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు మూడు దఫాలుగా శిక్షణ ఇచ్చామన్నారు. జూలై 1వ తేదీ నుంచి జూలై 20వ తేదీ వరకు మూడో విడత శిక్షణ ఇచ్చామని వారిలో జాతీయ స్థాయిలో ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించడం ఆనందంగా ఉందని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 2026 లో జరిగే ఆసియన్ గేమ్స్, 2028 జరిగే ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. అందుకు అవసరమైన శిక్షణ అందిస్తామని తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సూర్యకిరణ్, ఎంఎల్‌సి దాసోజు శ్రావణ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, రచయిత యష్‌పాల్ తదితరులు

## 6న 'గద్దర్' ద్వితీయ వర్థంతి సభ

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** ప్రజాయుద్ధ నౌక గద్దర్ ద్వితీయ వర్ధంతి సభ ఈ నెల 6న మధ్యాహ్నం 2 గంటల నుంచి హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరుగతుందని గద్దర్‌ఫౌండేషన్ చైర్మన్ సూర్యకిరణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఎంఎల్‌సి దాసోజు శ్రావణ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌లతో పాటు వివిధ ప్రజాసంఘాల నేతలతో కలిసి వర్ధంతి సభ పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షతన జరిగే వర్ధంతి సభలో ప్రజా ప్రతినిధులు, సినీ ప్రముఖులు, మేధావులు, రచయితలు, కళాకారులు పాల్గొని తమ సందేశాన్ని వినిపిస్తారన్నారు. అలాగే వివిధ ప్రజా సంఘాల నేతలు, తెలంగాణ ఉద్యమ కారులు, పాత్రికేయులు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. అలాగే రాజ్యాంగాన్ని కాపాడుకుందాం, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సేనోటు డ్రగ్స్ అనే నాటికలను ప్రదర్శించటం జరుగుతుందని తెలిపారు. అలాగే గద్దర్ రాసిన సాహిత్యంలోంచి సామాజిక ఆర్థిక అసమానతల పై రాసిన పాటల ప్రదర్శన ఉంటుందన్నారు. గద్దర్ సమగ్ర సాహిత్యాన్ని ప్రచురించాలనే లక్ష్యంతో ముందుకు పోతున్న ఫౌండేషన్ రెండో వర్ధంతి సందర్భంగా గద్దర్ రాసిన మా పల్లె, ప్రతి పాటకు ఒక కథ ఉంది పుస్తకాల ఆవిష్కరణ ఉంటుందన్నారు. అలాగే గద్దర్ జీవితాంతం చేసిన కృషి, ఆచరించిన విలువలపై ఆయన స్మృతిలో అనేమంది కవులు, కళాకారులు, రచయితలు రచనలతో రూపు దిద్దుకొన్న గద్దర్ యాదిలో పాలధార పాట పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు సూర్యకిరణ్ పేర్కొన్నారు.

## ఇరాన్‌తో వ్యాపారం చేస్తున్న ఆరు భారత్ కంపెనీలపై అమెరికా వేటు

**వాషింగ్టన్, జూలై 31:** ఇరాన్ తో వ్యాపారం వద్దని తాము చెప్పినా వినకుండా చమురు కొనుగోలు చేస్తున్న కంపెనీలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓపక్క ప్రపంచదేశాలతో ఒప్పందాలపేరిట ముందుగానే సుంకాలు విధించి ఆ తర్వాత రాజీ రాయబేరాలకు రావడం ట్రంప్‌కు ఆనవాయితీగా వస్తోంది. ఇపుడు తమ మాట వినని దేశాలతో వాణిజ్య లావాదేవీలు నిర్వహిస్తున్న విదేశ కంపెనీలపైనా వేటు వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 20 కంపెనీలపై ఆంక్షలు విధించారు. ఈ మేరకు అమెరికా విదేశాంగ శాఖ తాజాగా ప్రకటన విడుదల చేసింది. ఈ జాబితాలో భారత్ కు చెందిన ఆరు కంపెనీలు కూడా ఉన్నాయి.

## నింగికి ఎగసిన 14 సెకన్లలోనే కుప్పకూలిన రాకెట్

**క్వీన్స్‌ల్యాండ్ (ఆస్ట్రేలియా),జూలై 31:** ఆస్ట్రేలియా అంతరిక్ష పరిశోధన రంగంలో కీలక ముందడుగుగా భావించిన తొలి స్వదేశీ ఆర్బిటల్ రాకెట్ ప్రయోగం విఫలం అయింది. గిల్మోర్ స్పేస్ టెక్నాలజీస్ రూపొందించిన 'ఎరిస్' రాకెట్ తన తొలి పరీక్షా ప్రయోగంలో నింగిలోకి ఎగసిన 14 సెకన్లలోనే కుప్పకూలిపోయింది. ఈ ఘటన క్వీన్స్ ల్యాండ్‌లోని బోవెన్ ఆర్బిటల్ స్పేస్‌పోర్ట్‌లో చోటుచేసుకోగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. గిల్మోర్ స్పేస్ టెక్నాలజీస్ రూపొందించిన 'ఎరిస్' రాకెట్ ప్రయోగం విజయవంతంగానే ప్రారంభం అయినట్లు వీడియోలు చూస్తుంటనే తెలుస్తోంది. కాకపోతే భూమి మీద నుంచి పైకి లేచిన కొద్ది క్షణాలకే రాకెట్ వేగం కోల్పోయి, నియంత్రణ తప్పి కుప్ప కూలి పోయింది. దీంతో ప్రయోగ స్థలంలో పెద్ద ఎత్తున మంటలు, తెల్లటి పొగలు భారీగా ఎగసిపడ్డాయి. ఈ అనూహ్య పరిణామం అక్కడున్న వారిని ఒక్కసారిగా షాక్‌కు గురి చేసింది. గిల్మర్ స్పేస్ టెక్నాలజీస్ ఈ రాకెట్ పరీక్షను దేశ అంతరిక్ష సామర్థ్యానికి 'భారీ ముందడుగు'గా అభివర్ణించింది. అయితే తొలి ప్రయత్నం విఫలం అయినప్పటికీ భవిష్యత్తు ప్రయోగాలపై ఆ సంస్థ ఆశాభావం వ్యక్తం చేసింది.

## నిందితులంతా నిర్దోషులే అయితే.. ఆ ఆరుగురిని ఎవరు చంపినట్టు?

### మాలేగావ్ పేలుళ్ల కేసు తీర్పుపై అసదుద్దీన్ ఒవైసి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూలై31:**మాలేగావ్ పేలుళ్ల కేసులో నిందితులంతా నిర్దోషులేనని కోర్టు తీర్పు వెలువరించడంపై ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పందించారు. నిందితులు అందరూ నిర్దోషులే అయితే ఆ ఆరుగురిని ఎవరు చంపినట్టు? అని ప్రశ్నించారు. ఆధారాలు లేవంటూ నిందితులకు క్లీన్ చిట్ ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నమాజ్ చేస్తున్న వారిని మతం పేరుతో టార్గెట్ చేసి దాడి చేశారని ఆయన ఆరోపించారు. బాంబు పేల్చి ఆరుగురిని బలి తీసుకున్నారని, పేలుడు ధాటికి వంద మందికి పైగా గాయపడ్డారని ఎంపీ గుర్తుచేశారు. మతం పేరుతో జరిగిన ఈ దారుణం కోర్టులో నిరూపణ కాలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు అసంతృప్తిని కలిగించిందని వ్యాఖ్యానించారు. ముంబై సబర్బన్ రైలు పేలుళ్ల తీర్పుపై మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయాన్ని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ గుర్తుచేశారు.

## రీసెర్చి, ఇన్నోవేషన్‌పై ఇక్రిశాట్‌తో కావేరీ వర్సిటీ ఒప్పందం

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:**ఇన్నోవేషన్, రీసెర్చ్, స్టూడెంట్ కెపాసిటీ బిల్డింగ్, రూరల్ ట్రాన్స్ ఫర్మేషన్ అంశాలపై రాష్ట్రంలోని కావేరీ యూనివర్సిటీ, ఇక్రిశాట్ మధ్య ఎంవోయూ కుదిరింది. వీటికి సంబంధించిన ఒప్పందాలపై ఇరు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఇక్రిశాట్ డైరెక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ఇక్రిసాట్ దేశంలోనే మొదటిసారి వ్యవసాయ పరిశోధన సంస్థగా ప్రసిద్ధికెక్కినట్లు చెప్పారు. టెక్నాలజీతో కొత్త వంగడాలను సృష్టించి వ్యవసాయ రంగంలో చరిత్ర సృష్టించాలని సూచించారు. విద్యార్థులు క్షేత్రస్థాయిలో పంట పొలాలు సందర్శించి పరిశోధనలపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. తమ సంస్థలో విద్యనభ్యసించిన విద్యార్థులను వ్యవసాయ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతామని చాన్సలర్ భాస్కరరావు, వైస్‌చాన్సలర్ ప్రవీణ్‌రావు తెలిపారు.


## సూచనలు మాత్రమే చేసిన సుప్రీంకోర్టు

### కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ అధికారాలను సుప్రీంకోర్టు ప్రశ్నించలేదని, కేవలం సూచనలు మాత్రమే చేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. సభాహక్కులు కాపాడేది కేవలం స్పీకర్ మాత్రమేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పిందన్నారు.తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందంటూ భారత రాష్ట్ర సమితి నాయకులు తెలివి తక్కువగా మాట్లాడుతున్నారన్నారు. భారత రాష్ట్ర సమితి నాయకులు ముందు సుప్రీంకోర్టు తీర్పును చదవాలి.అధికారంలో ఉన్నప్పుడు పార్టీలను తమ పార్టీలో విలీనం చేసుకున్న చరిత్ర కేసీఆర్‌ది.అధికారంలో ఉన్న పదేళ్లు భారత రాష్ట్ర సమితి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కింది. సీఎల్పీ నేతగా ఒక దళిత నేత ఉంటే సహించలేక కేసీఆర్ కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని విలీనం చేసుకున్నారని గుర్తుచేశారు. కమ్యూనిస్టు పార్టీల అంతం చూడాలని కేసీఆర్ ప్రయత్నించారు. మేం ఆ పార్టీతో పొత్తు పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని బతికించామన్నారు. ప్రతిపక్ష హోదా ఉన్నా అసెంబ్లీకి రాని కేసీఆర్‌పైమేం కోర్టుకు వెళ్లాలా? కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని అద్దంకి దయాకర్ అన్నారు.

## సోలార్ పవర్‌ప్లాంట్లు రెండు నెలల్లో పూర్తి

### సింగరేణి సిఎండి బలరామ్



**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** సింగరేణి చేపట్టిన 122 మెగావాట్ల సోలార్ ప్లాంట్ల నిర్మాణం మరో రెండు నెలల్లో పూర్తి కావాలని ఆ సంస్థ సిఎండి ఎన్ బలరాం స్పష్టం చేశారు. అలాగే జియో థర్మల్, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటుపై ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ టెండర్ పనులు ఖరారైన మరో 137 మెగా వాట్ల సోలార్ ప్లాంట్ల నిర్మాణం వెంటనే ప్రారంభించి ఏడాదిలోగా పూర్తిచేయాలని చెప్పారు. తద్వారా మొత్తం 504 మెగావాట్ల సోలార్ సామర్థం సాధించాలన్నారు.. సోలార్ ప్లాంట్ల నిర్మాణ పనులు నిర్దేశిత సమయంలోపు పూర్తి చేయాలని, లేనట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. రామగుండంలో చేపట్టనున్న గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ ఏర్పాటుకు గల అవకాశాలపై సానుకూల నివేదిక వచ్చిన నేపథ్యంలో, ప్లాంటు నిర్మాణానికి సంబంధించి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్లాంట్ పూర్తయితే రోజుకు 5 టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి అవుతుందని, తద్వారా సింగరేణి సంస్థకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఓపెన్ కాస్ట్ గనుల డంపులపైన పవన విద్యుత్తు కేంద్రాల ఏర్పాటుకు అధ్యయనం త్వరగా పూర్తిచేయాలన్నారు. అలాగే మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గనితో పాటు ఇతర ఓపెన్ కాస్ట్ గనుల్లో పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు గల అవకాశాలపై కూడా అధ్యయనం చేయాలని తెలిపారు. రాజస్థాన్‌లో 1,500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ఇప్పటికే ఒప్పందం కుదిరిన నేపథ్యంలో త్వరలోనే ఒక ఉన్నత స్థాయి అధికారుల బృందం అక్కడికి వెళ్లనున్నదని చెప్పారు.

# సరోగసీ ముసుగులో కొత్త అక్రమాలు వెలుగులోకి

### అమ్మతనం కోసం రూ. లక్షలు సమర్పించాల్సిందే
### సంచలనంగా మారిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ వ్యవహారం
### డా.నమ్రతకు 5 రోజుల పోలీసు కస్టడీకి అనుమతి
### రిమాండ్ రిపోర్టులో వెల్లడైన కీలక విషయాలు



డాక్టర్ నమ్రత

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన యూని వర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అమ్మతనం కోసం వచ్చిన దంపతులకు ఐవిఎఫ్, ఐయూఐ, సరోగసీ తదితర పేర్లతో వారి వద్ద నుంచి రూ. లక్షల్లో ఫీజలు వసూలు చేసి రూ.కోట్లకు పడగలెత్తినట్లు సమాచారం. ఈ మోసాల్లో సహకరించిన వైజాగ్ సృష్టి బ్రాంచ్ మేనేజర్ కల్యాణికి డా.నమ్రత ఖరీదైన విల్లా బహుమతిగా అందజేసినట్లు తెలిసింది. సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సరోగసీ ముసుగులో అక్రమాలకు పాల్పడిన డాక్టర్ నమ్రతను పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించింది. అక్రమ సరోగసీ, శిశు విక్రయాలకు సంబంధించి సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ యజమాని డాక్టర్ అథలూరి నమ్రత, ఆమె కుమారుడు జయంత్‌కృష్ణతో సహా మరికొంత మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సరోగసీ పేరిట శిశు అక్రమ విక్రయాలకు పాల్పడిన డాక్టర్ నమ్రత, జయంత్‌కృష్ణలను కస్టడీకి ఇవ్వాల్సిందిగా పోలీసులు సికింద్రాబాద్ కోర్టును కోరారు. నమ్రత వద్ద సరోగసీ, ఐవిఎఫ్ కోసం వచ్చిన వారి వివరాలు లభ్యమయ్యాయని, మరిన్ని విషయాలు రాబట్టేందుకు వారం రోజులు తమ కస్టడీకి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం గురువారం డాక్టర్ నమ్రతను 5 రోజుల పోలీసు కస్టడీకి అనుమతించింది. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న డాక్టర్ నమ్రతను పోలీసులు శుక్రవారం ఉదయం కస్టడీలోకి తీసుకోనున్నారు. విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు.

**రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు..**

ఈ కేసుకు సంబంధించిన కీలక విషయాలను పోలీసులు రిమాండ్ రిపోర్టులో వెల్లడించారు. సరోగసీ చేయక పోయినా చేసినట్లు నమ్మించి పలువురు దంపతులను మోసం చేశారని, ఈ విషయాన్ని డాక్టర్ నమ్రత అంగీకరించారని పేర్కొన్నారు. రాజస్థాన్ దంపతులను సరోగసీ విషయంలోనూ నమ్రత మోసం చేశారు. వాళ్లు డీఎన్ఏ పరీక్షల నివేదికలు కావాలని అడగడంతో విషయం బయటపడుతుందని తప్పించుకునే ప్రయత్నం చేశారు. కొన్ని రోజుల సమయం ఇస్తే తప్పును సరిదిద్దుతామని వారికి చెప్పారు. వారు వినకపోవడంతో తన కుమారుడితో రాజస్థాన్ దంపతులను బెదిరించారు. సరోగసీ పేరుతో సృష్టి సెంటర్ చాలా మోసాలు చేసింది. ఏపిలో కొంతమంది ఏఎన్ఎంల సహాయం కూడా తీసుకున్నారు. గాంధీ ఆస్పత్రి అనస్థీషియాన డాక్టర్ సదానందం వీరికి పూర్తిస్థాయిలో సహకరించారని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

**అక్రమ సరోగసీలో కీ రోల్ పోషించిన కల్యాణి..**

సృష్టి ఫెర్టిలిటీ కేసులో నిందితురాలు కల్యాణి రిమాండ్ రిపోర్ట్‌లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. అక్రమ సరోగసీ, నవజాత శిశువుల కొనుగోలులో కల్యాణి కీ రోల్ పోషించినట్లు సమాచారం. అక్రమాల ద్వారా వచ్చిన ప్రాఫిట్‌ను కల్యాణికి డాక్టర్ నమ్రత షేర్ చేసినట్లు గుర్తించారు. విశాఖపట్నంలోని సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లో 2012లో ఎఎన్ఎమ్ నర్స్‌గా చేరిన కల్యాణి సేవలను గుర్తించి, 2020లో విశాఖపట్నం బ్రాంచ్‌కు మేనేజర్‌గా డాక్టర్ నమ్రత అపాయింట్ చేసింది. అప్పటి నుంచి సృష్టి ఫెర్టిలిటీలో మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న కల్యాణి.. నమ్రత చెప్పింది చేసినందుకు కల్యాణికి ఖరీదైన విల్లా బహుమతిగా ఇచ్చినట్లు తెలుస్తోంది. విశాఖపట్నంలోని ఓషియన్ వ్యూ అపార్ట్‌మెంట్‌ను వినియోగిం చుకుంటున్న కల్యాణి ఆర్థిక ఇబ్బందుల కారణగా నమ్రత చేసే మోసాలకు సహకరించింది. సృష్టి ఫెర్టిలిటీ లావాదేవీల వ్యవహారాలు మొత్తం కల్యాణి చూసుకున్నట్లు రిమాండ్ రిపోర్టులో తేలింది. ఇక హైదరాబాద్‌కు చెందిన రాజస్థాన్ దంపతులు మొదటిగా కలిసింది కల్యాణినే.. జూన్ 5న మగ బిడ్డకు జన్మనిచ్చిన అసోం మహిళ ఆ శిశువును కల్యాణి రాజస్థాన్ దంపతులకు అప్పగించింది. విశాఖపట్నంలో కల్యాణికి రాజస్థాన్ దంపతులు రూ. 2 లక్షలు అదనంగా చెల్లించారు. అయితే బాబుకు జాండిస్ ఉందని చెప్పి విశాఖపట్నంలోని లోటస్ హాస్పిటల్‌లో జాయిన్ చేయాలని కల్యాణి చెప్పినట్లు సమాచారం. ఇక నిందితులకు బెయిల్ ఇస్తే సాక్షులను తప్పుదోవ పట్టిస్తూ, సాక్ష్యలను తారుమారు చేసే అవకాశం ఉందని రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో 39 మంది సాక్ష్యాలను రిపోర్టులో జోడించారు. కల్యాణి అచ్చయమ్మను ట్రాన్సిట్ ద్వారా వైజాగ్ నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చామని, పోలీసుల తనిఖీల్లో దొరికినా పేషెంట్స్‌కు సంబంధించిన వందల కేసు షీట్స్, రికార్డులు స్వాధీనం చేసుకున్నాం.. నవజాత శిశువులను కొనుగోలుకు సంబంధించిన బ్యాంకు లావాదేవీలను గుర్తించామని పోలీసులు పేర్కొన్నారు.

## రేపటి వరకు దోస్త్ స్పెషల్ ఫేజ్ దరఖాస్తు గడువు

### 3 వరకు వెబ్‌ఆప్షన్లకు అవకాశం
### 6న సీట్ల కేటాయింపు, 8 వరకు కాలేజీల్లో చేరాలి
### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్)-2025 అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా స్పెషల్ ఫేజ్‌లో దరఖాస్తు గడువును పొడిగించారు. స్పెషల్ ఫేజ్ దరఖాస్తు గడువును జూలై 25 నుంచి 31 వరకు అవకాశం కల్పించగా.. దానిని కాస్త ఆగస్టు 2 వరకు పొడిగించినట్టు ఉన్నత విద్యామండలి ఛైర్మన్, దోస్త్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, కళశాల విద్య కమిషనర్ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకొని సీటు రాని వారు.. కొత్తవారితోపాటు ఈ నెల 3 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అవకాశం కల్పించారు. ఇప్పటికే కాలేజీల్లో చేరిన వారు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి అనుమతించ లేదు. స్పెషల్ ఫేజ్‌లో భాగంగా 25 నుంచి 31 వరకు ఉన్న రిజిస్ట్రేషన్‌ని 2 వరకు పొడిగించారు.

ఈ నెల 3 వరకు వెబ్ ఆప్షన్లకి అవకాశమిచ్చారు. ఈ నెల 6న స్పెషల్ ఫేజ్ వారికి సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీటు పొందిన విద్యార్థులు 6 నుంచి 8 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడానికి అవకాశం కల్పించగా.. 6 నుంచి 8 వరకు కాలేజీల్లో చేరాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీలతోపాటు ఎయిడెడ్ కాలేజీల్లో ఉన్న సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల్లో చేరడానికి ఆగస్టు 11, 12 తేదిల్లో స్పాట్ అడ్మిషన్లకి అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. స్పాట్ అడ్మిషన్లు పొందడానికి నోకల్, నాన్ లోకల్ విద్యార్థులు అర్హులని.. అయితే స్పాట్ అడ్మిషన్లలో సీటు పొందిన వారు స్కాలర్‌షిప్ పొందడానికి అర్హులు కాదని వెల్లడించారు.

## జలవనరుల పరంగా పాక్‌కు మరో ఝలక్

### చీనాబ్ నదిపై 22వేల కోట్లతో జలవిద్యుత్ ప్రాజెక్టు!



**శ్రీనగర్, జూలై 31:** పహల్గాంవ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్‌తో ఉన్న సింధునదీజలాలను నిలిపివేసిన కేంద్రం ఇపుడు పాకిస్థాన్‌కు మరో చెక్‌పెడుతోంది. చీనాబ్‌నదిపై గతంలో నిలిపివేసిన సావల్‌కోట్ జలవిద్యుత్‌ప్రాజెక్టును పునఃప్రారంభించాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుకు 22 వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనా. రెండు దశల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిర్ణయించింది. ఇప్పటికే తుల్‌బుల్‌ప్రాజెక్టు పునరుద్ధరణ చర్యలుచేపట్టింది. ఇపుడు సావల్‌కోట్ జల విద్యుత్ ప్రాజెక్టు ప్రతిపాదనలు 1980లోనే ఉన్నప్పటికీ పాకిస్థాన్ అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో బారత్ పక్కనపెట్టాల్సి వచ్చింది. ఇపుడు పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్‌తర్వాత భారత్ చేపట్టిన కీలక ప్రాజెక్టుల పరంగా మళ్లీ సావల్‌కోట్ జలవిద్యుత్‌ప్రాజెక్టును తెరపైకి తెచ్చింది. 1856 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈప్రాజెక్టు నిర్మాణాన్ని రెండుదశల్లోనే పూర్తిచేయాలని ఇందుకు సంబంధించిన అంతర్జాతీయ బిడ్డింగ్‌కు ఉన్న అడ్డంకులను కూడా తొలగించడంతో నేషనల్ హైడ్రోపవర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ టెండర్లు జారీచేసేందుకు సిద్ధం చేసారు. అలాగే పర్యావరణ మంత్రిత్వశాఖనుంచి కూడా అనుమతులు వేగంగా సమకూరాయి. నిజానికి ఈప్రాజెక్టు దశాబ్దంక్రితమే జమ్ముకాశ్మీర్‌ప్రభుత్వం ప్రారంభించింది. 2021లో కేంద్రం జోక్యంచేసుకుని ఎన్‌హెచ్‌పిసిని భాగస్వామిని చేసింది. సింధుజలాల ఒప్పందం ప్రకారం పశ్చిమదిశగా పాకిస్థాన్‌వైపు ప్రవహించే సింధూతోపాటు చీనాబ్, జీలం వంటి ప్రధాన ఉపనదులపై భారత్‌కు పరిమిత అధికారాలున్నాయి. భారీ స్థాయిలోనీరు నిల్వచేసే ఛాన్స్ లేకుండాపోయింది. ఏ ప్రాజెక్టుప్రారంభించాలన్నా పాకిస్తాన్‌కు ముందస్తు నోటీసు ఇవ్వాలి. తాజాగా ఆ ఒప్పందం నిలిచిపోవడంతో ఇపుడు ఎటువంటి అనుమతులు సమాచారం పంచుకోవాల్సిన అవసరం లేదు. అందువల్లనే సావల్‌కోట్‌ప్రాజెక్టును పరుగులుపెట్టించేందుకు కేంద్రం నిర్ణయించింది.

## యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీకి యేడాది పూర్తి

### 507 మంది విద్యార్థులకు శిక్షణ పూర్తి, 416 మందికి ఉద్యోగాల కల్పన
### వచ్చే యేడాది 10వేల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పూర్తిస్థాయి క్యాంపస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 31:** యువతకు ఉపాధి కల్పనకే యంగ్ ఇండియా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే యువతలో అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసి ఉద్యోగాలు కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసింది. స్కిల్ యూనివర్సిటీ స్థాపించి నేటితో ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. యువతకు కాలేజీ చదువులు ముగిసిన వెంటనే ప్రైవేట్ రంగంలో కంపెనీల అవసరాలకు అనుగుణంగా యువతలో స్కిల్స్ లేకపోవడంతో ఉద్యోగాలు రావడం కష్టతరంగా మారింది. ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా యువతలో స్కిల్స్ పెంపొందించేందుకు 57 ఎకరాల విస్తీర్ణంలో యూనివర్సిటీని ప్రభుత్వం నిర్మిస్తున్నది. ప్రైవేట్ రంగంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమలను భాగస్వామ్యం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించింది. రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న 17 ప్రాధాన్య రంగాలు,పరిశ్రమల భవిష్యత్తు అవసరాలకు సరిపడే మానవ వనరులను తయారు చేసేలా కొత్త కోర్సులను ఐటీ పరిశ్రమల శాఖ రూపొందించింది. ఫార్మా,నిర్మాణం,బ్యాంకింగ్,ఫైనాన్స్ సర్వీసెస్,ఈ కామర్స్ లాజిస్టిక్స్, రిటైల్, యానిమేషన్, విజువల్,ఎఫెక్ట్స్,గేమింగ్ తదితరాల్లో విద్యార్థులకు ఏడాది కాలంలో ఇక్కడ శిక్షణ ఇచ్చారని సిఎం కార్యాలయం తెలిపింది. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో బిబిఏ ప్రోగ్రామ్ ప్రారంభించబడింది. ఎఐ ఆధారిత వర్చువల్ యూనివర్సిటీ మరో రెండు నెలల్లో ప్రారంభిస్తారని పేర్కొంది. ఏడాదిగా తాత్కాలిక క్యాంపస్ నుంచి పనిచేస్తున్న యూనివర్సిటీ నుంచి 507 మంది విద్యార్థులు నైపుణ్య శిక్షణ పొందారు. స్కిల్స్ యూనివర్సిటీలో శిక్షణ పొందిన 416 మంది అభ్యర్థులు ఇప్పటికే ఉద్యోగాలు పొందారు. వీటిలో 82శాతం మందికి ఇప్పటికే వివిధ కంపెనీల నుంచి ఆఫర్ లెటర్లు పొందారు. తెలంగాణ ప్రభుత్వం పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసింది. ఆదానీ,రెడ్డి ల్యాబ్స్, మహేంద్ర,ఫ్లిప్‌కార్డ్,జీఎంఆర్,హెచ్ఎస్‌బీ,ఆపోలో వంటి కార్పొరేట్ కంపెనీలు భాగస్వాములుగా ఇందులో ఉంటాయి. ఈ యూనివర్సిటీలో కోర్సు పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి కచ్చితంగా ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. రాష్ట్రంలో ఎక్కువ మందికి నైపుణ్య కోర్సులను అందించేందుకు స్కిల్ యూనివర్సిటీ మరిన్ని ప్రణాళికలు రూపొందిస్తోంది. కేవలం యూనివర్సిటీలో కొందరికి శిక్షణ ఇస్తేనే సరిపోదని,భారీగా విద్యార్థులు ఉండే డిగ్రీ కాలేజీలు కేంద్రంగా నైపుణ్య కోర్సులను అందించాలని భావిస్తోంది. తొలి దశలో యుజిసి స్వయంప్రతిపత్తి హోదా పొందిన ప్రభుత్వ డిగ్రీ కాలేజాల్లో 2నుంచి 6 నెలల కాల వ్యవధి ఉన్న సర్టిఫికేట్,డిప్లొమా కోర్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. సింగపూర్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఐటీఏ)తో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ అగాహన ఒప్పందం కుదుర్చుకుంది. విద్యార్థులు,యువతకు నైపుణ్య శిక్షణను ఇచ్చి ఉద్యోగాలకు అర్హత సాధించే విధంగా తీర్చిదిద్దేందుకు ఒప్పందం చేసుకున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం గత జనవరిలో సింగపూర్ పర్యటన సందర్భంగా ఈ ఎంఓయు కుదిరింది. సింగపూర్ ఐటీఈ టెన్త్ విద్యార్థుల స్థాయి నుంచి చదువు పూర్తి చేసిన యువత వరకు,అలాగే ఆసక్తి ఉన్న ఏ వయస్సు వారికైనా పరిశ్రమలు,ఐటీ సంస్థల సహకారంతో ఉద్యోగానికి సిద్ధమయ్యేలా శిక్షణ ఇస్తుంది. ఈ సంస్థలో ప్రస్తుతం 28వేల మంది శిక్షణ పొందుతున్నారు.ఇదే స్పూర్తితో ఏర్పాటైన స్కిల్ యూనివర్సిటీలో యువతకు సింగపూర్ ఐటీఐతో శిక్షణను ఇప్పించేలా ఒప్పందం కుదుర్చుకోవడం మన యువత నైపుణ్యాభివృద్ధికి మరింత సహకారం లభిస్తుంది. ప్రస్తుతం గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో స్కిల్ యూనివర్సిటీ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ రావడంతో విశ్వవిద్యాలయంలో భాగస్వామ్యం అయ్యేందుకు అనేక పారిశ్రామిక దిగ్గజ కంపెనీలు ఆసక్తి కనబరుస్తున్నాయి. వచ్చే ఏడాది 10వేల మందికి ఉద్యోగాలు కల్పించాలని,యూనివర్సిటీకి ముచ్చెర్లలో పూర్తి స్థాయి క్యాంపస్ అందుబాటులోకి వస్తే, ఏడాదికి 30వేల ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. స్కిల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మహబూబ్‌నగర్ స్కిల్స్ ట్రైనింగ్ ఫర్ ఎంప్లాయిమెంట్ రెడీనెస్ పేరుతో ప్రత్యేక ప్రాజెక్టు అమలుకు ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. ఎంవీఎస్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజ్,జడ్చర్లలోని బిఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్,కొడంగల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లను ఇందుకోసం ఎంపిక చేశారు. ఇక్కడి విద్యార్థులకు మార్కెట్‌లోని పోటిని తట్టుకొని ఉద్యోగ అవకాశాలు చేజిక్కించుకునే విధంగా ఇంగ్లీష్,ఇతర నైపుణ్య అంశాల్లో శిక్షణ ఇస్తారు.

## వంద వివాదం.. కార్మికుడిని బొందపెట్టారు

### పెద్దపల్లి జిల్లాలో ఘటన

**హైదరాబాద్, జూలై 31, ప్రభాతవార్త:** అప్పుగా తీసుకున్న మూడొందల రూపాయాల్లో బకాయిపడిన వందను తిరిగి ఇవ్వాలని అడగడంతో ఇరువురి కార్మికురాల నడుమ వివాదం చెలరేగింది. కోపోద్రిక్తుడైన కార్మికుడు సదరు కార్మికుడిని మద్యం మత్తులో ఇనుపరాడుతో మోది హత్య చేశాడు. ఈ ఘటన బుధవారం రాత్రి పెద్దపల్లి జిల్లా ఎన్టీపీఎస్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎన్టీపీసీ గోదావరిఖని ఎసిపి మడత రమేష్ తెలిపిన వివరాల ప్రకారం..ఎన్టీపీసీ పర్మినెంట్ టౌన్‌షిప్‌లో గృహ నిర్మాణ పనుల్లో పని చేస్తున్న వినోద్ బాబూజీ (44) అనే కార్మికుడు సంఘటనలో మృతి చెందాడని తెలిపారు. మహారాష్ట్ర చంద్రాపూర్‌కు చెందిన వినోద్ బాబుజీతో పాటు మనోజ్ దివాకర్, మరో నలుగురు కార్మికులు కలిసి ఒకే షెడ్డులో ఉంటున్నారు. మనోజ్ దివాకర్ అనే కార్మికుడు తోటి కార్మికునికి 300 రూపాయలు కొద్ది రోజుల క్రితం అప్పు ఇవ్వగా 200 రూపాయలు చెల్లించాడని, మరో 100 రూపాయల కోసం బుధవారం రాత్రి తాగిన మత్తులో వివాదం జరిగింది. వినోద్ బాబూజీ పడుకొని ఉండగా, మనోజ్ దివాకర్ ఇనుప రాడ్‌తో కొట్టడంతో నిద్రలోనే స్పృహ తప్పిపోయాడు. గురువారం తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో తోటి కార్మికుడు లేవకపోవడంతో కార్మికులు వచ్చి చూడగా పడిపోయి ఉండటంతో వెంటనే గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దాడికి పాల్పడిన మనోజ్ దివాకర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఎమ్మెల్యేల అనర్హత- సుప్రీంకోర్టు వ్యాఖ్యలు,ముఖ్యనేతలతో కెసిఆర్ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై31:**తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు కేటీఆర్, హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో బీఆర్ఎస్ ఖీఎక్స్ ఖి వేదికగా స్పందించింది. సత్యమేవ జయతే అంటూ ట్వీట్ చేసింది. తెలంగాణలో ఉప ఎన్నికలు అనివార్యం కానున్నాయని పేర్కొంది.

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు ఎలక్టోరల్ కాలేజీ జాబితా రెడీ!




**న్యూఢిల్లీ, జూలై 31:** జగ్‌దీప్ ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామా తర్వాత ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన ఎలక్టోరల్ కాలేజీ జాబితా ఖరారైనట్టు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. లోక్‌సభ, రాజ్యసభకు ఎన్నికైన సభ్యులతో పాటు నామినేటెడ్ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటుందని తెలిపింది. త్వరలోనే ఎలక్టోరల్ కాలేజీ జాబితా ప్రకటిస్తామని ఎన్నికల సంఘం వెల్లడించింది. నోటిఫి కేషన్ వెలువడిన తేదీ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ఎలక్టోరల్ కాలేజీ జాబితా కొనుగోలుకు అందు బాటులో ఉంటుం దని ఈసీ పేర్కొంది. ఇది త్వరలో ప్రకటించే అవకాశం ఉందని తెలిపింది. ధన్‌ఖడ్ తన పదవీ కాలం ముగియడానికి రెండు సంవత్సరాల కంటే ముందు జూలై 21న ఉపాధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆయన పదవీకాలం 2027 ఆగస్టు 10న ముగియనుంది. వైద్య పరమైన కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపిన లేఖలో ఆయన పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన రోజే ధన్‌ఖడ్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

## రూ. 1.5 కోట్లతో తెలంగాణ స్టేట్ కాన్సులర్ వెయిటింగ్ ఏరియా

### లాంఛనంగా ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై31:** మా ప్రభుత్వం వేసే ప్రతి అడుగు తెలంగాణ ప్రజల కోసమేనని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్ లోని యూఎస్ కాన్సులేట్ జనరల్ కార్యాలయ ప్రాంగణంలో రూ.1.5 కోట్లతో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పోరేషన్(టీజీఐఐసీ) అత్యాధునిక వసతులతో నిర్మించిన 'తెలంగాణ స్టేట్ కాన్సులర్ వెయిటింగ్ ఏరియా'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ లోని యూఎస్ కాన్సులేట్‌కు ప్రతిరోజూ 3వేల మందికిపైగా సందర్శకులు వస్తుంటారు. వేచి చూసేందుకు సరైన సౌకర్యాలు లేక ఇక్కడికొచ్చే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మా దృష్టికొచ్చింది. క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి ఎక్కడెక్కడ ఏం అవసరమో గుర్తించి... అందుకు అనుగుణంగా అత్యాధునిక వసతులతో కూడిన వెయిటింగ్ ఏరియాను అందుబాటులోకి తీసుకొచ్చాం. కేవలం పారిశ్రామిక, సాంకేతిక రంగాలకే పరిమితం కాకుండా, ప్రజల రోజువారీ జీవితాల్లో మార్పు తెచ్చేందుకు మా ప్రభుత్వం తీసుకుంటున్న చొరవకు ఇది నిదర్శనం అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు.

# తెర

## కొత్త నేషనల్ క్రష్



భాగ్యశ్రీ బోర్సే.. ఇప్పుడు కుర్రాళ్ల కొత్త నేషనల్ క్రష్. గతేడాది మాస్ మహారాజా రవితేజ సరసన మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ డిజాస్టర్ అయ్యింది. కానీ అందరి దృష్టిని ఆకర్షించింది ఈ అమ్మడు. చూడచక్కని అందం.. మత్తెక్కించే కళ్లు.. చక్కటి చిరునవ్వుతో కట్టిపడేస్తుంది. ఫస్ట్ మూవీతోనే డిజాస్టర్ అందుకున్న ఈ అమ్మడు.. ఇప్పుడు రెండో సినిమాతో హిట్టుకొట్టింది. తాజాగా ఈ అమ్మడు లేటేస్ట్ ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. తొలి చిత్రంలోనే గ్లామర్ షోతోపాటు అభినయంతో కట్టిపడేసింది ఈ వయ్యారి. కానీ ఫస్ట్ మూవీ డిజాస్టర్ కావడంతో ఆమెకు పెద్దగా హెల్ప్ కాలేదు. అయితే తెలుగులో నెమ్మదిగా ఆఫర్స్ మాత్రం అందుకుంది. ప్రస్తుతం చేతిలో నాలుగైదు సినిమాలతో బిజీగా ఉంది. మిస్టర్ బచ్చన్ తర్వాత ఈ అమ్మడు నటించిన కింగ్డమ్ సినిమా విడుదలైంది. జూలై 31న అడియన్స్ ముందుకు వచ్చిన ఈ సినిమాకు పాజిటివ్ రివ్యూస్ వస్తున్నాయి. అంతేకాదు.. ఈ మూవీ ప్రమోషన్లలో గ్లామర్ లుక్స్‌లో కట్టిపడేసింది భాగ్యశ్రీ. దీంతో ఈ అమ్మడు ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. కొత్త నేషనల్ క్రష్ అదిరిపోయిందంటూ భాగ్యశ్రీ ఫోటోస్ షేర్ చేస్తున్నారు ఫ్యాన్స్. ప్రస్తుతం రామ్ పోతినేని సరసన నటిస్తుంది. అలాగే దుల్కర్ సల్మాన పక్కన కాంత అనే చిత్రంలో నటిస్తుంది. ప్రస్తుతం ఈ బ్యూటీ ఫోటోస్ నెట్టింట ట్రెండ్ అవుతున్నాయి.

## ప్లీజ్ మేమ్..



హీరో నారా రోహిత్ తన మైల్ స్టోన్ 20వ మూవీ సుందరకాండతో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వం వహిస్తున్నారు. సందీప్ పిక్చర్ ప్యాలెస్‌బ్యానర్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మిస్తున్నారు. ఈ మూవీ ప్రమోషనల్ కంటెంట్ స్ట్రాంగ్ బజ్‌ను క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ మేకర్స్ ప్లీజ్ మేమ్ సాంగ్ ని రిలీజ్ చేశారు. ప్లీజ్ మేమ్ సాంగ్ మోడ్రన్ బీట్‌లతో పాటు తెలుగుదనం కూడా మిక్స్ అయి క్యాచీ, క్రేజీగా వుంది. శ్రీహర్ష ఇమాని రాసిన లిరిక్స్ ఫన్ ఫుల్‌గా పాటకి పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యాయి. వీడియోలో హీరో తన ఫ్రెండ్స్‌తో కలిసి శ్రీదేవిని ఇంప్రెస్ చేయడానికి చేసే ప్రయత్నాలు సరదాగా వున్నాయి. అర్జున్ చాందీ, దీపక్ బ్లూ, అరవింద్ శ్రీనివాస్, సాయిశరణ్, రేష్మా శ్యామ్, హరిప్రియా, లవితా లోబో కలిసి పాడిన ఈ పాట అదిరిపోయింది. అందరి వాయిస్ మిక్స్‌తో పాటకి ఎనర్జీ రెట్టింపు అయ్యింది. విశ్వరఘు చేసిన కొరియోగ్రఫీ స్టైలిష్‌గా వుంది. నారా రోహిత్ – శ్రీదేవి విజయ్ కుమార్ కెమిస్ట్రీ బ్యూటీఫుల్‌గా వుంది. ప్లీజ్ మేమ్ పాట సినిమా ఆల్బమ్‌కి ఫ్రెష్ అండ్ ఫన్ టచ్ ఇచ్చి బ్యూటిఫుల్ ట్రాక్‌గా నిలిచింది. ఈ చిత్రంలో వృతి వాఘాని కథానాయికగా నటించారు. గణేష్ చతుర్థి సందర్భంగా ఆగస్టు 27న సినిమా విడుదల కానుంది. ఈ చిత్రానికి ప్రదీప్ ఎం. వర్మ సినిమాటోగ్రఫీ అందించగా, రాజేష్ పెంటకోట ఆర్ట్ డైరెక్టర్‌గా, సందీప్ ఎగ్జిక్యూటివ్ నిర్మాత., తారాగణం: నారా రోహిత్, వృతి వాఘాని, శ్రీదేవి విజయ్ కుమార్, నరేష్ విజయ కృష్ణ, వాసుకి ఆనంద్, సత్య, అజయ్, వీటీవీ గణేష్, అభినవ్ గోమటం, విశ్వంత్, రూప లక్ష్మి, సునైనా, రఘు బాబు.


## యుగానికే ప్రయాణమే



బాలు నాయుడు, ఆశా సుదర్శన్ జంటగా నటించిన సస్పెన్స్ అండ్ మైథలాజికల్ థ్రిల్లర్ మూవీ అరణ్య ధార. కొత్త కంటెంట్‌ను ఆదరించేందుకు తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. అందులోనూ మైథలాజికల్ టచ్ ఉన్న సినిమాలని ఇప్పుడు ప్రేక్షకులు బాగా ఆదరిస్తున్నారు. ఆ నమ్మకంతో సిల్వర్ స్క్రీన్ షాట్స్ బ్యానర్ పై నిర్మాత బాలు నాయుడు అండ్ టీం అరణ్య ధారని రూపొందించారు. దర్శక ద్వయం శివ పచ్చ, బాలు నాయుడు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. కచ్చితంగా అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించే విధంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దినట్టు వెల్లడించారు మేకర్స్. తాజాగా ఖఅరణ్య ధారఖ నుండి ఫస్ట్ సింగిల్‌గా యుగానికే ప్రయాణమే అనే పాటను ప్రముఖ సంగీత దర్శకుడు, సింగర్ అయినటువంటి రఘు కుంచె చేతుల మీదుగా లాంచ్ చేశారు. రవి నిడమర్తి సంగీతంలో రూపొందిన ఈ పాటని అమన్ సిద్ధికి ఆలపించగా బాలు నాయుడు సాహిత్యం సమకూర్చడం మరో విశేషంగా చెప్పుకోవాలి. సాంగ్ లాంచ్ అనంతరం రఘు కుంచె మాట్లాడుతూ యుగానికే.. అనే పాటలో నేచర్‌ని బాగా చూపించారు. అలాగే బాగా షూట్ చేశారు కూడా. వింటున్నప్పుడు చాలా హార్ట్ టచింగ్‌గా అనిపించింది. ఇందులో హీరో ఒక ఫోటోగ్రాఫర్ అని తెలిపారు.

## అయ్యోరామ అప్పుడే ఓటిటికి..

సుహాస్ హీరోగా ఇటీవలే థియేటర్లలోకి వచ్చిన చిత్రం ఓ భామ అయ్యో రామ. ఈ చిత్రంతో మలయాళ బ్యూటీ మాళవిక మనోజ్(జో ఫేమ్) టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా కెరీర్, మదర్ సెంటిమెంట్‌తో కూడిన లవ్‌స్టోరీగా రూపొందిన ఈ సినిమాకు రామ్ గోధల దర్శకత్వం వహించగా హరీష్ నల్ల నిర్మించారు. జూలై 11న ప్రేక్షకుల ఎదుటకు వచ్చిన ఈ చిత్రం మిశ్రమ స్పందనను దక్కించుకుంది. ఇప్పుడీ సినిమా 20 రోజుల్లోనే డిజిటల్ స్ట్రీమింగ్ బాట పట్టింది. రామ్ (సుహాస్) చిన్నతనంలోనే తల్లి (అనిత)ను కోల్పోతాడు. తండ్రి (రవీంద్ర విజయ్) దగ్గరకు తీయక పోవడంతో మేనమామ (అలీ) రామ్ బాధ్యత తీసుకుంటాడు, ఏ లోటు లేకుండా చూసుకుంటాడు. అయితే రామ్ ఎప్పటికైనా సినిమా దర్శకుడు కావాలనేది అతని తల్లి కల. కానీ రామ్ సినిమాలకు దూరంగా చదువుల కోసం ఫారెన్ వెళ్ళాలనుకుంటాడు. సత్యభామ (మాళవిక మనోజ్) రాకతో రామ్ జీవితం మారుతుంది. అమ్మ లేని లోటును తీరుస్తుంది. ఆమె రాక అతనిలో ఎలాంటి మార్పు తెచ్చింది. సినిమాలకు దూరంగా ఉండే రామ్ డైరెక్షన్ వైపు ఎందుకు అడుగులు వేశాడు? రామ్, సత్యభామల ప్రేమ కథ కంచికి చేరిందా లేదా? అన్నది కథ. సింపుల్ కాలేజీ కుర్రాడి కథగా మొదలై ప్రేమ, భావోద్వేగాల వైపు నడుస్తుంది. ఫస్టాఫ్ అంతా రొటీన్ కథగా సాగుతుంది. సెకండాఫ్ నుంచి కథ సీరియస్ ట్రాక్‌లోకి వెళ్తుంది. మేనల్లుడి మీద బాధ్యతగా వ్యవహరించే అలీ పాత్ర ఎమోషన్‌గా సాగడం, సెంటిమెంట్ బాగా వర్కవుట్ అయింది. మదర్ సెంటిమెంట్ టచ్, కొన్ని చోట్ల ఫన్, ఎమోషన్ సీన్లు బాగా వర్కవుట్ అయ్యాయి. రొటీన్‌గా కాకుండా ట్విస్ట్‌తో కథను ముగించిన విధానం ఆకట్టుకుంటుంది.. ఇప్పుడీ సినిమా సడన్‌గా ఈ టీవీ విన్ ఓటీటీలో స్ట్రీమింగ్కు వస్తున్నట్లు మేకర్స్ ప్రకటించి షాక్ ఇచ్చారు. మూవీలో ఎక్కగా అసభ్యకర సన్నివేశాలు లేవు. ఫ్యామిలీ, సెంటిమెంట్ సినిమా చూడాలనుకునే వారు ఈ చిత్రాన్ని తప్పక ప్రయత్నం చేయవచ్చు.



## తెలుగులోనూ యానిమేషన్ మూవీ



యానిమేషన్ ఫీచర్ ఫిల్మ్‌ను రూపొందించడంలో వాల్ట్ డిస్నీ యానిమేటెడ్ స్టూడియోస్‌కి ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఈ సంస్థ తాజాగా తన 64వ యానిమేటెడ్ మూవీని జనం ముందుకు తీసుకురాబోతోంది. అడ్వంచరస్ యానిమేటెడ్ మూవీ జూటోపియా 2ను ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో నవంబర్ 28న విడుదల కాబోతోంది. భారతదేశంలోనూ ఇంగ్లీష్, హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా ఈ మూవీ తెలుగు ట్రైలర్ ను నిర్మాణ సంస్థ విడుదల చేసింది.

## ఊపిరి ఊయలగా.. ఉప్పొంగిన ప్రేమ



బాలీవుడ్‌లో అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతోన్న వార్ 2. ఈ సినిమాలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్.. నువ్వా నేనా అన్నట్లుగా తల పడనున్నారు. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో.. యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మించిన చిత్రాలలో అత్యంత ఖరీదైన సినిమాగా ఇది నిలుస్తుందని పలువురు భావిస్తున్నారు. దాదాపు రూ.400 కోట్లకు పైగా బడ్జెట్‌తో ఈ చిత్రం రూపొం దుతోందని సమాచారం. ఇందులో బాలీవుడ్ అందాల ముద్దుగుమ్మ కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తోంది.

దర్శకుడు అయాన్ ముఖర్జీల తెరకెక్కిస్తోన్న ఈ చిత్రాన్ని ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. 2023 అక్టోబర్‌లో ప్రారంభం అయిన ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఎక్కువగా ముంబైలో ఈ మూవీ షూటింగ్ చేస్తున్నారు. అలాగే స్పెయిన్, అబుదాబి, ఇటలీలో కొన్ని షెడ్యూల్స్ చేశారు. కాగా ఈ సినిమాను డాల్బీ అట్మాస్ సౌండ్‌తో రిలీజ్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, టీజర్లకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా ఇటీవల విడుదలైన ట్రైలర్‌కు విశేష స్పందన వచ్చింది. ఇందులో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ ఊరమాస్ యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. ఇందులో హృతిక్ రోషన్ మేజర్ కబీర్ ధలీవాల్ పాత్రలో.. జూనియర్ ఎన్.టి.ఆర్ వీరేంద్ర రఘునాథ్ పాత్రలో కనిపించనున్నారు. ఇక అన్ని పనులు పూర్తి చేసుకుని ఈ సినిమా ఆగస్టు 14న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ మరో అదిరిపోయే అప్డేట్ అందించారు. తాజాగా ఈ మూవీ నుంచి మరో సాంగ్ ను రిలీజ్ చేశారు. ఊపిరి ఊయలగా అనే రొమాంటిక్ సాంగ్ తాజాగా విడుదలైంది. ఈ సాంగ్ సినిమాపై మరింత అంచనాలను పెంచింది. ఇందులో హృతిక్ రోషన్, అందాల తార కియారా అద్వానీ నటించారు. ఈ పాటలో వారిద్దరి మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా పండింది. పాటలోని లోకేషన్స్ చాలా అందంగా, ఆకట్టుకునేలా ఉన్నాయి. చంద్రబోస్ మనసుకు హత్తుకునే సాహిత్యం అందించాగా.. శ్రావ్యమైన గాత్రాలతో శశ్వంత్ సింగ్, నిఖితా గాంధీ ఆలపించారు.

## నల్లకోడితో.. చేతబడి



క్షుద్ర విద్యలను సైన్స్ కొట్టి పారేస్తుంది. కానీ కొంతమంది మాత్రం దీనిని నమ్ముతూ ఉంటారు. చేతబడి, బాణామతి ద్వారా వ్యక్తులను తమ అధీనంలోకి తెచ్చుకోవచ్చని భావిస్తున్నారు. ఆ నేపథ్యంలోనే రాబోతోంది చేతబడి సినిమా. శ్రీ శారద రమణా క్రియేషన్స్ బ్యానర్‌పై నంద కిషోర్ నిర్మిస్తున్న ఈ సినిమా ద్వారా సూర్యాస్ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. నిజ సంఘటనల ఆధారంగా ఈ సినిమా రూపుదిద్దుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు. కథను గురించి దర్శకుడు సూర్యాస్ మాట్లా డుతూ, చేతబడి అనేది 16వ శతాబ్దంలో మన ఇండియాలో పుట్టింది. రెండు దేశాలు కొట్టుకోవాలన్నా, రెండు దేశాలు కలవాలన్నా .. ఒక బలం, బలగం కావాలి. కానీ ఒక ఈవిల్ ఎనర్జీతో మనిషిని కలవకుండానే చంపే విద్యే చేతబడి! అది ఎంత భయంకరంగా ఉంటుందో ఇప్పటికే చాలా సినిమాల్లో చూపించారు. ఇందులో చాలా భిన్నంగా చూపిస్తున్నాం. మన బాడీలో ప్రతిదానికి ప్రాణం ఉంటుంది. జుట్టుకు కూడా ప్రాణం ఉంటుంది. ఆ వెంట్రుకల మీద ఈ సినిమా ఆధారపడి ఉంది. 1953 గిరిడ అనే గ్రామంలో రియల్‌గా జరిగిన యదార్థ సంఘటనను ఆధారంగా చేసుకుని ఈ కథను సిద్ధం చేశాం. సీలేరు అనే గ్రామంలో 200 సంవత్సరాల క్రితం వెదురు బొంగులు చాలా లావుగా ఉండేవి. వర్షం పడినా అవి నెలలోకి దిగేవి కావు. అలాంటి మట్టిలో బతికున్న నల్లకోడిని పెట్టి అమావాస్య రోజు బాణామతి చేస్తే ఎలా ఉంటుంది? అనేది ఇందులో చూపించబోతున్నాం అని చెప్పారు. నిర్మాత నందకిషోర్ మాట్లాడుతూ, ఒకప్పుడు బాణామతి భయం వల్ల రాజకీయ, సామాజిక, మానసిక సమస్యలు తలెత్తాయి. ప్రజల అమాయకత్వాన్ని కొందరు ఆసరాగా చేసుకుని పబ్బం గడుపుకున్నారు. ఆ సంఘటనలను ఈ సినిమాలో రియలిస్టిక్‌గా చూపించబోతున్నాం అని అన్నారు. ఈ సినిమాకు అచ్చు రాజమణి సంగీతం అందిస్తున్నాడు.

## ఫ్రేం షూటింగ్ షురూ



పవన్ తాత, చమిందా వర్మ జంటగా నటిస్తోన్న నూతన చిత్రం ఫ్రేం. రాజేశ్ రావూరి ఈ చిత్రంతో దర్శకునిగా మారనున్నారు. శివమ్ మీడియా పతాకంపై శ్రీమతి సుజాత సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివమల్లాల నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవానికి ప్రముఖ హీరో సందీప్‌కిషన్ క్లాప్‌నివ్వగా నటులు అలీ, బెనర్జీ, తెలుగు రాష్ట్రాల్లో టాప్ ఆడిటర్‌గా ఉన్న విజయేంద్రరెడ్డి, సినిజోష్ అధినేత రాంబాబు పర్వతనేని దర్శకుడు రాజేశ్‌కి స్క్రిప్ట్‌ని అందించారు. నటులు రాజీవ్ కనకాల కెమెరా స్విఛాన్ చేశారు. చిత్ర ప్రారంభోత్సవం తర్వాత సందీప్ కిషన్ మాట్లాడుతూ.. నా తొలి చిత్రం నుండి ఈ చిత్ర నిర్మాతతో పరిచయం ఉంది. ఆయన తీస్తున్న ఈ చిత్రం మంచి విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అన్నారు. నటుడు అలీ మాట్లాడుతూ ఫ్రేం చిత్ర నిర్మాతలు శివమల్లాల, సుజాతలు నాకు కుటుంబ సభ్యులు.. వారు నిర్మించ తలపెట్టిన ఈ చిత్రం మంచి విజయం సాధించాలని దేవుణ్ని ప్రార్థిస్తున్నా అన్నారు. నటుడు బెనర్జీ మాట్లాడుతూ ఈ సినిమాలో నేను చాలా మంచి పాత్రలో నటిస్తున్నా అన్నారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ ఈ చిత్రంలో చాలా కీలకమైన పాత్ర పోసిస్తున్నాను. ఫ్రేం చిత్ర హీరోయిన్ చమిందా వర్మ నటే కాదు. దుబాయ్ నుండి తెలుగులో నటించటానికి వచ్చిన తెలుగమ్మాయి. ఆమె డాక్టర్ కూడా. ఈ చిత్రంలో నటిస్తున్న పవన్ తాతా, దర్శకుడు రాజేశ్ నాకు ముందునుండి పరిచయం ఉంది. వారిద్దరికి ఎంతో టాలెంట్ ఉంది. ఇప్పుడు నాకు 50 ఏళ్లు. నాకు 25 ఏళ్లున్నప్పటినుండి ఫ్రేం చిత్ర నిర్మాత శివ మల్లాల నాకు తెలుసు. ఈ సినిమా పెద్ద స్థాయిలో విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు. సినిమా ప్రారంభోత్సవంలో దర్శక-రచయిత జనార్థనమహర్షి, నిర్మాత కె.బాబురెడ్డి, తమిళ నిర్మాత జి.సతీష్ కుమార్, ట్రెండింగ్‌లవ్ దర్శకుడు హరీష్ నాగరాజ్, బహిష్కరణ చిత్ర దర్శకుడు ముకేష్ ప్రజాపతి, ప్రముఖ ఇన్ఫ్లుయెన్సర్ బెజవాడ బేబక్క, వనిత, శ్రీవాణి త్రిపురనేని తదితరులు పాల్గొన్నారు.

## నాగవంశీ నమ్మకం నిజమైంది



ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకులంతా ఎంతగానో ఎదురుచూసిన కింగ్‌డమ్ చిత్రం థియేటర్లలో అడుగుపెట్టింది. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించారు. సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే ముఖ్య పాత్రలు పోషించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. ఈ సందర్భంగా కథానాయకుడు విజయ్ దేవరకొండ మాట్లాడుతూ కింగ్‌డమ్ సినిమాకి వస్తున్న స్పందన పట్ల మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది. యూఎస్ ప్రీమియర్ల నుంచే పాజిటివ్ టాక్ వచ్చింది. రాత్రి నుంచి ఫోన్లు వస్తూనే ఉన్నాయి. చాలా మంది ఫోన్ చేసి అన్నా మనం హిట్ కొట్టినం అని ఎమోషనల్ అవుతున్నారు. మీ అందరి ప్రేమ వల్లే ఈ విజయం సాధ్యమైంది. నా తెలుగు ప్రజలు నా వెనుక ఎంత ఉన్నారో నిన్నటి నుంచి చూస్తున్నా. అభిమానులు సినిమా కోసం ఎంతలా మొక్కుకున్నారో, ఎంతలా సెలబ్రేట్ చేస్తున్నారో చూస్తున్నా. ఆ వెంకన్న స్వామి ఆశీస్సులు, మీ ప్రేమ వల్లే ఇదంతా సాధ్యమైంది. ఈ విజయాన్ని ప్రేక్షకుల మధ్యలో సెలబ్రేట్ చేసుకోవాలని ఉంది. తెలుగు ప్రేక్షకులతో పాటు యూఎస్ ఆడియన్స్‌ని కూడా త్వరలో కలుస్తాను. గురువారం విడుదలంటే నేను మొదట భయపడ్డాను. కానీ, నాగవంశీ ఈ సినిమా నమ్మి అదే రోజు విడుదల చేశారు. ఇప్పుడు ఆయన నమ్మకం నిజమైంది. సినిమాకి నా నటనకు ఇన్ని ప్రశంసలు రావడానికి కారణం దర్శకుడు గౌతమ్. టీజర్ కి వాయిస్ ఓవర్ అందించిన ఎన్టీఆర్ అన్నకి, అభిమానులకు, తెలుగు ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు అన్నారు.

నిర్మాత సూర్యదేవర నాగ వంశీ మాట్లాడుతూ. ఒక తెలుగు సినిమాని సాంకేతికంగా హాలీవుడ్ స్థాయిలో తీశాము అన్నారు. నటులు సత్యదేవ్, నటుడు వెంకటేష్ మాట్లాడారు.

## మయసభ

## ఓ అందమైన ఊహా



విలక్షణ దర్శకుడు దేవా కట్టా సారథ్యంలో మయసభ అనే వెబ్ సిరీస్ రూపొందించిన సంగతి తెలిసిందే. ఇందులో ఆది పినిశెట్టి, చైతన్య రావు ప్రధాన పాత్రల్లో నటించారు. సాయి కుమార్, దివ్య దత్తా, నాజర్, రవీంద్ర విజయ్, శత్రు, తాన్య రవిచంద్రన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సిరీస్ దివంగత ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుల నిజ జీవిత పాత్రల ఆధారంగా రూపొందించారనే విషయం టీజర్‌తో స్పష్టమైంది. హిట్ మ్యాన్ అండ్ ప్రూడోస్ ప్రొడక్షన్స్ ఎల్.ఎల్.పి బ్యానర్స్‌పై విజయ్ కృష్ణ లింగమనేని, శ్రీహర్ష ఈ సిరీస్‌ను రూపొందించారు. ఈ సిరీస్‌ను ఆగస్ట్ 7 నుంచి స్ట్రీమింగ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో గురువారం ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ ఈ సిరీస్ అద్భుతాలు సృష్టించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. దేవా కట్టా మాట్లాడుతూ మయసభ అనేది అందమైన ఊహా. ఇద్దరు ప్రాణ స్నేహితుల ప్రయాణమే ఈ కథ. పరిస్థితుల వల్ల వారిద్దరి మధ్య ఏర్పడిన దూరం ఏంటి? అనే కాన్సెప్ట్‌తో తీశాం. ముందుగా మూడు పార్టులుగా సినిమాకు సంబంధించిన కథ రాశాను. అయితే సినిమాగా తీయడం అంటే మామూలు విషయం కాదు. ఆ తరువాత ఇదే కథను ఓ సిరీస్‌లా ఓ సీజన్‌ను రాసుకున్నాను. మయసభ ఇక్కడి వరకు రావడానికి చాలా టైం పట్టింది. ధనీష్‌ను కలిసిన తరువాతే మయసభకు ఈ లుక్ వచ్చింది. ఆగస్ట్ 7 నుంచి వస్తున్న ఈ మయసభ అందరి అందరి ఆస్తిలా మారిపోతోంది అని అన్నారు. సోనీ లివ్ బిజినెస్ హెడ్ ధనీష్ కాంజీ, సోనీ లివ్ కంటెంట్ హెడ్ షోగత్ ముఖర్జీ ఆది పినిశెట్టి, చైతన్య రావ్, నిర్మాతలు శ్రీ హర్ష, విజయ్ కృష్ణ , లింగమనేని చరితా వర్మ, నటి దివ్యా దత్తా, శ్రీకాంత్ అయ్యంగార్, రవీంద్ర విజయ్, కెమెరామెన్ సురేష్ , మ్యూజిక్ డైరెక్టర్ శక్తి కాంత్ కార్తీక్, కో డైరెక్టర్ కిరణ్ మాట్లాడారు.

## అమెజాన్ ప్రైమ్ చేతికి వీరమల్లు

పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అయ్యే అవకాశం ఉందని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నప్పటికీ విమర్శకుల, ప్రేక్షకుల నుంచి భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీంతో కలెక్షన్లపై భారం పడింది. మొదటి రోజు, ప్రీమియర్ షోలతో కలిపి మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. ప్రీమియర్ షోలకు తెలుగు వెర్షన్‌లో రూ.12.75 కోట్లు వచ్చినట్లు సమాచారం.



## వినోదానికి నూతన శిఖరం


హైదరాబాద్‌లో ఉన్న అత్యంత విలాసవంతమైన అనుభవానికి.. వినోదానికి నూతన శిఖరంగా మరో చిరునామా చేరింది... అదే యూకే సినీ ప్లెక్స్. హైదరాబాద్‌లోని నాచారంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ యూకే సినీ ప్లెక్స్‌ను ప్రముఖ నిర్మాతలు దిల్‌రాజు, సునీల్ నారంగ్, భరత్ నారంగ్, శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైంది. ఈసందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ యూకే సినీప్లెక్స్ మల్టీప్లెక్స్ థియేటర్ ఎంతో ఉన్నతంగా ఉంది. సౌండ్ సిస్టమ్, స్క్రీన్, సీట్లు ఎంతో బాగున్నాయి. ఉప్పల్, హబ్సిగూడ, నాచారంలో ఉండేవారికి ఈ మల్టీప్లెక్స్ వినోదాన్ని పంచడంలో సరికొత్త ఎక్స్ పీరియన్స్ ఇస్తుందనటంలో ఎటువంటి సందేహం లేదు. అన్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో పృతికా ఉదయ్, రుషిల్ ఉదయ్‌లతో పాటు రాజకీయ ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. గేరీ సినీప్లెక్స్‌లో విలాసవంతమైన 4 స్క్రీన్‌లున్నాయి. కేవలం సినిమా థియేటర్ మాత్రమే కాదు – ఇది ఓ అనుభూతి. అత్యాధునిక సాంకేతికతతో పాటు, అత్యుత్తమ సౌకర్యాలు కలిగిన ఈ సినీప్లెక్స్ సినిమా ప్రేమికులకు, కుటుంబాలకు ప్రీమియం అనుభవాన్ని అందించేందుకు సిద్ధమైంది. ఇక్కడ అందరూ ఆస్వాదించగల సౌకర్యాలు ఉన్నాయని యాజమాన్యం ప్రకటించింది.

## ప్రేమ ప్రతీకారం



అడివి శేష్ మోస్ట్ అవైటెడ్ మూవీ డకాయిట్ లీడ్ క్యారెక్టర్స్‌ని పరిచయం చేసిన పవర్ గ్లింప్స్ రిలీజ్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ప్రేమ ప్రతీకార కథనం నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి నూతన దర్శకుడు షానియల్ డియో దర్శకత్వం వహించారు. ఈరోజు మేకర్స్ మృణాల్ ఠాకూర్ బర్త్‌డే సందర్భంగా ఆమెను పవర్‌ఫుల్ అండ్ ఇమోషనల్ అవతార్‌లో చూపిస్తూ ఓ ఇంటెన్స్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పోస్టర్‌లో మృణాల్ చేతిలో గన్ పట్టుకొని ఎయిమ్ చేస్తూ కనిపిస్తుంది. ఆమె కళ్ళల్లో ఆక్రోశం, బాధ, ఫైటింగ్ స్పిరిట్ అన్నీ ఒక్కటే టైంలో కనిపిస్తున్నాయి. ముఖంపై చిన్న చిన్న గాయాలు, కన్నీళ్లు ఆమె పాత్రకు ఉన్న ఎమోషనల్ వెయిట్‌ని సూచిస్తున్నాయి. ఈ కథలో జూలియెట్ కేవలం లవ్ ఇంటరెస్ట్ కాదు, రివెంజ్ డ్రామాకి సెంట్రల్ క్యారెక్టర్. మృణాల్ పోషించిన జూలియట్ పాత్ర తెలుగులో ఇప్పటివరకు చూసిన హీరోయిన్ల కంటే వేరే లెవెల్లో ఉంటుంది. ప్రస్తుతం హైదరాబాద్లో ఈ సినిమాకి సంబంధించి లీడ్ యాక్టర్స్ తో కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో వస్తున్న ఈ భారీ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాత. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ అందిస్తున్నారు. డకాయిట్ ఈ క్రిస్మస్ డిసెంబర్ 25 రిలీజ్ కానుంది.

## ఒజి వర్‌ఫుల్ లుక్స్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం ఓజి కోసం ప్రేక్షకులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు సుజిత్ డైరెక్ట్ చేస్తుండగా పూర్తి గ్యాంగ్‌స్టర్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేసేందుకు సిద్ధమవుతోంది. ఇక ఈ సినిమా నుంచి తాజాగా ఓ బ్లాస్టింగ్ అప్డేట్ అయితే మేకర్స్ ఇచ్చారు. ఓజి చిత్రం నుంచి ఫస్ట్ సింగిల్ సాంగ్‌ను ఆగస్టు 2న రిలీజ్ చేస్తున్నట్లు వారు తాజాగా అనౌన్స్ చేశారు. పవన్ పవర్‌ఫుల్ లుక్స్‌తో డిజైన్ చేసిన ఈ అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకులను ఇంప్రెస్ చేస్తోంది. ఇక ఈ సినిమాలోని ఫస్ట్ బ్లాస్ట్ ఎలాంటి విధ్వంసం సృష్టిస్తుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాకు థమన్ సంగీతం మరో మేజర్ అట్రాక్షన్ కానుంది.

# ప్రకృతి సాగు, విత్తనాల ఉత్పత్తితో..



విత్తు మంచిదతే పంట కూడా మంచిదవుతుంద'న్న మాటల్ని పక్కాగా పాటిస్తున్నారు గుంటూరు జిల్లా, తెనాలి మండలం ఎరుకలపూడి గ్రామానికి చెందిన తాడిబోయిన విజయలక్ష్మి. ఈమె ఒకప్పుడు టైలరింగ్ చేసేవారు. ఓ పొదుపు సంఘ అధ్యక్షురాలు. ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు.. వీళ్ల సంఘ సభ్యులకు నిర్వహించిన అవగాహన, క్షేత్ర పరిశీలన తరగతుల తర్వాత ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి 2019 నుంచి వ్యవసాయంలోకి దిగారు. తమకున్న ఎకరాకుతోడు మరో రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని ప్రధాన పంటలుగా వరి, మొక్కజొన్న పండిస్తూ, చేను గట్లపైన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పూల సాగును ప్రారంభించారు. రసాయనాలు లేని పంటలకు ఆదరణ పెరిగిన నరకమంలో పొలం గట్టును 4 అడుగుల నుంచి 10 అడుగులకు పెంచుకుని డ్రాగన్ ఫ్రూట్, అవకాడో వంటి పండ్లకు లవంగాలు, చెక్క, యాలకులు వంటి సుగంధ ద్రవ్యాలను జోడించి మొత్తం మీద 92 రకాల ఉత్పత్తుల సాగుని దఫాల వారీగా చేపట్టారు. రెండు సంవత్సరాల నుంచి ప్రతి పంటలోనూ కొంత భాగం విత్తనాలకు తీస్తూ వస్తున్నారు. అలా 22 రకాల విత్తనాలను తాను వినియోగించుకోవడంతోపాటు ఇతర రైతులకూ అందిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు విజయలక్ష్మి చేస్తున్న ప్రకృతి సాగు, విత్తనాల ఉత్పత్తి తీరును పరిశీలించి ఆమెను అభినందించారు. ❑

## సాగు, డాక్యుమెంటరీలతో..



రైతులు ఎవరూ వితనతనాలను బయట కొనరు. బేగరి లక్ష్మమ్మ 'సీడ్ బ్యాంక్' ఉండగా వాళ్లకా అవసరం లేదు మరి. 1990ల్లోనే డెక్కన్ డెవలప్ మెంట్ సొసైటీ సాయంతో 'సీడ్ బ్యాంక్'ను ప్రారంభించారు. ఏళ్లుగా డిడిఎస్‌లో కమ్యూనిటీ వీడియోగ్రాఫర్‌గానూ పనిచేస్తున్నారు. అప్పట్లో ఆడవాళ్లు కెమెరా పట్టుకోవటమంటే ఓ సాహసం. కానీ, లక్ష్మమ్మ ఆ ధైర్యం చేశారు. మహిళా రైతుల కష్టాలు, సాగు పద్ధతులు.. వంటివన్నీ తన కెమెరాలో రికార్డ్ చేస్తూ వారి జీవితాలను ప్రపంచానికి తెలియజేస్తున్నారు. 300లకు పైగా డాక్యుమెంటరీలను రూపొందించిన లక్ష్మమ్మ.. కెనడా, థాయ్‌లాండ్, జర్మనీల్లో జరిగిన ఫీల్మ్ ఫెస్టివల్స్‌కి వెళ్లే దక్కించుకున్నారు.

# తల్లిపాలు శిశువుకు అమృత తుల్యం



**తల్లిపాల వల్ల కల్గే ప్రయోజనాలపై అవగాహన కల్గించాలని మనం ప్రతి సంవత్సరం ఆగస్టు 1-7వరకు 120 దేశల్లో అంతర్జాతీయ వారోత్సవాలు జరుపుకుంటారు. అవగాహన రాహిత్యం వల్ల చాలామంది తల్లులు తల్లి పాల ప్రాముఖ్యతను గుర్తించలేకపోతున్నారు. దీనికి కుటుంబ సభ్యుల సహకారం, డాక్టర్ల సలహాలు, నర్సింగ్ కేర్ అవసరం. గర్భధారణ, ప్రసవ సమయంలో ఎదురయ్యే సమస్యలు రాకుండా ముందే ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల, బ్రెస్ట్ ఫీడింగ్‌పైన ఉన్న అపోహల్ని దూరం చేయడమే ఈ రోజు ముఖ్య ఉద్దేశ్యం.**

సగానికి పైగా తల్లులు పిల్లలకి సరిగా పాలివ్వ లేకపోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 37% శిశువులే ఆరు నెలల వరకు పాలు త్రాగుతున్నారని అంచనా. డబ్ల్యుహెచ్ఓ ప్రకారం ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి.అమెరికాలోని పిడియాట్రిక్స్ అకాడమీ, అమెరికన్ కాలేజ్ ఆఫ్ అబ్స్‌టెన్‌ట్రిషియన్స్ అండ్ గైనకాలజిస్ట్స్ సంవత్సరం వరకు వీలైతే 2 సంవత్సరాల వరకు పాలు ఇవ్వడం వల్ల ఆనందకరమైన అనుభూతి తల్లి బిడ్డల మధ్య పెరిగి సెక్యూరిటీ ఫీలింగ్ కల్గుతుందని తెల్పారు. తల్లిపాలను సరిగా ఇవ్వగలిగితే ప్రతి సంవత్సరం 8-10 లక్షల మంది పిల్లల్ని 5 సంవత్సరాల లోపు స్త్రీలలో రొమ్ము కేన్సర్‌తో బాధపడే 20 వేల మందిని మరణించకుండా కాపాడవచ్చు. తల్లి పాలలో బిడ్డ ఎదుగుదలకు అవసరమైన, తేలికగా జీర్ణమయ్యే పోషకాలుండి వారి శారీరక, మానసిక అవసరాలకు తగినట్లుగా మారుతూ ఉంటుంది. బిడ్డకు అవసరమైన తొలి పోషణ, రక్షణ ఇవ్వాల్సిన తల్లి బాధ్యతని గుర్తు చేయడమే అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల ముఖ్య ఉద్దేశం. ఇది సహజంగా జరిగే ప్రక్రియ కాని కొందరిలో కొన్ని సమస్యలు ఎదురవుతాయి. తల్లి బిడ్డకు పాలిచ్చే ప్రక్రియ 1-7 రోజులు పట్టవచ్చు. కంగారు పడనక్కరలేదు. తల్లిలోని ఆక్సిటోసిన్ హార్మోన్స్ వల్ల క్షీర గ్రంథుల్లోని డక్ట్స్ తెరుచుకోవడం వల్ల ప్రొలాక్టిన్ హార్మోన్ వల్ల ప్రతి ఒక్కరిలో పాలు పడతాయి. అందుకే ప్రసవానికి 3 నెలల ముందే పుట్టబోయే శిశువుకు ఏ విధంగా, ఎన్నిసార్లు, ఎలా పాలు పట్టాలి?ఎన్ని సార్లు మల, మూత్ర విసర్జన చేస్తారు? ఎక్కువ సేపు నిద్రపోవడం, ఎలా త్రాగాలో శిశువుకు తెలియకపోవడం, ఎంతసేపు వీలైతే అంతసేపు స్టిములేషన్ ఇవ్వడం వంటి అనేక సమస్యల్ని ఎలా ఎదుర్కోవాలి అని కౌన్సిలింగ్ తీసుకోవడం అన్ని విధాలా మంచిది. బ్రెస్ట్ ఫీడింగ్ టెక్నిక్స్‌ని ఓర్పు, నేర్పుతో తెలుసు కోవడం చాలా అవసరం. దీని వల్ల తల్లి బిడ్డ అనుబంధం బాగుంటుంది. నార్మల్ డెలివరీ అయిన అరగంట గంట లోపు, సిజెరియన్ అయిన 4 గంటలు లోపు వీలైనంత త్వరగా బిడ్డకు తల్లిపాలని ఇవ్వడం ప్రారంభించాలి. చాలా మందిలో పుట్టిన వెంటనే కొన్ని చుక్కల నుండి 10మి.లీ పసుపుపచ్చవి ముర్రుపాలు పడతాయి. వీటిలో శిశువుకు కావలసిన ఇమ్యూనిటీని పెంపొందించే ఆంటిబాడీస్ ఉంటాయి. కాన్పు అయిన 2 నుంచి 4 రోజులకి 300-400 మి.లీ. 5వ రోజు నుంచి 500-800 మి.లీ పాలు ఉత్పత్తి అయి వేగంగా పెరిగే బిడ్డ శరీర అవసరాలకు తగినట్లుగా ఉండి శక్తిని అందిస్తాయి. వీటిలో లాక్టోజ్, క్రొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. 5-14వ రోజు వరకు వచ్చే పాలను ట్రాన్సిషనల్ మిల్క్ అంటారు. కాన్పు అయిన 4 వారాల తర్వాత వచ్చే పాలలో 90% నీరు, పిండి పదార్థాలు, విటమిన్స్, మినరల్స్ 2% ప్రోటీన్స్, 8% క్రొవ్వులు, షుగర్స్, ఎంజైమ్స్, హార్మోన్స్, గ్రోత్ ఫ్యాక్టర్స్ ఉండి బిడ్డ సంపూర్ణ ఎదుగుదలకు సాయం చేస్తాయి. చాలా మంది తల్లులు తమ పిల్లలకు సరిపోయేన్ని పాలు ఇవ్వలేకపోతున్నాయని మధన పడిపోతుంటారు. కారణం అనారోగ్య సమస్యలు, ఒత్తిడి, బాడీ డీ హైడ్రేషన్, ప్రసవం తర్వాత ఎక్కువగా నిద్రపోవడం సరైన ఆహారం తీసుకోక పోవడం, పథ్యం ఉండడం కారణం. తల్లిపాలు పడడానికి మాత్రలు, మందులు మింగడం కంటే ఆరోగ్యకరమైన సమతుల్య ఆహారం తీసుకుంటే చాలు. తల్లిపాలు సమృద్ధిగా పడతాయి. ఒక రొటీన్‌లో పడేంత వరకు ప్రయత్న లోపం లేకుండా నర్సింగ్ డిమాండ్‌ని బట్టి రోజుకి 8-10 సార్లు తల్లిపాలు ఇవ్వవచ్చు. తల్లి పాలు తాజాయైన సమతుల్య ఆహారం తలిపాలు శిశువుకి సురక్షితం. తల్లిపాల ఉత్పత్తి సరఫరా ప్రక్రియను ఇంగ్లీష్‌లో టైలర్ మేడ్ అంటారు.

ప్రకృతి సిద్ధమైన పాలని నవజాత శిశువులకు ఎప్పుడు ఏది అవసరమో అది తల్లుల ద్వారా అందించడం చాలా అవసరం. ఇలా చాలా అంశాలపై అవగాహన కల్పించటానికే తల్లి పాల వారోత్సవాల్ని వారం రోజులు (మొదటి వారం చాలా ముఖ్య' ఆరోగ్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, మహిళ సంఘులు కలిసికట్టుగా ప్రపంచవ్యాప్తంగా చేయడయే దీని ముఖ్య ఉద్దేశ్యం. మనం కూడా మన వంతు సాయంగా స్త్రీలలోనే అందరిలో అవగాహన కల్పిద్దాం.




- డాక్టర్ కె.ఉమాదేవి

# అంజీర్ తింటున్నారా?

**బలహీనంగా ఉన్నవారు అంజీర్ తింటే కొన్ని రోజుల్లోనే ఆశించిన మార్పు వస్తుంది అంటారు డాక్టర్లు. ఎందుకంటే..** అంజీర్‌లో పీచు, ఎ,బి,సి,ఇ,కె విటమిన్లు, సోడియం, పొటాషియం, మెగ్నీసియం, మాంగనీస్, కాల్షియం, జింక్, ఫోలేట్, రిబోఫ్లేవిన్, భాస్వరం విస్తారంగా ఉన్నాయి మరి. అంజీర్ రక్తపోటును అదుపులో ఉంచుతుంది.



కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రించి, గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఊపిరితిత్తుల్లో సమస్యలు, శ్వాసలో ఇబ్బందులను తొలగిస్తుంది. ఎముకలు, దంతాలను దృఢంగా ఉంచుతుంది. ఫైల్ నుంచి ఉపశమనం కలిగిస్తుంది. నిద్రలేమిని దూరం చేస్తుంది. జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. చర్మానికి కాంతి వస్తుంది, ముడతలు పడదు. అల్జీమర్స్‌తో బాధపడేవారు వీటిని క్రమం తప్పకుండా తినడం వల్ల ప్రయోజనం ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.వీటిని అలాగే తినొచ్చు. మిల్క్ షేక్, హల్వా లాంటివీ చేసుకోవచ్చు. అంజీర్‌ను ముందు రోజు రాత్రి నీళ్లలో నానబెట్టి, మర్నాడు పరగడుపున ఆ నీళ్లు పారబోసి తింటే చాలా మంచిది. రోజుకు రెండు లేదా మూడు వరకూ తినొచ్చు. వీటితో ఆకలి తీరి, శక్తిన కలుగుతుంది కనుక ఇంకా తినాలనే ఆరాటం ఉండదు. దాంతో ఊబకాయం నుంచి తప్పించుకున్నట్లవుతుంది. ఇన్ని లాభాలు ఉన్నప్పటికీ మధుమేహంతో బాధపడుతున్న వారు, అలర్జీ సమస్య ఉన్నవారు అంజీర్ తినకపోవడమే మంచిది. ❑

# మొక్కజొన్న ఉప్మా

**చిటపట చినుకులు పడుతుంటే.. వేడి వేడిగా, కారం కారంగా ఏదైనా తినాలపిస్తుంది కదూ! మొక్కజొన్న కండెలు కాల్చుకుని, కాస్త ఉప్పు, నిమ్మరసం అద్ది తినాలనిపించ డం కూడా సహజమే! అనేక పోషకాలున్న మొక్కజొన్నను ఏదో రూపంలో తినమని నిపుణులు కూడా చెబుతున్నారు. కాబట్టి కొంచెం ఉప్మా చేసుకుందామా... వీటితో ఉప్మా ఏమిటని ఆశ్చర్యపోతున్నారా? చాలా రుచిగా ఉంటుంది... ఎలా చేయాలో చూడండి.**

**కావలసినవి.** లేత మొక్కజొన్న కండెలు 4 ఉల్లిపాయ 1, పచ్చిమిరపకాయలు రెండు, నూనె 3 చెంచాలు, ఆవాలు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర అరచెంచా చొప్పున, ఎండుమిర్చి1. కరివేపాకు రెండు రెబ్బలు, కొత్తిమీర గుప్పెడు, ఉప్పు రుచికి సరిపోతుంది

**తయారీ:** ఉల్లి, పచ్చిమిర్చిలను తరిగి ఉంచాలి. మొక్కజొన్న కండెలను కార్న్ కట్టర్తో లేదా చేత్తో గింజలు ఒలుచుకోండి. అవి సుమారుగా రెండు కప్పులు అవుతాయి వాటిని మిక్సీ జార్లో వేసి నీళ్ల పోయకుండా పల్స్ బటన్ ప్రెస్ చేసి రెండుసార్లు తిప్పుకోవాలి. ఎక్కువగా తిప్పితే పిండిలా అయిపోతుంది. కొంచెం గింజలు నలిగితే చాలు అప్పుడు రవ్వలా ఉంటుంది.



గింజలు మరీ లేతగా ఉంటే కొంచెం ముద్దగా అవుతుంది. మరేమీ పర్వాలేదు కడాయిలో నూనె వేడిచేసి ఆవాలు, పచ్చి శనగపప్పు, మినప్పప్పు, జీలకర్ర, కరివేపాకు, ఎండు మిర్చిలతో తాలింపు వేయాలి. అవి వేగాక.. నిలువుగా కోసిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చి మిరపకాయ ముక్కలు వేయాలి. అవి కాస్త రంగు మారాక మొక్కజొన్న రవ్వ, ఉప్పు వేసి కలిపి, మూత పెట్టేసి సన్నని సెగ మీద కాసేపు మగ్గనివ్వాలి. ఐదు నిమిషాల తర్వాత ఒకసారి మొత్తం కలిపి కొత్తిమీర వేసి మళ్ళీ మూత పెట్టాలి. మెత్తగా ఊడిందను కున్నాక దంచితే.. పోషకాల మొక్క జొన్న ఉప్మా రెడీ! ఇదెంతో ప్రత్యేకంగా ఉంటుంది. ఒకసారి చేసి చూడండి. ❑

# అతి నిద్రతో బాధపడుతున్నారా?

**నిద్ర పట్టక కొంతమంది బాధపడితే, మరికొందరు అతి నిద్రతో సతమతమవుతుంటారు. అయితే నిద్ర తక్కువైనా, ఎక్కువైనా ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో వయసును బట్టి ఎవరికి ఎన్ని గంటలు నిద్ర అవసరమో, ఒకవేళ అతి నిద్ర సమస్యతో బాదపడుతు న్నట్లయితే దానికి అధిగమించడమెలాగో తెలుసుకుందాం..**



**ఎవరికి ఎన్ని గంటలు ....** వయసును బట్టి నిద్ర సమయాలు తెలుసుకుంటే అతి నిద్రకు అడ్డుకట్ట వేయచ్చంటున్నారు నిపుణులు. తద్వారా ఎన్నో అనారోగ్యాలకు దూరంగా ఉండచ్చంటున్నారు. కొన్ని పరిశోధనలు ప్రకారం ఎవరికి ఎన్ని గంటలు నిద్ర అవసరమంటే..

**అప్పడే పుట్టిన పిల్లలు:** 14-17 గంటలు. ఏడాది లోపు చిన్నారులు : 1215 గంటలు, 1-2 ఏళ్ల వయసున్న వారు : 11-14 గంటలు, 3-5 ఏళ్ల వయసున్న వారు: 10-13 గంటలు. స్కూలు కెళ్లే పిల్లలు (6-12 ఏళ్లు ) 9-11 గంటలు, టీనేజర్లు (13-19 ఏళ్లు) 8-10 గంటలు, పెద్దలు: 7-9 గంటలు. వృద్ధులు : 7-8 గంటలు.



**ఇలా చెక్ పెట్టచ్చు...** ఈ క్రమంలో ఒకవేళ అతి నిద్ర సమస్యతో బాదపడుతున్నట్లయితే రోజువారీ జీవనశైలిలో కొన్ని మార్పులు చేసుకోవడం అత్యవసరం అంటున్నారు నిపుణులు.

*. రోజూ ఒకే తరహా నిద్ర సమయాల్ని పాటించాలి. అంటే. వారాంతాలు సెలవు రోజుల్లో కూడా నిర్ణీత వేళ్లకే నిద్ర లేవాలన్న మాట!

*. కొంతమందికి రాత్రుళ్లు సరిగ్గా నిద్ర పట్టక ఉదయం ఆలస్యంగా లేస్తుంటారు. అలాంటి వాళ్ల నిద్రకు ఉపక్రమించేలా పడకగదిలో ప్రశాంతమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసుకోవాలి. అలాగే నిద్రా భంగంచేసే ఎలక్ట్రానిక్ పరికరాలను దూరం పెట్టాలి.

*. కెఫీన్‌కు నిద్రను భంగం చేసే లక్షణముంది. కాబట్టి కాఫీ, టీ వంటివి పడుకునే ముందు అస్సలు తాగకూడదు.

*. మధ్యాహ్నం ఎక్కువసేపు పడుకోవడం వల్ల కూడా రాత్రుళ్లు నిద్ర పట్టదు. తద్వారా గంటల తరబడి నిద్రపోవడానికి శరీరం అలవాటు పడుతుంది. కాబట్టి పగలు అరగంటకు మించి కునుకు తీయకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు.



* వ్యాయామాలవల్ల ఆరోగ్యమే కాదు. నిద్ర సమయాలు కూడా అదుపులో ఉంటాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో శరీరం అలసిపోయి తద్వారా నిద్రలేమిని కూడా అధిగమించచ్చు.

* అలాగే ఆహారంలోనూ పలు మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. సుఖ నిద్రను ప్రేరేపించే పాలు, పాల పదార్థాలు, బాదం, కివీ పండ్లు, చామొమైల్ టీ. వంటివి తరచూ తీసుకోవడం మంచిది. వీటితో పాటు మానసిక ఆందోళనలు, ఒత్తిళ్లను దూరం పెట్టడమూ ముఖ్యమే! అయితే ఇన్ని చేసినా అతి నిద్రను దూరం చేసుకోలేకపోయినా, ఇతర అనారోగ్యాలు వేధిస్తున్నా.. వెంటనే సంబంధిత నిపుణుల్ని సంప్రదిస్తే సమస్య తీవ్రం కాకుండా జాగ్రత్తపడచ్చు. ❑

# పిల్లలకు ఈ నైపుణ్యాలున్నాయా!

**పిల్లల ను తల్లి తన స్నేహితులు, బంధువులింటికి తీసుకెళుతుంటుంది. ఇంట్లో సాధారణంగానే ఉండే తను, తీరా బయటకెక్కడికెళ్లినా ఎక్కువగా మాట్లాడటం లేదా అక్కడ తన అల్లరితో వస్తువులన్నీ చిందరవందర చేస్తుంటాడు. ఇంట్లో మాత్రమే కాదు. బయట కూడా ప్రవర్తనా నైపుణ్యాలను పిల్లలకు అలవడేలా చేయాలంటున్నారు నిపుణులు.**

✦ పిల్లలని ఎక్కువగా గ్రూపు యాక్టివిటీస్‌లో పాల్గొనేలా చేయాలి. చదువుకు భంగం కలుగుతుందంటూ పిల్లలను ఇంట్లోనే బంధించకూడదు. తోటివారితో కలిసే పిల్లల్లో సామాజికపరమైన నైపుణ్యాలు పెరుగుతాయంటోంది అబ్‌నార్మల్ చైల్డ్ సైకాలజీ జర్నల్‌లో ప్రచురించిన ఓ అధ్యయనం వారాంతాల్లో జరిగే యాక్టివిటీస్‌లో క్రమం తప్పకుండా పిల్లలు ఉండేలా చేయాలి.



✦ తోటి పిల్లలతో క్రికెట్, సైక్లింగ్, రన్నింగ్, గాలి పటాలు ఎగుర వేయ డం వంటివి ఆడిన ప్పుడు క్రమ శిక్షణ మాత్రమే కాదు, అందరితో కలిసి ఉన్న ప్పుడు సమయ పాలన, సమయ స్ఫూర్తి పిల్లలు నేర్చుకుం టారు. గుంపులో తనూ ఒకరు కావ డమే కాదు, వారం దరినీ తనతో కలుపు కోవడం వల్ల కలిగే సంతృప్తి అంటే ఏంటో అర్థం చేసు కుంటారు. ఇదే వారికి ఎక్కడ, ఎవరితో ఎలా ప్రవర్తిం చాలో నేర్పు తుంది.

✦. స్కూల్ లేదా మైదానంలో కొత్తగా కలిసినవారితో తమని తాము పరిచయం చేసుకోవడం, వారితో కలిసి చదవడం లేదా ఆడుకోవ డమెలాగో చెప్పాలి. పేరెంట్ మీటింగ్స్‌లో అందరితో పరిచయాలు చేసుకోవడం, చేయి కలిపి ఎదుటివారితో నవ్వుతూ మాట్లాడటం వంటివి పెద్దవాళ్లు చేస్తే, వారి నుంచి పిల్లలూ నేర్చుకుంటారు. మంచి స్నేహితులను సంపాదించుకోవడానికి ఇది దోహదపడుతుంది.

✦ ఆటలో గెలిచినవారిని ప్రశంసించడం, తాము ఓడిపోయినా తిరిగి ప్రయత్నించొచ్చనే సాను కూలతను పిల్లలకు చిన్నప్పటి నుంచే నేర్పించాలి. దీంతో గెలుపొందిన వారిపై ద్వేషం, అసూయవంటివి ప్రదర్శించరు. అలాగే ఇతరులు చెప్పేది పూర్తిగా వినడం పిల్లలకు పేర్పించాలంటే ముందు వాళ్లు చెప్పేది తల్లిదండ్రులు శ్రద్ధగా వినాలి. అప్పుడే పిల్లలు కూడా ఆ నైపుణ్యాన్ని అలవరుచ ుకుంటారు.

✦ పుట్టినరోజు వంటి సందర్భాల్లో స్నేహితులందరినీ పిలవడం నేర్పాలి. ఆ పార్టీలో ఇంటికొచ్చినవారితో ఎలా మెలగాలో తెలుసుకుంటారు. ఇతరుల పట్ల మర్యాదపూర్వకమైన ప్రవర్తన, ప్లీజ్, సారీ వంటి పదాల వినియోగం అలవడుతుంది. ఇలాంటి సత్ప్రవర్తన వారికి భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది.జీవితంలో అనుకునన లక్ష్యాలను చేరుకొనేలా చేస్తుంది. ❑

# పద్మమే ఎందుకు?

ఆధ్యాత్మికం

పూలు లేకుండా ఏ పూజా పూర్తి కాదు. అందులోనూ శ్రావణ శుక్రవారం నాడు ఎంతో భక్తితో చేసుకునే పూజలో చామంతులూ మందారాలూ గులాబీలూ..ఇలా ఎన్నో రకాలు ఉంటాయి. వాటిల్లో తామరలూ తప్పనిసరిగా కనిపిస్తాయి. బంతిపూల దండలూ, మామిడాకుల తోరణాలూ, బ్యాక్‌డ్రప్ అలంకరణలూ.. ఇలా ఎన్ని ఉన్నా అరవిరిసిన పద్మాలు ఉంటేనే ఆ వరలక్ష్మీదేవి శోభాయమానంగా కనిపిస్తుంది. సిరులు కురిపించే ఆ శ్రీమహాలక్ష్మి పుట్టింది ఈ తామరపువ్వులోనే, అందుకే ఆమెకు ఈ పూలంటే ఎంతో ఇష్టమట. అంతేకాదు, ఈ పుష్పాలను సంతాన సామర్థ్యానికీ, అంతులేని సంపదకీ ప్రతిబింబగానూ భావిస్తారు. ముఖ్యంగా తామరపువ్వు.. ఆధ్యాత్మికతను ప్రబోధిస్తుంది. అంతర్గత శక్తి, ప్రశాంతత, స్వచ్ఛతలని సూచిస్తుంది. బురదలో పుట్టినా అందమైన పద్మంగా వికసించి..తన చుట్టూ ఉన్న భౌతిక ప్రపంచంమీద విజయాన్ని సాధిస్తుంది. దీని ద్వారా భవబంధాలకు అతీతంగా అసలైన ఆనందానికి మూలమైన జ్ఞానాన్ని పెంపొందించు కోవాలి. అన్న విషయాన్ని చెప్పకనే చెబుతోంది.



ఆ కారణంతోనే ఈ పవిత్ర పుష్పాలతో ఆ మహాలక్ష్మిని కొలుస్తారు. ❑

# వ్యాపారమా.. ఉద్యోగమా?



**ఉద్యోగం, వ్యాపారం ఒకేసారి చేయడం లాభం,** సురక్షితం అని మీకు అనిపించవచ్చు. కానీ, దానివల్ల ఒక్కోసారి మానసికంగా, శారీరకంగా, ఆర్థికంగానూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావొచ్చు. ఇలా రెండు పనులు ఒకేసారి చేసేకంటే ఏదో ఒక దానిమీదనే సమయం వెచ్చించడం మంచిది. ఒకవేళ మీరు వ్యాపారంలోనే కొనసాగాలి అనుకుంటే ముందుగా కొన్ని విషయాలు ఆలోచించుకోండి. మీ వ్యాపారం పట్ల మీకు ఎంత పాషన్ ఉంది? అందులో వచ్చే లాభనష్టాలను భరించగలరా? క్లిష్టపరిస్థితుల్లో గైడ్ చేయడానికి మెంటార్లు ఉన్నారా? మార్కెటింగ్, ఫైనాన్స్ వంటి విషయాలపై మీకు ఎంత పరిజ్ఞానం ఉంది? కొత్తగా ఎంత వరకూ నేర్చుకోగలరు? కుటుంబ మద్దతు ఎంతవరకూ ఉండొచ్చు? లాంటివీ ఆలోచించుకోండి. పైగా వ్యాపారమంటే నిర్ణీత సమయాల్లోనే పని ఉండదు. కాబట్టి, వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని తగిన నిర్ణయం తీసుకోండి. ❑

# కెనడియన్ ఓపెన్‌లో ఒడిదుడుకుల్లో జెస్సికా



**న్యూఢిల్లీ:** కెనడీయన్ ఓపెన్-2025లో డిఫెండింగ్ ఛాంపియన్ అయిన జెస్సికా పెగులా ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. తన తొలి మ్యాచ్‌లో మరియా సక్కారి చేతిలో జెస్సికా పెగులా పూర్తిగా ఓడిపోయింది. అయితే రెండవ రౌండ్‌లో మాత్రం సక్కారిని అధిగమించి జెస్సికా ముందుకెళ్లింది. మాంట్రియల్‌లో గురువారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఒక గంటా 32 నిమిషాల్లో 7-5, 6-4 తేడాతో విజయం సాధించి తొలి సెట్‌లో ఐదు సెట్ పాయింట్లను కాపాడుకుంది. వింబుల్డన్ మరియు వాషింగ్టన్ ఓపెన్‌లలో వరుసగా తొలి రౌండ్ పరాజయాల తర్వాత ఈ అమెరికన్ అమ్మాయి జెస్సికా ఆటలోకి అడుగు పెట్టింది. తొలి సెట్‌లోని మూడో గేమ్‌లో మూడో సీడ్ సక్కరిని బ్రేక్ చేసింది, కానీ ఆమె ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన పెనుగులా ఆధిక్యం సంపాదించి తదుపరి నాలుగు గేమ్‌లను గెలుచుకుంది. పెగులా ఇలా తిరిగి విజయం సాధించినప్పటికీ, సక్కరికి మొదటి సెట్‌లో సర్వ్ చేసే అవకాశం లభించింది, కానీ ప్రపంచ నాలుగో నంబర్ క్రీడాకారిణి తనను తాను సజీవంగా ఉంచుకోవడంతో ఆమె తన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. తదుపరి గేమ్‌లో సక్కరిని బ్రేక్ చేయడం ద్వారా పెగులా సద్వినియోగం చేసుకుని తర్వాత సెట్‌ను ముగించింది, రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఈమె రెండవ సెట్‌ను విరామంతో ప్రారంభించి, ఐదవ గేమ్‌లో మళ్ళీ అదే చేసింది, అయితే కొద్దిసేపటికే సక్కరి తిరిగి తన విజయాన్ని నమోదు చేసుకుంది.

## ప్రపంచ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో 13 యేళ్ల తర్వాత భారత్‌కు కాంస్యం



**న్యూఢిల్లీ:** ప్రపంచ స్క్వాష్ జూనియర్ ఛాంపియన్‌షిప్-2025లో 13 సంవత్సరాల తర్వాత భారత్ తొలి బాలుర జట్టు పతకాన్ని సాధించింది. ఈజిప్టులోని న్యూ కైరోలో గురువారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో భారత జూనియర్ బాలుర టీం కాంస్య పతకాన్ని గెలుచుకుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన తర్వాత సెమీఫైనల్స్‌లో రెండో సీడ్ అమెరికా చేతిలో భారత్ ఓడిపోయింది. చివరికి ఈ టోర్నమెంట్ నుండి కాంస్య పతకాన్ని సాధించింది. అంతకుముందు, గత సంవత్సరం ఫైనలిస్ట్ అయిన దక్షిణ కొరియాను క్వార్టర్ ఫైనల్స్‌లో భారత్ జట్టు ఓడించింది, యుషా నఫీస్, కెవస్ అరిహంత్ చేసిన రెండు మ్యాచ్‌ల విజయాలతో 2-1 ఆధిక్యంతో చివరి నాలుగు స్థానాల్లో తమ స్థానాన్ని నిర్ధారించుకుంది. ఈ టైలో ఒక్క ఆట కూడా గెలవకపోవడంతో అమెరికా భారత జట్టుకు చాలా కఠిన పరీక్షగా నిలిచింది. మరోపక్క కెవస్ అరిహంత్, పిఆర్ సందేశ్ ఇద్దరూ వారి వారి వరుస మ్యాచ్‌లలో ఓడిపోయారు. సందేశ్ కేవలం 26 నిమిషాల్లోనే అలెగ్జాండర్ డార్ట్నెల్ చేతిలో 0-3 (3-11, 2-11, 5-11) తేడాతో ఓడిపోయాడు. అలాగే అరిహంత్ 28 నిమిషాల పాటు జరిగిన పోటీలో జాక్ ఎల్రియాని చేతిలో 0-3 (6-11, 4-11, 7-11) తేడాతో ఓడిపోయాడు. ఇంతలో, ఈజిప్ట్ చేతిలో క్వార్టర్ ఫైనల్ ఓడి పతక రేసు నుండి నిష్క్రమించిన భారత బాలికల జట్టు, కెనడాపై 5 నుండి 8వ స్థానం వరకు ప్లే ఆఫ్ టైను 2-0 తేడాతో కైవసం చేసుకుంది. అనాహత్ సింగ్ (3-0), అనికా దూబే (3-1) ఇద్దరూ వరుసగా స్ప్రింగ్ మా, జోయెల్ కిమ్‌లపై గెలిచి, భారత బాలికల టాప్6 స్థానానికి చేరారు.

## మకావు ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు తరుణ్, లక్ష్య

### ఆయుష్, ధ్రువ్-తనీషా జంట ఓటమి

**న్యూఢిల్లీ:** మకావు ఓపెన్-2025లో పురుషుల సింగిల్స్‌లో భారత్‌కు చెందిన మన్నేపల్లి తరుణ్, లక్ష్యసేన్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోగా, మిక్స్‌డ్ విభాగంలో ఆయుష్, ధ్రువ్ తనీషా జోడీ ఓటమిపాలైంది. గురువారం జరిగిన వరల్డ్ టూర్ సూపర్ 300 ఈవెంట్ మకావు ఓపెన్‌లో చైనాలోని హాంకాంగ్‌కు చెందిన టాప్ సీడ్ లీ చెయుక్ యియును ఓడించి, తరుణ్ ఈ సీజన్‌లో రెండోసారి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. గంటసేపు జరిగిన పోరాటంలో భారత ఆటగాడు 23 ఏళ్ల తరుణ్, ప్రపంచ 15వ ర్యాంకర్ లీని 19-21, 21-14, 22-20 తేడాతో ఓడించాడు. ప్రపంచ 47వ ర్యాంకర్ తరుణ్ ఈ ఏడాది సూపర్ 300 టోర్నమెంట్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోవడం ఇది రెండోసారి. ఫిబ్రవరిలో జరిగిన జర్మన్ ఓపెన్‌లో అతను అదే దశకు చేరుకున్నాడు. సెమీఫైనల్లో స్థానం కోసం తదుపరి



ప్రపంచ నం. 87 చైనాకు చెందిన హు ఝె ఆన్‌తో తలపడతాడు. అలాగే కామన్వెల్త్ గేమ్స్ ఛాంపియన్, రెండవ సీడ్ లక్ష్య, ఇండోనేషియాకు చెందిన చికో ఆరా ద్వి వార్డోయోను 21-14, 14-21, 21-17 తేడాతో గంటా ఏడు నిమిషాల్లో ఓడించాడు. 23 ఏళ్ల లక్ష్య క్వార్టర్ ఫైనల్స్‌లో మరో ఇండోనేషియాకు చెందిన యోహానెస్ సౌత్ మార్సెలినో లేదా చైనాకు చెందిన జు జువాన్ చెన్‌తో తలపడతాడు. అయితే, ఏడో సీడ్ భారత ఆటగాడు శెట్టి ఆయుష్ మలేషియాకు చెందిన జస్టిన్ హోహ్ చేతిలో 21-18, 21-16 తేడాతో ఓడిపోయాడు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో ఐదో సీడ్ భారత ద్వయం ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో తొలి గేమ్‌ను గెలుచుకున్న తర్వాత మలేషియాకు చెందిన జిమ్మీ వాంగ్-లై పీ జింగ్ చేతిలో ఓడిపోయారు. అలాగే మహిళల సింగిల్స్‌లో, యువ క్రీడాకారిణి రక్షిత శ్రీ సంతోష్ రామ్‌రాజ్ 51 నిమిషాల పోటీలో ఓడిపోయే ముందు థాయిలాండ్‌కు చెందిన రెండవ సీడ్ బుసానన్ ఒంగ్‌బమ్‌రుంగ్‌ఫాన్‌ను ఓడించి నిర్ణయాత్మక రౌండ్‌కు చేరుకుంది.









# భారత్, పాక్ మ్యాచ్ రద్దు

## టోర్నీ నుంచి వైదొలగిన టీమిండియా

## ఫైనల్‌కు దూసుకెళ్లిన పాకిస్థాన్

**న్యూఢిల్లీ:** వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్)-2025 నుంచి భారత్ ఛాంపియన్స్ టీమ్ వైదొలిగింది. దాయాది పాకిస్థాన్‌తో సత్ సంబంధాలు లేకపోవడం, సరిహద్దు ఉద్రికత్తల నేపథ్యంలో దాయాది జట్టుతో సెమీఫైనల్ మ్యాచ్ ఆడటానికి టీమిండియా ఆటగాళ్లు నిరాకరించారు. ఈ నేపథ్యంలో గురువారం భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ జరగలేదు. దీంతో పాకిస్థాన్ నేరుగా ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్‌లో మరోసారి పాకిస్థాన్‌తో తలపడాల్సి రావడంతో టీమిండియా కెప్టెన్ యువరాజ్ సింగ్, శిఖర్ ధావన్, హర్భజన్ సింగ్, ఇర్ఫాన్ పఠాన్, యూసుఫ్ పఠాన్ తదితర ఆటగాళ్లు తమ పాత వైఖరికే కట్టుబడి తాము పాక్‌తో ఆడబోమని స్పష్టంచేశారు. ఈ పరిణామం ఇప్పటికే ఉత్కంఠగా మారిన ఈ టోర్నమెంట్‌లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ఈ నెల 31న భారత్ ఛాంపియన్స్, పాకిస్థాన్ ఛాంపియన్స్ మధ్య సెమీఫైనల్ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఇటీవల పహల్గాం దాడి అనంతరం భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రికత్తలు నెలకొన్న విషయం తెలిసిందే. అప్పటినుంచి భారత్, పాకిస్థాన్ మధ్య ఎలాంటి మ్యాచ్‌లు జరగడం లేదు. డబ్ల్యూసీఎల్ 2025 టోర్నీలో లీగ్ దశలో కూడా పాకిస్థాన్‌తో ఆడేందుకు భారత్ ప్లేయర్స్ నిరాకరించారు. దాంతో ఆ మ్యాచ్‌ను రద్దు చేసి ఇరు జట్లకూ చెరో పాయింట్ ఇచ్చారు. ఇప్పుడు సెమీఫైనల్ మ్యాచ్ కూడా ఆడబోమని స్పష్టం చేయడంతో పాటు, భారత జట్టు అధికారికంగా టోర్నీ నుంచి తనంతతానుగా వైదొలిగింది. టోర్నీ స్పాన్సర్ ఈజ్‌మైట్రిప్ కూడా మ్యాచ్ స్పాన్సర్షిప్ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. ఇక యువరాజ్ సింగ్ నాయకత్వంలోని భారత్ ఛాంపియన్స్ టీమ్ వెస్టిండీస్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో గెలిచి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంను దక్కించుకుని సెమీస్‌కు దూసుకొచ్చింది. దీంతో తదుపరి పాకిస్థాన్‌తో సెమీఫైనల్ మ్యాచ్ భారత్ ఆడాల్సి ఉండగా, అది రద్దయింది. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య రెండో సెమీఫైనల్ జరగనుంది. ఆగస్టు 2న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. టోర్నీలో మొత్తం ఆరు టీమ్స్ తలపడ్డాయి.

## వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో.. ఫైనల్స్‌కు భారత్ మహిళలు

### ఖాతాల్లో నాలుగు పతకాలు ఖరారు

**న్యూఢిల్లీ:** ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో నలుగురు భారతీయ మహిళలు ఫైనల్స్‌కు చేరుకుని బంగారు పతక పోటీలకు దూసుకెళ్లారు. గ్రీస్‌లోని ఏథెన్స్‌లో జరిగిన అండర్ 17 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల ఫ్రీస్టైల్ రెజ్లర్లు అద్భుతమైన ఆరంభాన్ని సాధించారు. ఐదుగురు రెజ్లర్లలో నలుగురు తొలి రోజున ఫైనల్స్‌కు చేరుకున్నారు. రచన (43 కిలోలు), మోని (57 కిలోలు), అశ్విని విష్ణోయ్ (65 కిలోలు), కాజల్ (73 కిలోలు) తమ ప్రాథమిక రౌండ్ పోటీలలో ఆధిపత్య విజయాలతో ఫైనల్స్‌కు చేరుకున్నారు. అండర్ 17 ప్రపంచ ఛాంపియన్ (69 కిలోల) తదుపరి, కాజల్ వరుసగా రెండవ ఎడిషన్‌లో అండర్ 17 ఫైనల్‌కు చేరుకుంది. నాలుగు బౌట్‌లలో మూడింటిని పిన్‌ఫాల్ నిర్ణయంతో గెలుచుకోవడం, నాల్గవ బౌట్‌లో కూడా, ఆమె సెమీస్‌లో అమెరికాకు చెందిన ఎల్లా జో పాలిల్లోపై 11-0 తేడాతో ఆధిపత్య సాంకేతిక ఆధిపత్యాన్ని నమోదు చేసింది. మరోవైపు, అశ్విని సాంకేతిక ఆధిపత్యంలో రెండు విజయాలతో ప్రారంభించింది. క్వార్టర్ ఫైనల్‌లో పిన్‌ఫాల్ విజయంతో, సెమీస్‌లో లిలి ఎర్మోఖినాపై 7-0 తేడాతో విజయం సాధించింది. ఆసియా అండర్ 17 ఛాంపియన్ మోని కూడా క్వార్టర్ ఫైనల్‌లో తన రొమేనియన్ ప్రత్యర్థిని ఓడించి, సెమీ ఫైనల్‌లో అలీనా బరోవాపై 7-0 తేడాతో మరో సునాయాస విజయాన్ని సాధించింది. ఇక రచనా క్వార్టర్ ఫైనల్ బౌట్‌లో ఈజిప్ట్‌కు చెందిన మారేమ్ అబ్దేలాల్‌పై విజయాన్ని సాధించింది. కానీ సెమీస్‌లో అమెరికాకు చెందిన మాడిసన్ హీలేపై 1-1 తేడాతో విజయాన్ని నమోదు చేయడానికి తీవ్రంగా పోరాడాల్సి వచ్చింది. ఏకైక భారతీయ రెజ్లర్ కోమల్ వర్మ (49 కిలోలు) ఫైనల్స్‌కు చేరుకోలేకపోయింది. ఆమె ప్రత్యర్థి, అమెరికాకు చెందిన మోర్గాన్ టర్నర్ ఫైనల్‌కు చేరుకోవడంతో, రెపాచేజ్ ద్వారా కోమల్ కాంస్య పతకాన్ని గెలుచుకునే రెండవ అవకాశం ఉంటుంది.



# భారత్ వృద్ధికి ధోకా లేదు: ఐఎంఎఫ్ అంచనా

**న్యూఢిల్లీ, జూలై 31:** భారత వృద్ధి రేట్లపై క్రమంగా అంచనాలు పెరుగుతున్నాయి. ఇటీవల ఐఎంఎఫ్ దేశ జిడిపి 6.4శాతం మేర పుంజుకోగలదని అభిప్రాయపడింది. తాజాగా పలువురు ఆర్థికవేత్తలు కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వృద్ధి 6.5శాతం పెరుగుతుందని అంచనా వేసింది. ఇందుకు ప్రధానంగా అనుకూలమైన వడ్డీ రేట్లు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆదాయ పన్ను తగ్గింపు, పట్టణ డిమాండ్ పెరిగే అవకాశం వంటివి సహకరిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 3.7శాతం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉంటుందని భారతీయ రిజర్వ్ బ్యాంకు తెలిపింది. ఫలితంగా ఆర్‌బిఐ ఎంపిసి కీలక రేట్లలో మరో 25-50 బేసిస్ పాయింట్ల కోతకు నిర్ణయం తీసుకోవచ్చని పిడబ్ల్యూసి ఆర్థికవేత్తలు రానెన్ బెనర్జీ, మనోరంజన్ పటానాయక్ తెలిపారు. వడ్డీరేట్ల తగ్గింపు, పన్ను ఉపశమనం ఆర్థిక వ్యవస్థపై ఇప్పటికిప్పుడు కాకపోయినా ఆలస్యంగానైనా





సానుకూల ప్రభావం చూపుతాయని వారు అభిప్రాయపడ్డారు. ఈ పరిణామాల కారణంగా 2025-26 రెండో త్రైమాసికంలో కార్పొరేట్ త్రైమాసిక ఫలితాలు అంతకుముందు కంటే మెరుగ్గా నమోదయ్యే అవకాశాలున్నాయి. ఆర్థిక వృద్ధి స్థిరంగా ఉండేలా చూసుకోవడానికి ప్రభుత్వం వచ్చే దశాబ్దం పాటు మౌలిక సదుపాయాల పెట్టుబడుల విషయంలో ఇదే ఊపును కొనసాగించాల్సిన అవసరం ఉందని బెనర్జీ స్పష్టం చేశారు. మరోవైపు, గ్రామీణంలో పెరుగుతున్న వేతనాలు ఆ ప్రాంతాల్లో వినియోగాన్ని పెంచుతుందని, తద్వారా మొత్తం ఆర్థిక కార్యకలాపాలకు ది మద్దతు ఇస్తుందని రానెన్ బెనర్జీ తెలిపారు. సాధారణం కంటే ఎక్కువ రుతుపవనాలు వ్యవసాయ రంగానికి ప్రయోజనం చేకూరుస్తాయని, గ్రామీణ డిమాండ్‌ను మరింత పెంచుతాయని ఆయన అన్నారు. అయితే ప్రపంచ వాణిజ్యంలో నెలకొన్న అనిశ్చితి వల్ల ఈ రంగం ఎగుమతులపై ఒత్తిడి ఉందని ఆయన పేర్కొన్నారు.

# ఐదేళ్ల కనిష్టానికి పసిడి డిమాండ్!

**న్యూఢిల్లీ, జూలై 31:** అధిక ధరల కారణంగా పసిడి వన్నె తగ్గుతోంది. 2025లో బంగారం వినియోగం ఐదేళ్ల కనిష్ఠానికి పడిపోనుందని ప్రపంచ స్వర్ణ మండలి గురువారం వెల్లడించింది. పసిడి పెట్టుబడుల్లో స్వల్ప డిమాండ్ ఉన్నప్పటికీ.. పెద్దగా ప్రభావం చూపడం లేదని పేర్కొంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద వినియోగదారు అయిన భారత్‌లో ఈ ఏడాది గోల్డ్ డిమాండ్ 600 నుంచి 700 మెట్రిక్ టన్నుల వరకూ ఉండొచ్చని అంచనా వేసింది. ఇది 2020 నాటి కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. గతేడాది బంగారం గిరాకీ 802.8 టన్నులుగా ఉందని స్వర్ణమండలి రీజినల్ సీఈఓ సచిన్ జైన్ వెల్లడించారు. ధరలు స్థిరంగా ఉంటే.. 2025లో డిమాండ్ 700 టన్నుల వరకూ ఉండొచ్చని, అయితే భౌగోళిక, రాజకీయ అంశాల ప్రభావంతో అది సాధ్యం కాకపోవచ్చని చెప్పారు. జూన్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర లక్ష దాటింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 28 శాతం పెరుగుదల కనిపించింది. మునుపటి ఏడాదితో పోల్చుకుంటే.. ఈ ఏప్రిల్-జూన్‌లో బంగారం వినియోగం 10



శాతం పడిపోయింది. ఆభరణాల డిమాండ్ 17 శాతం తగ్గగా, అదే సమయంలో పెట్టుబడి డిమాండ్ 7శాతం పెరిగింది. 2024లో సెప్టెంబర్ త్రైమాసికంతో 248.3 టన్నుల గిరాకీ ఉండగా.. ఈ ఏడాది ఇదే సమయానికి ఆ మొత్తంలో తగ్గుదల ఉండొచ్చని పేర్కొంది. మరోపక్క.. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న అస్థిర పరిస్థితుల్లో ఇన్వెస్టర్లకు ఇది ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గంగా ఉంది. ఈ డిజిటల్ యుగంలో గోల్డ్ ఈటీఎఫ్‌లకు మంచి ఆదరణ ఉందని జైన్ వెల్లడించారు. ఇదిలా ఉంటే.. రికార్డు ధరల కారణంగా వినియోగదారులు చిన్నపాటి, తేలికైన ఆభరణాల వైపు మొగ్గుచూపుతున్నారు. వివాహాల కారణంగా కొనుగోళ్లు పెరగొచ్చనే అంచనాలున్నాయి.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, జూలై 31:** భారత ఎగుమతులపై 25శాతం సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో బెంచ్ మార్క్ ఇండియన్ ఈక్విటీ సూచీలు గురువారం అస్థిర సెషన్‌లో ప్రతికూలంగా ముగిసాయి. సెన్సెక్స్ 296.28 పాయింట్లు నష్టపోయి 81,185.58 పాయింట్ల వద్ద నిలిచింది. గురువారం ఈ సూచి 81,803.27 నుంచి 80,695.15 పాయింట్ల శ్రేణిలో ట్రేడ్ అయింది. నిఫ్టీ50 కూడా 86.70 పాయింట్లు నష్టపోయి 24,768.35 పాయింట్ల వద్ద నిలిచింది. టాటా స్టీల్, సన్‌ఫార్మా, ఎన్‌టిపిసి, అదానీ పోర్ట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.70-1.34 శాతం



రేంజ్‌లో ముగిశాయి. హిందుస్థాన్ యూనిలీవర్, ఎటర్నల్, ఐటిసి, కోటాక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్ల 3.61శాతం వరకు లాభపడ్డాయి. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీలు వరుసగా 1.05 శాతం, 0.93శాతం నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఎఫ్‌ఎంసిజి ఇండెక్స్ మార్కెట్ ధోరణులను అధిగమించి ఇమామీ, హిందుస్థాన్ యూనిలీవర్ నేతృత్వంలో 1.44శాతం లాభాలతో స్థిరపడింది. నిఫ్టీ ఫార్మా మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, హెల్త్ కేర్ సూచీలు ఒక శాతానికి పైగా నష్టాల్లో ముగిసాయి.

# పేటీఎం, గూగుల్‌పేకు ఐసిఐసిఐ ఝలక్

**ముంబై, జూలై 31:** యూపీఐ ఆధారిత లావాదేవీల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. గల్లీ దుకాణాల దగ్గర్నుంచి మాల్స్ వరకు ప్రతిచోటా గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే లావాదేవీలే జరుగుతున్నాయి. దీంతో ఆయా పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు వసూలుచేసేందుకు సిద్ధమైంది ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ. యూపీఐ లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్న పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు విధించనుంది. ఆగస్టు 1వ తేదీ నుంచే ఈ ఫీజులు వసూలుచేయనున్నట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దీనిపై ఈనెల ఆరంభంలోనే పేమెంట్ అగ్రిగేటర్లకు ఐసీఐసీఐ బ్యాంక్ సమాచారమిచ్చినట్లు తెలిసింది. ఐసీఐసీఐలో ఎస్క్రో ఖాతాను నిర్వహించే అగ్రిగేటర్‌పై ప్రతి లావాదేవీకి 2 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.6 వరకు ఛార్జీలు విధించనుందట. ఇక, ఎస్క్రో ఖాతా లేనివారైతే.. ఈ ఛార్జీలు రెట్టింపు కానున్నాయి. అంటే ప్రతి లావాదేవీకి 4 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.10 వరకు ఫీజులు వసూలు చేయనున్నట్లు సమాచారం. ఈ ఛార్జీలతో ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్న మర్చెంట్స్‌పై ఎలాంటి అదనపు భారం పడదు. కేవలం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మర్చంట్స్ కోసం డిజిటల్‌పేమెంట్లు నిర్వహించే పేమెంట్ అగ్రిగేటర్లపై మాత్రమే ఛార్జీలు ఉండనున్నట్లు ఐసీఐసీఐ తమ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. యూపీఐ లావాదేవీల నిర్వహణకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెల్లించాల్సిన మొత్తాన్ని ఇప్పటివరకు ఐసీఐసీఐబ్యాంకు భరిస్తోంది. ఈక్రమంలోనే ఖర్చులభారాన్ని తగ్గించుకునేందుకు బ్యాంకు ఈ ఛార్జీలు విధిస్తోన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులపై ప్రస్తుతం ఎలాంటి ఛార్జీలు లేవు. అయితే, అధిక విలువైన డిజిటల్ లావాదేవీలను నిర్వహించేందుకు ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ లావాదేవీలపైనా మర్చంట్ ఛార్జీలను ప్రవేశపెట్టనున్నట్లు ఇటీవల వార్తలు రాగా.. కేంద్రం వాటిని కొట్టివేసింది. అయితే, గతవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు ఉండాలని అభిప్రాయపడ్డారు.





# అదానీ ఎంటర్‌ప్రైజెస్ రాబడులు రూ.28 వేల కోట్లు!

**ముంబయి, జూలై 31:** అదానీ ఎంటర్‌ప్రైజెస్ తొలి త్రైమాసికంలో 49.5శాతం సమిష్టిలాభంలో క్షీణత చూపించింది. తొలి త్రైమాసికంలో కంపెనీకి 734.41కోట్లు మాత్రమే వచ్చిందని ప్రకటించింది. ఏడాదిక్రితం ఇదేకాలంలో రూ.1454.50 కోట్లు నికరలాభం ఆర్జించిన సంస్థ ఈ ఏడాది గణనీయంగా క్షీణించింది. క్రమానుగతంగా చూస్తే లాభాలు సుమారు 80శాతానికిపైగా తగ్గాయని నిపుణులు చెపుతున్నారు. గత త్రైమాసికంలో కంపెనీ అనూహ్యంగా లబ్ధిపొందింది. 3286 కోట్లు తన కోశా గారానికి రావడంతో లాభాలు పెరుగుదలను దోహదం చేసింది. ఇక మొత్తం రాబడులు పరంగాచూస్తే 9.7శాతం పెరిగి 27,961 కోట్లకు చేరాయి. అదే త్రైమాసికం వారీగాచూస్తే స్వల్ప వృద్ధి నమోదుచేసింది. 3.6శాతం మాత్రమేనని తేలింది. మొత్తంగా రాబడులుపరంగా వార్షిక పద్ధతిలో చూస్తే 13.7శాతం తగ్గాయి. ధరల్లో హెచ్చుతగ్గులు, సమీకృతవనరుల యాజమాన్యం, వాణిజ్య గనుల తవ్వకాలు వంటి వాటిలో నెలకొన్న ఒడిదొడుకులే రాబడులు కొంతమేర తగ్గాయి. ఇక నిర్వహణలాభం వరకూ చూస్తే 12శాతం తగ్గి 3786 కోట్లుగా ఉంది. ఈ మొత్తంలో 74శాతం అంటే 2800 కోట్లు అదానీ ఎంటర్ ప్రైజెస్ ఇంక్యుబేటిక్ బిజినెస్‌ల నుంచి వచ్చిందే. గ్రీన్ హైడ్రోజెన్, ఎయిర్ పోర్టులు, రోడ్లు, డేటా సెంటర్ ప్లాట్‌ఫామ్‌ల బిజినెస్‌లలో ఐదుశాతం పెరిగినట్లు కంపెనీ వెల్లడించింది. జూన్ మాసాంతానికి కంపెనీ బాహ్యారుణాలు 52,667 కోట్లుగా ఉన్నాయి. అదే గత మార్చిలో 49,306 కోట్లనుంచి గణనీయంగా సమీకరించింది. మొత్తం రుణాల్లో 60శాతం ఎయిర్‌పోర్టులు, రోడ్లు, కొత్త పారిశ్రామిక పార్కుల్లోనే పెట్టుబడులుగా పెట్టింది. ఈ విభాగంలో 2026 నుంచి రాబడులు నగదు లభ్యత పెరుగుతుందన్న అంచనాలతో ఈ విభాగాలకు ఆదాని ప్రాధాన్యతనిచ్చింది.





# వాణిజ్యం

## భారీ ఆఫర్లు వచ్చినా 'థింక్ మిషన్'కే మొగ్గు

**వాషింగ్టన్, జూలై 31:** ఇప్పుడిది కృత్రిమ మేధ యుగం. ఏఐ టాలెంట్ ఎక్కడ ఉన్నా లాగేసేందుకు టెక్ దిగ్గజాలు భారీ ఆఫర్లతో ఊరిస్తున్నాయి. కానీ ఓ ఏఐ స్టార్టప్ ఉద్యోగులు మాత్రం ఆ వలలో చిక్కలేదు. తమ సంస్థను నడిపిస్తోన్న మీరా మురాటీని ఒక్కరు కూడా విడిచివెళ్లలేదు. 2025 ఫిబ్రవరిలో థింకింగ్ మెషిన్స్ ల్యాబ్‌ను మీరా మురాటీ ఏర్పాటు చేశారు. మెటా, మిస్ట్రాల్, ఓపెన్‌ఏఐ వంటి కంపెనీల్లో పనిచేసిన 30 మంది పేరు పొందిన ఏఐ నిపుణులను ఆమె నియమించుకుంది. ఈ సంస్థలోని నైపుణ్యం మెటా (ఫేస్‌బుక్) దృష్టిని ఆకర్షించింది. దాంతో అక్కడ పనిచేసే ఏఐ నిపుణులను తనవైపు లాగేసుకునేందుకు మెటా ప్రయత్నించిందని, 10 మందికి పైగా ఉద్యోగులకు భారీ ఆఫర్లు ఇచ్చిందని ఓ కథనం వెల్లడించింది. ఈ ఏఐ నిపుణులకు 200 మిలియన్ల డాలర్ల నుంచి 500 మిలియన్ల డాలర్ల వరకు



మెటా ఆఫర్ చేసింది. ఓ ఉద్యోగికైతే ఏకంగా 1 బిలియన్ డాలర్లు (రూ.8,755 కోట్లు) ఇచ్చేందుకు కూడా సిద్ధమైంది. కొంతమందితో మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ నేరుగా సంప్రదింపులు జరిపారట కూడా. ఆ థింకింగ్ మెషిన్స్ ల్యాబ్‌ను పెట్టి సంవత్సరం కూడా కాలేదు. దాని నుంచి ఏ ఒక్క ఉత్పత్తి కూడా ఇంతవరకు మార్కెట్‌లోకి విడుదలవలేదు. కానీ ఆ సిబ్బంది మాత్రం మురాటీపై విశ్వాసం ప్రదర్శించారని ఆ కథనం వెల్లడించింది. ఇప్పుడు ఆ సంస్థ మార్కెట్ విలువ 12 బిలియన్ డాలర్లుగా ఉంది. మీరా మురాటీ అల్బేనియాలోని వ్లోర్ అనే పట్టణంలో జన్మించారు. స్కూలింగ్ అంతా అక్కడే పూర్తిచేసిన ఆమె.. పైచదువుల కోసం తన 16వ ఏట కెనడాలోని వాంకోవర్ ఐస్‌ల్యాండ్‌కు వెళ్లిపోయారు. ఆ దేశంలోనే పైచదువులు పూర్తి చేశారు. చదువు పూర్తయ్యాక 2011లో గోల్డ్‌మన్ శాక్స్‌లో ఇంటర్న్‌గా కెరీర్ ప్రారంభించారు. ఆ తర్వాత టెస్లాలో మూడేళ్ల పాటు పనిచేసింది ఆమె.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.